# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18, సంచిక: 12, డిసెంబర్ 2025

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 18 సంచిక: 12

సలహాదారులు, స్ఫూర్తిదాత,
కర్త, కర్మ, క్రియ మా ప్రభు
తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్: **పత్తి సుబ్రమణ్యం,**
శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్:
సాయినాథ్, రమేష్



**Email:**
srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.srivenkatesham.org
Phone: **040-27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| ధనుర్మాసము–గోదాదేవి | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం | 9 |
| ముక్తికి సోపానం – నారాయణ మంత్రం | 22 |
| మార్గదర్శకులు – మహర్షులు (సీరియల్) | 26 |
| రామాయణ రత్నాకరం (సీరియల్) | 30 |
| ముకుందమాల (సీరియల్) | 36 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం (సీరియల్) | 41 |
| తిరుమల సర్వస్వం (సీరియల్) | 46 |
| గీతామృతము | 51 |
| అభీష్టప్రదం హనుమద్వ్రతం | 54 |
| నవవిధ భక్తిమార్గాలు | 56 |
| ముక్కోటి ఏకాదశి | 59 |
| నాచ్చియార్ కోవిల్ | 60 |
| మాండవ్య మహర్షి తెలిపిన న్యాయం | 62 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |


# భక్తుని లక్షణాలు – భగవంతుని కృప

నీ పాద కమల సేవయు, నీ పాదార్చకుల తోడి నెయ్యము, నితాంతాపార భూతదయయును, తాపసమందార! నాకు దయ సేయగదే!

ఇది ఒక నిజమైన భక్తుడు తన భగవంతుని కోరే కోరికల చిట్టా. అతడు ఇవి తప్ప మరేవీ కోరడు. భక్తుడికి భగవంతుడు ఎప్పుడూ కళ్ళలో కనబడుతూ ఉండాలి, ఆయన పాదాలను అర్చిస్తూ, సేవ చేస్తూ ఉండాలి తప్ప విరామాన్ని సహించలేడు. అందుకే భక్తులు భగవంతుని యొక్క నిరంతర పాదసేవను ఆకాంక్షిస్తారు. ఆ తరువాత వీరు భగవంతుని భక్తులతోనే విహరించాలి తప్ప లౌకికుల సహవాసము గిట్టదు. ఇక భక్తునికి భూతదయ ఒక ఆభరణం వంటిది. ఇతరుల కష్టాలు తమ కష్టాలుగా భావించుకుని వాటిని తీర్చుటకు భగవంతుని ప్రార్థిస్తాడు. మరో రకంగా చెప్పాలంటే భగవంతుని పలుమార్లు ప్రార్థించే భాగ్యాన్ని ఈ భూతదయ ప్రసాదిస్తుంది. భూతదయ అంటే అన్ని ప్రాణుల పట్ల దయతో ఉండుట. ఇది భక్తిలో ముఖ్యమైన భాగం. మనం భుజించే ఆహారానికి ముందు ప్రాణులు భుజించాలని కోరుట భూతదయ క్రిందికి వస్తుంది. దీని వల్ల మన పూర్వజన్మ కర్మలు తొలగిపోతాయంటారు. మన చుట్టూ ఉండే ప్రకృతిని రక్షించుట, చెట్లు నాటుట ఇలా భగవంతుడు ప్రసాదించిన ప్రతి దాని పట్ల ప్రేమ కలిగి ఉండుట భూతదయ. భక్తునికి భగవంతుని పట్ల అచంచలమైన భక్తి, అన్ని జీవుల పట్ల దయ, కరుణ, సత్యం మరియు నిజాయితీతో జీవించుట, శాంతి, సహనం కలిగి ఉండుట, నిస్వార్థంగా పని చేయుట మొదలగు లక్షణాలు భక్తుడు కలిగి ఉండాలి. ఈ లక్షణాలతో భక్తుని హృదయ మూలంలో పరివర్తన చెందాలి తప్ప పై పై చూపులకు ఉండకూడదు. భక్తుడు సదా భగవంతుని మెప్పే ప్రధానంగా లక్షణాలను కలిగి ఉండాలి తప్ప ఇతరుల మెప్పుకై ప్రాకులాడరాదు. భక్తుడు అహంకారానికి ఆమడ దూరంలో ఉండాలి. ఎప్పుడైతే ఒక వ్యక్తికి అహంకారం ఆవహిస్తుందో అతని భక్తి తగ్గిపోతుంది. మరియు భగవంతుని కృపను పొందలేడు. అందుకే నిజమైన భక్తులు ఆ దేవదేవునికి భృత్యులైన వారికి భృత్యువులైన వారి భృత్యువుల భృత్యువులకు సేవకుడిగా ఉంటే చాలంటారు. ఈ భావంతో ప్రతి భక్తుడూ జీవించాలి. భక్తునికి వినయం కూడా భూషణం లాంటిదే. దీనిని ఎప్పుడూ కలిగి ఉండాలి. భోగ్యవస్తువులను విసర్జించాలి. కూడని పనులు చేయవద్దు. వ్యర్థపు మాటలు పలుకవద్దు. సదా దైవధ్యానమే సాగించాలి, ఊర్ధ్వగతులనే ఆశించాలి. తృప్తి కలిగి ఉండాలి. మరియు జ్ఞానం కలుగకుండా నిరోధించే కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం, అజ్ఞానం, అసూయ అనే ఈ ఎనిమిదింటిని మనలోంచి తరిమి వేయాలి. ప్రతి భక్తుడు సంసార దుఃఖాలన్నింటిని తొలగించుకుని పరమపద భాగ్యం లభించాలని కోరుకోవాలి. ఇవన్నీ కూడా ఉత్తమమైన భక్తుని లక్షణాలు. వీటిని సాధించుటకు నిరంతరము సాధన చేయువాడు శ్రీవేంకటేశ్వరునికి ప్రియుడు. నేటి కలియుగములో చాలామంది భక్తులు వీటిని సాధించలేకపోవచ్చును. అలాంటప్పుడు భగవంతుడే మనకొక చక్కని ఉపాయాన్ని చెప్పాడు. ''మమేకం శరణం వ్రజ'' నన్నే శరణు పొంది సుఖించు అని భగవద్గీతలో చెప్పాడు. కాబట్టి మనకు చేతనైనంత సాధన చేస్తూ భగవంతుని శరణు పొందినచో ప్రతి భక్తుడూ ఉత్తమ భక్తునిగా మారగలడు. మరియు భగవంతునికి ప్రియునిగా మనగలడనడంలో సందేహం లేదు. భగవంతుడు మళ్ళీ ఇలా చెప్పాడు. ''ఫల సాధనమైన నన్ను, అన్ని ధర్మాలను వాసనలతో పాటుగా విడిచిపెట్టి, నన్ను ఒక్కణ్ణి మాత్రమే ఉపాయంగా ఆశ్రయించు. నేను నిన్ను అన్ని పాపాల నుండి విడిపిస్తాను. దుఃఖించకు'' అని భగవద్గీతలో చెప్పాడు. కాబట్టి దీని ఆధారంగా సాధన చేయు భక్తుడు తప్పక భగవంతుని కృపను పొందగలడు.

**నమో వేంకటేశాయ**

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354**, Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన
ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు**
**స్వామివారి పవిత్ర పాదాలు**
(10"x8") **ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

**శ్లో ॥ఆమ్లాన హృష్య దవనీతల కీర్ణ పుష్పౌ**
**శ్రీవేంకటాద్రిశిఖరాభరణాయమానౌ**
**ఆనందితాఖిల మనో నయనౌ తవైతౌ**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే**

తాత్పర్యము – శ్రీవేంకటేశ్వరా! ఇంకను పూర్తిగా వికసించని నేలరాలిన పుష్పములు గల్గినవి, వేంకటాచల శిఖరమునకు ఆభరణములుగా నున్నవి, భక్తులందరి మనస్సులను కన్నులను ఆనందింపచేయగలవి యగు నీ పాదములను నేను రక్షకముగా పొందుచున్నాను.

**శ్లో ॥ప్రాయః ప్రపన్న జనతా ప్రథమావగాహ్యౌ**
**మాతుస్తనా వివ శిశో రమృతాయమానౌ**
**ప్రాప్తౌ పరస్పరతులా మతులాంతరౌతే**
**శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే**

తాత్పర్యము – శ్రీవేంకటేశ్వరా! శరణు పొందుట అనగా నీ పాదములను రక్షకములుగా ఆశ్రయించుటయే కనుక శరణాగతులకు పసిబిడ్డకు మొదట తెలియదగిన తల్లి స్తనముల వలె అమృతము వలె ఉన్నవి. వేరొక ఉపమానము లేక తమకు తామే సాటిగా ఉన్నవి యగు నీ పాదములే మొదట తెలియదగి ఉన్నవి. అట్టి నీ పాదములను శరణు పొందుచున్నాను.

# ముక్తిమార్గము

భావానువాదం:
శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య



## ముఖారి

సేవింతురా యీతనిఁ – జెలఁగి పరులిట్లనే
కావించె మమ్మునె – క్కడి దైవ మితఁడు

1. పాలచవి యితఁడెఱుఁగు – పాలఁబవళించె గో
పాలుఁడని నేమితని – భజియించఁగా,
పాలుపడి తల్లిచను – బాలు సహితంబు నే
కాలమునుఁ బాపె నె – క్కడి దైవ మితఁడు

2. పుట్టింపఁ దానె మఱి – పురుషోత్తముఁడు మంచి
పుట్టు వొసగీననుచుఁ – బూజించఁగా.
పట్టుకొని మముఁదెచ్చి- బలిమిఁ బుట్టువు లెల్లఁ
గట్టి పెట్టించె నె – క్కడి దైవమితఁడు

3. కర్మ కర్తారుఁడని – కడలేని పుణ్యముల
కర్మఫలముల దనకుఁ – గైకొలపఁగా
కర్మగతిఁ దెచ్చి వేం – కటవిభుఁడు మా ఉభయ
కర్మములఁ జెరిచె నె – క్కడి దైవమితఁడు





భావము – మేము సేవించగా ఈ దేవుడు మమ్మిట్లు చేసినాడు. ఇక ఇతరులితనిని మనసొప్పి సేవింతురా? ఇతడెక్కడి దైవము?

ఇతడు పాలరుచి తెలిసినవాడు. కృష్ణావతారమున పాలు దొంగిలించి త్రాగినవాడు గదా! మరియు పాలలోనే (క్షీరసాగరముననే) శయనించిన గోపాలుడు కదా! కాన ఇతనిని సేవించినచో పాలకు లోటే ఉండదని సేవించితిమి. కాని ఇతడు మాకు తల్లి చనుబాలు సైతము ఇకనెప్పటికిని లేకుండా చేసినాడు. ఇతడేమి దైవము?

జీవుల జననములకు కారణభూతుడు ఈ పురుషోత్తముడే. ఇతనిని పూజించినచో మనకు సకలైశ్వర్య సంపన్నమై, ఎట్టి లోటు లేని మంచి జన్మమును ఇతడనుగ్రహించునని పూజించితిమి. కాని ఈ దేవుడు అందుకని పూని బలవంతముగా మాకిక ఎట్టి పుట్టుకయు లేకుండా చేసినాడు. ఇట్టి వాడెట్లు దైవమగును?

ఇతడు కర్మలకన్నిటికిని కర్త కావున సత్కర్మలతో ఇతనినారాధింతుమేని ఇంకను సత్కర్మల నాచరించగ భాగ్యమబ్బునని నమ్మి ఎన్నో పుణ్యకర్మముల నొనర్చితిమి. ఆ కర్మఫలములనెల్ల ఈ దేవునకే సమర్పించితిమి. కాని కర్మగతిని ప్రవర్తింపచేసిన శ్రీవేంకటేశ్వరుడు మా పాప పుణ్యాత్మకములైన ఉభయకర్మలను సమూలముగా నశింపచేసినాడు. ఇతడేమి దైవము?

# ధనుర్మాసము – గోదాదేవి

: చిల్లర సీతారామారావు

మార్గశిర మాసము మహిమాన్వితమైనది. ఈ మాసము చాలా విశిష్టత కలిగిన మాసము. 'మాసానాం మార్గశీర్షోహం'. మాసములలో మార్గశీర్ష మాసము నేనే అని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ నుడివినాడు. మార్గశీర్ష మాసమున సూర్యుడు వృశ్చిక రాశి నుండి ధనుస్సు లోకి ప్రవేశిస్తాడు. ధనుస్సునుండి సూర్యుడు మకర రాశి లోకి ప్రవేశించే వరకు ఉన్న కాలము ధనుర్మాసము. ధనుర్మాసమున శ్రీమహావిష్ణువు మధుసూదనుడు అను పేర పూజలందుకుంటాడు. ధనుర్మాసమున వైష్ణవాలయములు భక్తులతో కళ కళ లాడుతుంటాయి. వైష్ణవాలయాలలో మొదటి 15 రోజులు చక్కెరపొంగలి, తదుపరి 15 రోజులు దధ్యోదనమును ప్రసాద రూపంలో భక్తులకు ఇస్తారు. ధనుర్మాస పూజలు అత్యంత పుణ్యసంపదను ప్రసాదిస్తాయి.



ధనుర్మాసము శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన మాసము. ఈ మాసమున శ్రీమహావిష్ణువును భక్తి శ్రద్ధలతో అర్చించిన వారికి మరల జన్మ అనునది ఉండదు. కలియుగమున మానవులు అల్పాయుష్కులు, దుర్బలురు, నానా శ్రమలచే బాధలు పడుతూ ధర్మాచారములను వదులుతున్నారు. అటువంటివారు ధనుర్మాసమున శ్రీమహావిష్ణువును భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తే, వారు సమస్త బాధలనుండి, పాపముల నుండి విముక్తులవుతారు. ధనుర్మాసమున దానములు చేయడం శ్రేష్ఠము. అన్నదానము చేసినవారికి వేయి కపిల గోవులను, పన్నెండు కన్యాదానములు చేసినంత పుణ్యము కలుగుతుంది. చలితో బాధపడువారికి గుడ్డలు, కంబళ్ళు దానము చేసినవారు ఇహ పర సౌఖ్యములను పొందగలరు. ఈ మాసమున శ్రీమన్నారాయణునకు ఆవునేతితో గాని, నువ్వులనూనెతో కాని అఖండ దీప ప్రదానము నెల రోజులు గాని, పదిహేను రోజులు గాని చేయడం ద్వారా ఎటువంటి రోగాల బారిన పడకుండా, సకల సౌభాగ్యములను బడయ వచ్చును. తులసీపూజను షోడశోపచారములతో చేసినవారికి వైకుంఠ ప్రాప్తి కలుగుతుంది.

ధనుర్మాసము చాలా సందడిగా, ఆనందంగా ఉంటుంది. స్త్రీలు, బాలికలు ప్రాతః కాలముననే లేచి స్నానాదికములు పూర్తి గావించుకుంటారు. గుమ్మములకు తోరణములు కడతారు. గడపలకు పసుపు రాసి కుంకుమ బొట్లు పెడతారు. గుమ్మం ముందరి వాకిళ్ళను శుభ్రపరుస్తారు. గోమయముతో కలిపిన నీటిని చల్లుతారు. వరిపిండితో ముగ్గులు పెడతారు. ముగ్గులమీద గోమయముతో చేసిన ముద్దలను ఉంచి, వాటికి కుంకుమ బొట్లు పెడతారు. పూలతో పూజలు చేస్తారు. ధనుర్మాసమున ధనుర్మాస వ్రతమును ఆచరిస్తారు. ఈ వ్రతమునకే శ్రీవ్రతము, మార్గళి వ్రతము అను పేర్లు కూడా ఉన్నాయి. వ్రతమును ఆచరించువారు శక్త్యానుసారము విష్ణు ప్రతిమను చేయించాలి. ఆ ప్రతిమను

పూజాగృహములో ప్రతిష్టించాలి. ప్రతిరోజూ వేకువజాముననే మేల్కొని స్నానాదికములు పూర్తి చేసుకోవాలి. తులసీదళములు, పూలు మున్నగువాటితో అష్టోత్తర, సహస్ర నామములు, షోడశోపచార పూజలు చేయాలి. చక్కెరపొంగలి, పులగం, దధ్యోదనం నైవేద్యంగా సమర్పించాలి. తిరుప్పావైను పఠించాలి. వ్రతాచరణ పూర్తయిన తర్వాత వేదశాస్త్రములు చదివిన, శీలవంతుడైన బ్రాహ్మణునకు ప్రతిమను దానము చేయుచు ఈ క్రింది శ్లోకమును చదువుతూ దానము ఇవ్వాలి.

**శ్లో ॥ "మధుసూదన దేవేశ ధనుర్మాస ఫలప్రద**
**తవమూర్తి ప్రదానేన మమ సంతూ మనోరథా"**

ఓ మధుసూదనా! దేవేశా! నీ మూర్తి దానముచే నాకు ధనుర్మాస ఫలమునిచ్చి నా కోరికలను సఫలీకృతము గావించుము అని శ్లోక భావార్థము. గోదాదేవి శ్రీరంగనాథుడిని పతిగా వరించి ధనుర్మాస వ్రతమును ఆచరించింది. ధనుర్మాసము నెలరోజులు రోజుకు ఒక పాశురము చొప్పున ముప్పయి రోజులు ముప్పయి పాశురములు రచించి శ్రీరంగనాథుడిని సేవించింది. ఈ పాశురాలే తిరుప్పావైగా ప్రసిద్ధికెక్కాయి. తిరుప్పావై అనగా సంపత్కరమైన వ్రతము అని అర్థము. వైష్ణవ ఆలయములలో ధనుర్మాసము ముప్పయి రోజులు తిరుప్పావైను పఠిస్తారు. తిరుప్పావై అంటే శ్రీమహావిష్ణువుకు చాలా ఇష్టము. శ్రీ రామానుజులు తిరుమల ఆలయము నందు పూజా విధానములను క్రమబద్ధం చేస్తూ ధనుర్మాసము నందు నిత్యం తిరుప్పావై పఠించేటట్లు కట్టడి చేశారు. అందువలననే శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయమున ధనుర్మాసము నెల రోజులు సుప్రభాతమునకు బదులు తిరుప్పావైను పఠిస్తారు.

జప తప హోమముల కంటెను, దాన యజ్ఞముల కంటెను, ధనుర్మాసము చాలా శ్రేష్ఠమైనదని పురాణోక్తి. ఎటువంటి యజ్ఞ యాగాదులు చేయకపోయినా, ధనుర్మాసమున శ్రీమహావిష్ణువుకు అత్యంత మోదమును కలిగించు పూజలు చేయు వారికి పునర్జన్మ ఉండదు. ధనుర్మాసము అనగానే స్ఫురణకు రెండు పేర్లు వస్తాయి. మొదటి పేరు విష్ణుచిత్తుడు. రెండవ పేరు గోదాదేవి. నిత్యస్మరణీయులైన వారిని భక్తిశ్రద్ధలతో స్మరించుకుందాం.

తమిళనాడులో ప్రసిద్ధ నగరము విల్లిపుత్తూరు. ఈ నగరమున శ్రీమహావిష్ణువు వటపత్రశాయి రూపమున భక్తుల చేత అర్చింపబడుతుంటాడు. విష్ణువు ఆలయమును మన్నారు కోవెల అంటారు. ఈ ఆలయములో ముకుందాచార్యులు వటపత్రశాయికి సేవలందిస్తూ జీవనము సాగించసాగాడు. ఆయన ధర్మపత్ని పద్మావతి. ఈ దంపతులకు చాలాకాలము వరకు సంతానము కలగలేదు. సంతానము కొరకు ఆ దంపతులు వటపత్రశాయిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తూ ఉండేవారు. వారి ప్రార్థనను మన్నించిన భగవంతుడు వారికి పుత్ర సంతానమును ప్రసాదించాడు. ముకుందాచార్యులు తన పుత్రునకు భట్టనాథుడు అని నామకరణము చేశాడు. భట్టనాథుడికి పెరియాళ్వార్ అను మరొక పేరు కూడా ఉంది. భట్టనాథుడికి చిన్నతనము నుండి విష్ణుభక్తి ఎక్కువ. తన ధ్యానము చేత విష్ణుమూర్తిని తన హృదయము నందు ప్రతిష్ఠించుకున్న భక్తుడు భట్టనాథుడు. భగవంతుని సేవకే తన జీవితమును అంకితము గావించుకొన్న భక్త శిఖామణి. ప్రజలు భట్టనాథుడి విష్ణుభక్తిని గమనించి, విష్ణుమూర్తిని తన హృదయము నందు ఉంచుకొన్నవాడు అని విష్ణుచిత్తుడు అని కొనియాడసాగారు. క్రమ క్రమముగా ఆయనకు విష్ణుచిత్తుడను పేరు ప్రజలలో వ్యాపించింది.

విష్ణుచిత్తుడు గొప్ప చదువరి కాదు. గొప్ప పండితుడు కాదు. కేవలం విష్ణుభక్తుడు. ఒకసారి పాండ్యరాజ్యమున ఉత్తర దేశము నుండి రాజసభకు ఒక సంస్కృత పండితుడు వచ్చాడు. తనతో సమానముగా వేదాంత తర్కమును గావించు వారున్నారా? అని సవాలు చేశాడు. రాజుగారికి విష్ణుచిత్తుడు స్మరణకు వచ్చాడు. ఆయనను రావించి – విష్ణుచిత్తా! నీవు ఆ సంస్కృత పండితునితో తర్కమునకు దిగాలి. నీకు విష్ణుభక్తి అధికము అని తెలుసు. నీ విష్ణుభక్తి నీకు సహాయకారిగా ఉంటుంది. దయచేసి నా గౌరవము కాపాడుము అని పలికాడు. రాజుగారి మాటలకు ఏమి జవాబియ్యాలో అర్థము కాలేదు. భగవంతుడి మీద భారం వేసి రాజు గారి ప్రార్థనకు అంగీకరిస్తాడు. సంస్కృత పండితునితో తర్కవాదమునకు దిగుతాడు. భగవంతుడి సహాయముతో విష్ణుచిత్తుడు సంస్కృత పండితుడిని పరాజితుడిని గావిస్తాడు. ఆ సంతోషముతో రాజుగారు విష్ణుచిత్తునకు రాజ్యములో అర్థభాగము ఇస్తానని పలుకుతాడు. నేను నా జీవితమును భగవంతునికి అర్పించాను. భగవంతుని సేవలోనే కాలం గడుపుతాను. అని పలికి తిరస్కరిస్తాడు. నా తృప్తి కోసమైనా మీరు శిరస్సు మీద మకుటం ధరించి పురవీధుల గుండా ఏనుగు మీద ఊరేగండి అని వేడుకుంటాడు. రాజుగారి ప్రార్థనను మన్నిస్తాడు విష్ణుచిత్తుడు. ఏనుగును అధిరోహించిన విష్ణుచిత్తుడు భక్త్యావేశముతో శ్రీమన్నారాయణుడి గురించి పల్లాండు – పల్లాండు అని పాడుతాడు. ఆ కవితా ప్రవాహము మనోహర దివ్యపాశుర యుక్త గ్రంథమైనది. ఆ గ్రంథము పేరు 'తిరుప్పల్లాండు'. తిరుప్పల్లాండు అనగా సర్వమంగళకర, గుణప్రధానుడైన, భగవంతుని వైభవమును, భక్తవత్సలతను వర్ణిస్తూ భగవంతునికి జయమగుగాక, మంగళమగుగాక అని ప్రశంస.

విష్ణుచిత్తుడు తన కుటీరమునకు వచ్చిన తరువాత భగవంతుడి సేవకు అవసరమైన తులసీదళములు, పుష్పములు మున్నగు వాటి కొరకు ఒక తోటను ఏర్పాటు చేసుకొన్నాడు. ప్రతి రోజూ తోటలోని తులసీదళములను, పుష్పములను సేకరించి, వాటిని ఒక మాలగా కట్టి శ్రీరంగనాథుడికి సమర్పించేవాడు.


ఒకనాడు తోటలో తులసిగట్టు మీద భూదేవి అంశతో తామరపుష్పము వలె శోభిల్లుతున్న ఒక పసిపాప కనిపించింది. సంతాన లేమితో బాధపడుతున్న విష్ణుచిత్తుడు భగవంతుడే ఆ బిడ్డను ప్రసాదించాడని మురిసిపోయాడు. ప్రేమతో ఆ పసిపాపను ఎత్తుకొని తన గృహమునకు వచ్చాడు. విష్ణుచిత్తుడి ధర్మపత్ని పాపను తీసుకుని అక్కున చేర్చుకున్నది. ఆ శిశువుకు 'కోద్రై' అని పేరు పెట్టారు. కోద్రై అనగా పూలదండ అని అర్థము. 'కోద్రై' నామము క్రమముగా గోదాదేవిగా మారిపోయింది. 'గాః దదాతి గోదా' అనగా మధురమైన చక్కని వాక్కుని ఇచ్చునది అని అర్థము. గోదాదేవి చిన్నతనమున తన ఆటపాటలతో తల్లితండ్రులకు ఆనందమును కలిగించేది. గోదాదేవి చిన్నతనమునుండే భక్తి, జ్ఞాన, వైరాగ్యాది గుణములను అలవరచుకున్నది. విష్ణుచిత్తుడు తన శిష్యులకు విష్ణుభగవానుని కథలను వినిపిస్తుండగా, వాటిని శ్రద్ధగా వింటూ విష్ణువు మీద ఆసక్తిని పెంచుకున్నది. క్రమక్రమముగా ఆ ఆసక్తి ప్రేమగా మారి శ్రీరంగనాథుడే తన భర్త అని తలపోసింది.

విష్ణుచిత్తుడు ప్రతిరోజూ తోటలోనికి వెళ్ళి తులసీదళములను, పూవులను సేకరించి వాటితో ఒక మాలను కట్టి ఒక బుట్టలో పెట్టెడివాడు. తన కార్యక్రమములు ముగిసిన తరువాత ఆ మాలను తీసుకుని దేవాలయమునకు వెళ్ళి శ్రీరంగనాథుడికి సమర్పించేవాడు. ఇలా కొంతకాలం గడిచిపోయింది. గోదాదేవి యుక్తవయస్కురాలైంది. ఒకనాడు తండ్రి కట్టిన మాలను తాను ధరిస్తే ఎలా ఉంటుందా అని ఆలోచన వచ్చింది. తండ్రి లేని సమయమున పూలమాలను తీసుకువెళ్ళి బావి సమీపమున దానిని ధరించి, బావిలో తన అందమును చూచుకున్నది. తన అందమునే నీటిలో చూచుకుని మురిసిపోయింది. తర్వాత మెల్లగా దానిని తీసి యథాస్థానమునందు ఉంచెడిది. ఇది తెలియని విష్ణుచిత్తుడు ఆ మాలను శ్రీరంగనాథ స్వామికి సమర్పించేవాడు.

ఒకనాడు విష్ణుచిత్తుడు గోదాదేవి పూలమాలను ధరించి బావి నీటిలో తన అందమును చూచుకొని మురిసిపోవటం గమనించాడు. మాల అపవిత్రమైనదని బాధపడసాగాడు. మాలను అపవిత్రం చేసిన కూతురుని ఏమీ అనలేకపోయాడు. గోదాదేవి ధరించిన మాలను శ్రీరంగనాథునికి సమర్పించడానికి మనస్సు అంగీకరించలేదు. మథనపడుతున్న విష్ణుచిత్తుడి కలలోనికి శ్రీరంగనాథుడు ప్రత్యక్షమైనాడు. అతడితో 'విష్ణుచిత్తా! నీవు మాలను సమర్పించలేదని బాధపడనవసరం లేదు. గోదాదేవిని ఏమని భావించావు? గోదా దేవి సాక్షాత్తు భూదేవి అవతారము. నాకు పూలదండను అర్పించడానికే ఆమె ఆవిర్భవించింది. ఆమె ధరించిన మాల అంటేనే నాకు చాలా ఇష్టము. ఆ మాలను నాకు సమర్పించుము అని పలికి అంతర్ధానమయ్యాడు. విష్ణుచిత్తుడు స్వామివారి ఆదేశానుసారం గోదాదేవి ధరించిన మాలను సమర్పించసాగాడు.

యుక్తవయస్కురాలైన గోదాదేవి శ్రీరంగనాథుడిని తన భర్తగా పొందాలనుకొని కాత్యాయనీ వ్రతమును ఆచరించింది. రంగనాథుడి గుణ గణములను వర్ణిస్తూ గీతములను రచించింది. ఆ గీతములను పాశురములు అని పిలుస్తారు. ధనుర్మాసమున రోజుకు ఒక పాశురము చొప్పున ముప్పయి పాశురములను రచించింది. రచించిన పాశురములను శ్రీరంగనాథ స్వామికి సమర్పించింది. ఆ ముప్పయి పాశురముల దివ్యగ్రంథమే తిరుప్పావై. తిరుప్పావై లోని గీతాలు భక్తి విశ్వాసాలకు ప్రతీకలు. వేద పురాణ ఉపనిషత్తుల సారాంశమే తిరుప్పావై. తిరు అనగా శ్రీ అని, పావై అనగా వ్రతము అని అర్థము.

శ్రీరంగనాథుడు గోదాదేవి భక్తికి ప్రసన్నుడైనాడు. ఆమెను వివాహము చేసుకోవాలని సంకల్పించుకున్నాడు. ఒకనాడు విష్ణుచిత్తుడికి కలలో కనిపించి – విష్ణుచిత్తా! నేను గోదాదేవిని వివాహమాడ సంకల్పించుకున్నాను. ఆమెను పెళ్ళికూతురిగా అలంకరించి, మేనాలో ఆమెను శ్రీరంగమునకు తీసుకొని రమ్మ అని ఆదేశించాడు. స్వామివారి ఆదేశానుసారం విష్ణుచిత్తుడు గోదాదేవిని పెళ్ళికూతురిగా అలంకరించి, మేనాలో శ్రీరంగమునకు తీసుకొని వెళ్ళాడు. శ్రీరంగములో గోదాదేవి, శ్రీరంగనాథులకు వివాహమును జరిపిస్తాడు విష్ణుచిత్తుడు. గోదాదేవి భక్తి శ్రద్ధలతో శ్రీరంగనాథుని పాదములకు ప్రణమిల్లి ఆయనలో ఐక్యమైపోయింది.



ధనుర్మాసమున ధనుర్మాస వ్రతమును సర్వులూ ఆచరించవచ్చును. ఈ మాసమున తిరుప్పావైను గానము చేయాలి. వైష్ణవాలయములను దర్శించాలి. తిరుప్పావై రచయిత్రి గోదాదేవిని ఆండాళ్ అనగా రక్షకురాలు అని, చూడికొడుత్త నాచ్చియార్ అనగా ముడిచిన మాలలను ఇచ్చునది అని అర్థము. ఈ పదములనే సంస్కృతీకరించి శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద అను ప్రబంధ రాజమును రచించాడు. మార్గశిర మాసములో వచ్చు ధనుర్మాసమున విష్ణునామ సంకీర్తనలు, తిరుప్పావై గీతములు మున్నగునవి పఠిస్తూ, ధనుర్మాస వ్రతమును భక్తి శ్రద్ధలతో ఆచరించి జీవితమునకు సార్థకత చేకూర్చుదాము.



33వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్ద్దేశం

## స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**



శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**– గోవింద దాసు**

**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**


**దిశా నిర్దేశం :**

సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారీగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వారా ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగా చేయుటకు వీలుగా స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 33 వ భాగపు లీలల ప్రచురణ. (సెప్టెంబర్ 2020 నుండి డిసెంబర్ 2020 వరకు).



## తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 18వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

**సెప్టెంబర్ 2020 :** గత 6 నెలలు నుండి దేశంలో 'కరోనా–19' మహమ్మారి విజృంభిస్తున్నందున ప్రభుత్వము వారు ఆంక్షలు విధించారు. ముఖ్యంగా ఆధ్యాత్మిక సమావేశాలను నిషేధించారు. టిటిడి ఆలయంలో కూడా చాలా రోజుల వరకు భక్తులకు ప్రవేశం లేదు. కాని జులై 2020 నుండి కొద్దిమందిని అనుమతిస్తున్నారు. పర్యాటక ప్రదేశము కావటం వలన తిరుపతిలో కోవిడ్ అధికంగా ఉన్నది. 18వ జప సమర్పణకు టిటిడి వారు కేవలం 6 మందికి అనుమతించి జప సమర్పణ చేసుకొమ్మన్నారు. కాని కోవిడ్ భయం వలన మా ఆఫీసు వారు తిరుపతికి రామన్నారు. నా భార్య, పిల్లలు కూడా నన్ను తిరుపతికి పోవద్దన్నారు. ఫలితంగా రథయాత్రను విరమించుకున్నాము. హైదరాబాద్ లోని మా ఇంటిలో మూడు రోజుల పూజలు చేసి జపాన్ని ట్రాన్స్ పోర్టులో తిరుపతికి పంపాము. మేము రానప్పటికీ సమర్పించమని ఎస్.వి దైరీఫాం అధికారులకు విన్నవించాము. ఇక గోకులాష్టమి తేది 06-09-2020 నాడు మా ఇంటిలో ఉన్న నమో వేంకటేశాయ రథం ముందు యజ్ఞం చేసి స్వామివారిని ప్రార్థించాము. మరియు మా నైబర్స్ చే 19వ పర్యాయంగా 7 కోట్ల జపానికి శ్రీకారం చుట్టించాము. చివరికి ఇలా కోవిడ్ కారణంగా రథయాత్ర నిర్వహించకుండా, తిరుపతికి వెళ్ళకుండా మీకు 18వ పర్యాయంగా 7 కోట్ల జపాన్ని సమర్పిస్తున్నామని, క్షమించమని, జపాన్ని స్వీకరించమని బాధాతప్త హృదయంతో

ప్రార్థించాను. ఈ విధంగా ఈ సంవత్సరం జప సమర్పణ అతి నిరాడంబరంగా సాగింది. కాని ఇదే అత్యంత ప్రధానమైనదని, నా జీవితానికి మలుపు త్రిప్పేదని ఊహించలేకపోయాను.

## కళ్యాణాల కార్యక్రమం ఇష్టంతో ప్రసాదించినట్లు నిదర్శనాలు చూపుట

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 111 కళ్యాణాలను చేయించాలనే సంకల్పం తీసుకున్న విషయం విదితమే! ఒకప్రక్క దీని గురించి ఏర్పాట్లు జరుగుచున్నవి. మరియు ఈ కార్యక్రమాన్ని త్వరగా ప్రారంభింప చేయమని ప్రతిరోజూ రకరకాలుగా ప్రార్థించేవాడిని. స్వామివారి నుండి స్పందన లేకపోయేసరికి అసలు ఈ కార్యక్రమం స్వామివారి ఇష్టముతోనే జరుగుచున్నదా? అనే అనుమానం వచ్చింది. వెంటనే స్వామివారిని ఇలా ప్రార్థించాను. ప్రభూ శ్రీవేంకటేశ్వరా! ఈ కార్యక్రమాన్ని మీరు మీ ఇష్టంతోనే నాకు ప్రసాదించినట్లైతే "ఏదేని ఒక భక్తునికి ఈ కళ్యాణ ఉత్సవ కలను చూపి, అందులో నన్ను చూపించాలని, ఆ తరువాత వారు నాతో ఇలా కల కన్నామని, అందులో నన్ను చూచామని చెప్పాలని" అప్పుడే అది మీరు స్వయంగా చేయించుకున్నటుల భావించి సంతోషించగలనని వేడుకున్నాను. ఈ షరతును స్వీకరించినట్లు ఈ క్రింది చక్కని లీలను చూపారు.

మేము స్వామివారి నూతన సేవగా కళ్యాణాల కార్యక్రమమును చేపట్టామని, నాకు తెలిసిన స్వామి భక్తులకు చెప్పుచు సహకరించమని అడుగుట మొదలుపెట్టాను. అందులో వారాసిగూడ నుండి శ్రీమాన్ రమేష్ అని ఒకరు. మంచి స్వామి సేవకుడు మరియు భక్తుడు. ఇతడు మా నమో వేంకటేశాయ రథంతో కూడా కొన్ని సంవత్సరాలు తిరిగాడు. ఈ కళ్యాణాల కార్యక్రమమును చెప్పినప్పుడు చాలా సంతోషించాడు. మరియు శక్తిమేర సహకరించుదునన్నాడు. సంకల్ప విషయాన్ని చదివి పరమానంద భరితుడైనాడు, ఆనందముతో ఈ సంకల్పాన్ని తన ఫేస్ బుక్ లో అప్ లోడ్ చేసుకున్నాడు. స్వామివారు నా ప్రార్థనను ఈ రమేష్ ను ఉపయోగించుకుని ఈ క్రింది విధంగా తీర్చారు.

**తేది 06-09-2020 కల:** ఈ కల శ్రీమాన్ రమేష్‌కు వచ్చింది. నాతో ఇలా చెప్పాడు. మేము సంకల్పించిన 111 కళ్యాణాలలో మొదటి కళ్యాణము చాలా బాగా జరిగిందట. చాలామంది భక్తులు తిలకించి సంతోషించారట. కళ్యాణము తరువాత అందరు భక్తులు నా వద్దకు మరియు ప్రక్కనే ఉన్న రమేష్ వద్దకు వచ్చి "చాలా బాగుంది, మా వద్ద కూడా చేయండని అన్నారట. దీనిని ఆహ్వానించుటకు ఏమి చేయాలనే విషయమై రకరకాలుగా ఒకరిపై ఒకరు పడుచు అడుగుచున్నారట. ఇంతమంది జనాలను తట్టుకోలేక "ఇలా చాలామంది భక్తులు వస్తుంటారు



కళ్యాణాలకు ఎలా సంప్రదించాలని భక్తులు అడుగుట

రమేష్ మనం వెళ్ళుదామని" నేను కలలోనే అన్నానట. ఆయన స్కూటర్ ను నడుపుచుండగా నేను వెనక కూర్చుని వెళ్ళు సందర్భాన మరికొంతమంది భక్తులు పరిగెత్తుకొచ్చారట. ఇంతే కల. ఈ విషయాన్ని నేడు రమేష్ నాకు చెప్పినప్పుడు నేను చాలా సంతోషించి, స్వామివారు ఈ సేవను ఇష్టంతో ప్రసాదించారని ఆనందించాను.

## కళ్యాణాలకు సమ్మతి తెలిపిన (శ్రీలక్ష్మి) ఆండాళ్ మాత

**తేది 27-09-2020 :** తేది 26-09-2020 రోజున కళ్యాణాలకై ఆర్డరిచ్చిన విగ్రహాలు పూర్తైనవని కుంభకోణం నుండి వాటి ఫోటోలను వాట్సాప్ ద్వారా పంపారు. విగ్రహాలకు గోల్డ్ పాలిషింగ్ చేయడం వలన బాగున్నాయి. ఇష్టంగా, జాగ్రత్తగా, ఎంతో ఆత్రుతతో తిలకించాను. ఇక పెండ్లి పీటలు,




కళ్యాణాలకు సమ్మతిని తెలిపిన శ్రీ ఆండాలు మాత

సింహాసనాలు, విగ్రహాలు భద్రపరచుటకు పెట్టెలు తయారు చే యించవలసి ఉన్నది. స్వామివారికి ఒక నూతన సేవా కార్యక్రమము మొదలుపెట్టే సమయము ఆసన్నమైనదని మురిసిపోయాను, మనస్సు ఆనందంతో ఉరకలేసింది.

శ్రీవేంకటేశం అక్టోబర్ 2020 సంచికకు సంపాదకీయం వ్రాయాలని గత రెండు మూడు రోజుల నుండి ప్రయత్నించినప్పటికీ విషయం నచ్చక వ్రాస్తూ పడేస్తూ ఉన్నాను. ఇలా ఎప్పుడూ జరగలేదు. చివరికి తేది 27-09-2020 శ్రవణా నక్షత్రం రోజున సంపాదకీయం ఇలా వ్రాశాను. శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం 2002 దసరా రోజు ప్రారంభమైనదని, 2020 దసరా నుండి స్వామివారికి మరో నూతన కళ్యాణ సేవను ప్రారంభిస్తున్నామని వ్రాశాను. ఈ కార్యక్రమము నాకు ఆనందంగా ఉండాలని, ఏ రోజూ ఇక చాలు అనే భావము కలగకుండా, ఇంకా కావాలనే భావముతో ఉండాలని ప్రార్థించాను. మరియు దీనిని నిర్వహించుటకు తగిన శక్తిని, సహకారాన్ని అందించాలని శ్రీదేవి, భూదేవీ సమేత తిరుమల శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థించాను. ఇలా సంపాదకీయం వ్రాయడమే కాకుండా నిజంగా కూడా నా ప్రభువును మరియు శ్రీమహాలక్ష్మి, పద్మావతి అమ్మవారిని హృదయపూర్వకంగా దీనంగా ప్రార్థించాను. ఈ సందర్భంగా భక్తిభావంతో నా ఒళ్ళు పులకరించింది. మరియు ఈ కార్యక్రమానికి ఇంతవరకు శ్రీవేంకటేశ్వరుని అనుమతి మాత్రమే లభించిందని, అమ్మవారి అనుమతి లభించలేదని చింతించాను. కళ్యాణమంటే ఇద్దరి అనుమతి అవసరమని భావించాను. వెంటనే అత్యంత ఆర్తితో శ్రీమహాలక్ష్మిని కళ్యాణాలకు ఒప్పుకొమ్మని, అనుమతించమని నా కళ్ళనుండి నీరు కారుచుండగా ప్రార్థించాను. మీరు ఏదో ఒక రూపములో... లక్ష్మీదేవి, పద్మావతీదేవి, గోదాదేవి లేదా ఆండాళ్ ఇందులో మీకు నచ్చిన ఒక రూపములో కనబడి మీ అనుమతిని ప్రసాదించవలసిందిగా అత్యంత ఆర్తితో వేడుకున్నాను.

గత కొంత కాలంగా మా సాధనలో భాగంగా, ప్రతి శ్రవణా నక్షత్రం రోజు రాత్రి మూడు గంటలకు స్వామివారిని పూజించుట అలవాటు చేసుకున్నాము. తేది 27-09-2020 శ్రవణా నక్షత్రం కావడం వలన సురేఖ అర్ధరాత్రి 2 గంటలకు లేచి అన్నీ సిద్ధం చేయగా నేను మాత్రం 2.30 గంటలకు లేచి స్నానాదులు ముగించి స్వామివారికి సరిగ్గా 3 గంటలకు 108 వత్తులతో నేతి దీపమును వెలిగించి ప్రార్థించి మళ్ళీ పడుకున్నాను. ఈ రోజు

ఉదయం వచ్చిందీ కల. మా ఊరు చిన్నగుండవెల్లిలో అందరూ శైవ సాంప్రదాయస్తులే. ఒకే ఒక కుటుంబం రమణయ్య పంతులు మాత్రమే చాత్తాద శ్రీవైష్ణవులు. వీరికి ఒక కూతురు, పేరు ఆండాళ్ నా కంటే పెద్దది. నా చిన్నతనంలోనే ఆమెకు పెండ్లి చేసి హైదరాబాదుకు పంపించారు. కాలక్రమేణా వీరందరూ ఊరు విడిచి హైదరాబాదులో స్థిరపడ్డారు. వారి ఇంటిని కూడా అమ్మివేశారు. చిన్నప్పుడు నేను ఈ ఆండాళ్ తో ఆడుకున్నాను కాబట్టి ఆమె రూపు రేఖలు చక్కగా గుర్తున్నవి.

**కల :** ఆ రోజు నేను మా ఊరు చిన్నగుండవెల్లిలో ఉన్నాను. నిజానికి నేను హైదరాబాదులో నివసిస్తున్నప్పటికీ, మా ఊరిలో స్వామివారి కళ్యాణము లాంటి ఫంక్షన్ చేయు నిమిత్తమై వెళ్ళినట్లు కల కన్నాను. నేను మా పాత ఇంటిలోనే ఉన్నానట. ఒక సందర్భములో ఏదో ఒక పనిమీద రచ్చబండ వద్దకు వెళ్ళాను. అప్పుడు అక్కడ నాకు 16 సంవత్సరాల వయసప్పుడు ఎలా ఉన్నదో అదే విధంగా ఈ ఆండాళ్ అనే ఆమె కనబడ్డది. ఆమె తన ఏడెనిమిది మంది స్నేహితురాళ్ళతో కనపడి మాట్లాడింది. ఏదో మాట్లాడుతునే ఉన్నది. చిత్రమేమిటంటే నేను, నేడు ఎలా ఉన్నానో, అదే 60 సంవత్సరాల వయస్సుతో ఇదే రూపంగా ఉండి ఆమెతో మాట్లాడుచున్నాను. కాని ఆమె ప్రస్తుతం 64 సంవత్సరాలు ఉన్నప్పటికీ, ఈనాటి వయస్సుతో కాకుండా, 16 సంవత్సరాల పెండ్లి కాని అమ్మాయి లాగానే, ఆనాటి ఆమె ముఖ కవళికలతో కనబడ్డది. ఆమెను చూడగానే ఈమె ఆండాళ్ అని కలలోనే గుర్తించాను. బ్లూ కలర్ లంగా, తెల్లరంగు ఓణీ ధరించి ఎర్రని మేని ఛాయతో, నిండు చెంపలతో చక్కని తిరునామము ధరించి కనిపించింది. ఈమె రూపు రేఖలు మనము ఫొటోలో చూచే ఆండాళ్ మాదిరిగానే ఉన్నవి. ఆ రోజు ఈ కళ్యాణము నిమిత్తమని మా ఊరివారందరూ వారిండ్లను పూలమాలలతో, మామిడి తోరణాలతో అలంకరించి పెట్టారు. ఇలా ఊరంతా పండుగ వాతావరణము నెలకొన్నది. ఇంతలో మా నమో వేంకటేశాయ రథమునకు పని చేసే మా వారు, ఒక వ్యవసాయ ఎడ్లబండి పైన ఒక 5 అడుగుల పొడవు, రెండడుగుల వ్యాసము కలిగిన వస్తువుకు తెల్లటి బట్టను చుట్టి బండిపై తెస్తున్నారు. దీనిని చూచిన వెంటనే కళ్యాణానికి స్వామివారు వస్తున్నారని ఆకాశవాణి నుండి మాటలు వినిపించాయి. ప్రక్కన కొన్ని ఇళ్ళ వారు స్వామివారిని ఆహ్వానించడానికి సిద్ధంగా వారి వారి ఇండ్లలో ఉన్నారట. దీనిని చూచిన శ్రీ ఆండాళ్, మీరు మా ఇంటికి కూడా రావాలి "నేను వెళ్ళి అంతా సిద్ధం చేసి, నేను సిద్ధమై ఉంటాను" అంటూ అక్కడ నుండి పరుగు పరుగున వెళ్ళిపోయింది. మీరు ఈ ఊరిలోని ఇల్లును అమ్మారు కదా? ఇంకా మీకు ఇక్కడ ఇల్లు ఉన్నదా? అని నేను సంశయముతో అడిగాను. అందుకు ఆమె "హా ఉన్నది" అంటూ మా క్రొత్త ఇంటి వైపు సిద్ధం కావటానికి వెళ్ళిపోతూ ఆత్రుతతో నన్ను మరోసారి ఆహ్వానించింది. వెంటనే "నేను పెండ్లి కూతురుగా సింగారించుకుని ఉంటాను, నీవు వచ్చి నన్ను తీసుకెళ్ళి పెండ్లి జరిపించు" అంటూ ఒక హృదయాంతర భావం ఏర్పడ్డది. కల చెదిరింది.

ఈ విధంగా శ్రీ ఆండాళ్ మాత తిరుమల శ్రీవేంకటేశ్వరునితో తన కళ్యాణములకు సమ్మతిని తెలిపారు. అమ్మ అనుగ్రహము కూడా లభించినందులకు ఎంతో ఆనందించాను.

## శ్రీనివాస కళ్యాణాలు మొదలుపెట్టుటకు పూర్వాపరాలు

శ్రీవేంకటేశ్వరునికి నేను సంపూర్ణ శరణాగతి చేశాను. నా సంపూర్ణ వ్యక్తిత్వమును కోల్పోయాను, నేను వారి సేవకుడనే భావము నా మూలము నుండి జరిగింది. మీ సేవ చేస్తూ ఉంటాను, నా గురించి నేను పట్టించుకోను, నా బాగోగులు నీవే అనే ధోరణిలో నాలో మార్పు జరిగింది. శ్రీవేంకటేశ్వరుని శిక్షణలో ఈ మార్పు నా మూలం నుండి జరిగింది. కాని 16వ జప సమర్పణ తరువాత ఈ భావం నాలో నిద్రావస్థ లోనికి వెళ్ళిపోయింది. దీనిని గమనించిన శ్రీవేంకటేశ్వరుడు ఈ క్రింది కొన్ని లీలలను ప్రయోగించి మళ్ళీ జాగృతం చేశారు.

**తేది 24-10-2020 :** గత 18 సంవత్సరాల నుండి స్వామివారికి చేయు సేవలైన 1. ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ, 2. నమో వేంకటేశాయ రథయాత్ర, 3. భజగోవిందం లాంటి వాటిల్లో ఒక్కదాన్నైనా స్వామివారు కోరుకోలేదు. నా ఇష్టపూర్వకంగా ఈ సేవలను చేయాలని నిర్ణయించి, దానిని సాధించే క్రమములో లోపాలను సరిదిద్దమని, సాధించుటకు శక్తిని ప్రసాదించమని ప్రార్థించినప్పుడు మాత్రమే అత్యంత వేగంగా స్పందించి సహాయపడ్డారు. కాని మొదట ఈ సేవను చేసిపెట్టమని కోరలేదు. అదేవిధంగా ప్రస్తుత 111 కళ్యాణాల సేవను కూడా ఆయన కావాలని కోరలేదు. నాకు స్వామివారి సేవాభాగ్యము మరింత కావాలని మంకుపట్టు పట్టినప్పుడు ప్రసాదించారు. ప్రస్తుతం నేను 60 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నాను. గత సేవలను కొనసాగిస్తున్నప్పటికీ, సంకల్పము పూరించాననే ఉద్దేశ్యముతో నాలో పట్టుదల, ఆత్రుత తగ్గుటచే నీరసించిపోయాను. మరో క్రొత్త సేవ కావాలనే ఆత్రుత మితిమీరింది. నా శారీరక దృఢత్వానికి సరిపోయే విధంగా క్రొత్త సేవను ప్రసాదించమన్నాను. నేను మీ వాడిని, ఈ దేహము మీది, లోకానికి ఉపయోగపడే విధంగా ఏదైనా మంచిపనికి ఉపయోగించుకోండని పదే పదే వేడుకున్నాను. ఇక నా 60వ పుట్టిన రోజు సందర్భంగా ఈ జీవితము దగ్గర పడుతున్నదని, మీకు సేవ చేసి తృప్తి చెందలేదనే ఒకరకమైన లోటుకు గురైనాను. పైగా నమో వేంకటేశాయ రథయాత్రను నిలుపుట కూడా దీనికి

ఆజ్యము పోసినట్లైంది. స్వామి సేవ నుండి దూరమగుచున్నానని బాధపడ్డాను. ఈ బాధచే స్వామివారిని "మీరు నాకు నా తనివి తీరా సేవాభాగ్యమును ప్రసాదిస్తానని మాట ఇచ్చారు, కాని ఇప్పుడు మధ్యలో నిలుపుట భావ్యమా? మీరు మాట తప్పుచున్నారా? మీరే నాకు తోడు లేకుంటే నా గతెట్లా? నాకింకెవ్వరున్నారు? నా భాగ్యం ఇంతేనా? అంటూ మొరపెట్టుకున్నాను.

మరోప్రక్క నా 60 వ పుట్టిన రోజున ఏమి చెయ్యాలంటూ, గురుతుల్యులైన ఉ.వే.ప్ర శ్రీమాన్ మరింగంటి కులశేఖరాచార్యులను అడిగాను. వారు శేషజీవితము సుఖసంతోషాలతో గడుపుటకు ఆరోగ్య యజ్ఞము చేయమన్నారు. దీనిని వినగానే నా గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. ఎందుకంటే దీనిని నా జీవితానికి అన్వయింప చేసుకుంటే మొత్తం నా జీవితం ప్రశ్నార్థకంగా మారిపోతుంది. నేను నా కోసం బ్రతకటం లేదు. శ్రీవేంకటేశ్వరుని సొత్తులాగా బ్రతుకుచున్నాను. నా సంపూర్ణ వ్యక్తిత్వముతో పాటు సర్వము అంకితము చేసి, స్వేచ్ఛ లేని పరాన్న జీవితము గడుపుచున్నాను. ఈ సందర్భములో శ్రీమాన్ కులశేఖరాచార్యులు నా శేషజీవిత బాగోగుల కోసం యజ్ఞం చేయమనేసరికి గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. ఒకసారి స్వామివారికి సమర్పించిన జీవితాన్ని తిరిగి లాక్కుని, దానికి యజమానినై, నా వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలా? అనే ఆలోచనలు వచ్చాయి. చివరికి నా శేష జీవితము గురించి మంచి చెడ్డలు చూసుకునే పని నేను చెయ్యను అనుకుని యజ్ఞం చెయ్యలేదు. ఈవిధంగా నాలో నిద్రావస్థలో ఉన్న సేవక భావము నాకు తెలియకుండానే జాగృతం చేయబడ్డది.

మరోప్రక్క నా స్వామి సేవాభాగ్యం అయిపోవుచున్నదని బెంగ ఏర్పడ్డది, దీర్ఘాలోచనలో మునిగిపోయాను, శరీర జవసత్త్వాలు పట్టుడిగి శక్తి కోల్పోయినట్లు అనిపించింది. ఏమి చేయాలో తెలియలేదు. ప్రతిరోజూ స్వామివారిని ప్రార్థిస్తున్నాను. "ఈ శరీరము మీది, నేను మీవాడిని, లోకానికి ఉపయోగపడే ఏదేని పనికి నన్ను వాడుకోండి" ఇదే ప్రార్థనను ప్రతిసారీ స్వామికి విన్నవిస్తున్నాను. గత 4-5 నెలల నుండి శ్రవణా నక్షత్రం నాడు చేసే ప్రత్యేక పూజలో కూడా ఇదే ప్రార్థన విన్నవిస్తున్నాను.

చివరికి నా పుట్టిన రోజు తేది 01-07-2020 తొలి ఏకాదశి వచ్చింది. అప్పుడు కోవిడ్-19 విజృంభించిన కారణంగా కేవలం 8 మంది సమక్షంలో మా ఇంటిలో శ్రీనివాస కళ్యాణము నిర్వహించాము. ఈ లోకానికి ఈశ్వరుడైన నా స్వామి కళ్యాణము జరుగుచున్నప్పుడు ఇంత తక్కువమంది ఉన్నారనే విషయం బాధకు గురి చేసింది, ఇది స్వామికి చిన్నతనంగా భావించాను. పైగా నేను సేవకుడిని, నేను ఇతరుల కొరకు, ఇతరుల చేత పూజలు చేయించాలి కాని నాకు నేను చేసుకోకూడదు. కాబట్టి ఇది నచ్చలేదు. స్వామిని ప్రార్థిస్తూ కళ్యాణంలో కూర్చున్నాను. అప్పుడు వచ్చింది ఆలోచన. నా శేషజీవితంలో తన భక్తులచే ఎన్నో కళ్యాణాలను చేయించాలని నిర్ణయించుకున్నాను. కావలసిన వేదికను ఏర్పాటు చేసి వేల మంది సమక్షంలో ఎన్నో కళ్యాణాలను నిర్వహించాలనే భావము మనస్సులో నాటుకున్నది. ఈవిధంగా కళ్యాణాల బీజం చిగురించింది. నాకు తగిన మరో సేవ స్వామి కృపగా లభించిందని భావించాను.

తరువాత తేది 19-07-2020 నాడు ఈ కళ్యాణాల సంకల్పాన్ని స్వామివారికి తెలియజేశాను. మరియు దీనికి అవసరమైన ప్రత్యేక విగ్రహాలను, సింహాసనాలను తయారు చేయిస్తున్నాను. తెలిసిన చాలామంది సంకల్పము బాగుందన్నారు, కాని శ్రీమాన్ కులశేఖరాచార్యులు మాత్రం 21" అంగుళాల విగ్రహాల విషయమై విభేదించారు. దీనితో నా మనస్సులో మళ్ళీ భయము ఏర్పడ్డది. చివరికి స్వామివారు నేను నిర్ణయించినట్లు ముందుకెళ్ళమన్నారు. ఇక తేది 19-10-2020 నాడు మూడు విగ్రహాలు ఇంటికి వచ్చాయి. కాని కోవిడ్-19 కారణంగా ప్రభుత్వము వారు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిషేధించారు. ప్రజలు జమకూడే పరిస్థితి లేదు. ఇలాంటి సందర్భములో ఈ కళ్యాణాల కార్యక్రమము ఎప్పుడు మొదలవుతుందా అని బెంగ ఏర్పడ్డది. కళ్యాణాల సంకల్పము అనుసారం దసరా 2020 నుండి దసరా 2021 వరకు కనీసం 7 కళ్యాణాలను నిర్వహించాలి. లేకుంటే మొదటి సంవత్సరంలోనే ఓడిపోయే ప్రమాదం ఉంది కాబట్టి ప్రతిరోజూ స్వామివారిని ప్రార్థిస్తున్నాను. కళ్యాణాలను ప్రారంభించుటకు సరైన పరిస్థితులను కల్పించమని వేడుకుంటున్నాను. ఇలాపదే పదే నా ప్రార్థనను విన్న స్వామివారు ఈ క్రింది లీలను చూపుచు నేనే వెనుక ఉన్నానన్నారు. ఈ కల నాకు తేది 24-10-2020 నవరాత్రి బ్రహ్మోత్సవ చక్రస్నానము రోజు వచ్చింది.

## కళ్యాణాల కార్యక్రమములో నేనే వెనక ఉన్నానని చూపుట

ఇది ఒక అద్భుతమైన, శ్రీవేంకటేశ్వరుడు కనికరించాడని తెలిపే కల. ఆయనకు కళ్యాణాల కార్యక్రమముపై నాకంటె ఎక్కువ ఆసక్తి ఉన్నదని తెలిపే కల. పైగా మనం భగవంతుని వైపు ఒక్క అడుగు వేస్తే, ఆయన మనవైపు నాలుగు అడుగులు వేస్తాడని నిరూపించే సంఘటన. గత కొంత కాలంగా కళ్యాణాల కార్యక్రమము త్వరగా ప్రారంభం కావాలని అయ్యవారిని, అమ్మవారిని పదే పదే ప్రార్థించాను. ఈరోజు మరీ ఎక్కువ ప్రార్థించాను. శరీరం పులకరించింది. కళ్ళనుండి ఆనంద బాష్పాలో లేక ఈ అవకాశం ఇంకా రాలేదనే నిరాశతో కూడిన కన్నీరో చెప్పలేను కాని నా కళ్ళవెంట నీరు కారింది. నా ప్రభువును ప్రార్థించి నాకు మీ సేవ లభించదా? అంటూ ఒక్కసారి నిట్టూర్చాను. తరువాత ఈ కల వచ్చింది.




**నమో వేంకటేశాయ రథం అలా పోవుచున్నదని చెప్పుచున్న సైనికులు**

**తేది 25-10-2020 కల :** ఒక ప్రాంతములో స్వామివారి కళ్యాణాన్ని నిర్వహించే నిమిత్తమై మా నమో వేంకటేశాయ రథం వెళ్ళుచున్నది. ''ఓం నమో వేంకటేశాయ'' అనే నామాన్ని పలుకుచూ అత్యంత వేగంగా ఈ రథం నగర వీధులలో పరుగులు తీస్తున్నది. దీనిని మా డ్రైవర్ కలీం నడుపుచున్నాడు. ఆ పుర వీధులు చాలా వెడల్పుగా బీటి రోడ్డు కలిగి హైదరాబాద్ లో ముఖ్యమైన ప్రాంతము లాగా ఉన్నవి. రథం ముందు వెళ్ళుచున్నది. నేను మాత్రం ఒక స్కూటర్ పై రథం వెనుక దానిని అనుసరిస్తున్నాను. రథం మాత్రం నాకు దొరకకుండా ''ఓం నమో వేంకటేశాయ'' అని శబ్దము చేస్తూ ఆలస్యమైనది అన్నట్లు వేగంగా ముదుకు పరిగెడుచున్నది. నేను కూడా నాకు ఆలస్యము అయినదని భావించి అతి వేగంగా వాహనాన్ని తోలుకుంటూ రథమును అనుసరిస్తున్నాను. రథం కనబడలేదు, కాని ''ఓం నమో వేంకటేశాయ'' అనే దాని శబ్దం మాత్రం వినబడుచున్నది. ఏ వైపు నుండి శబ్దము వినబడుచున్నదో ఆ వైపుకు నా వాహనాన్ని అతి వేగంగా నడుపుచున్నాను. ఇంతలో నాలుగు రోడ్లు గల పెద్ద కూడలి వచ్చింది. ఈ రోడ్డుపై నేను తప్ప మరెవ్వరూ లేరు. శబ్దము కుడి వైపు నుండి వస్తోంది కాబట్టి నేను కుడి వైపుకు తిప్పాల్సి ఉంది. కాని నేను అతి వేగంగా వెళ్ళుచున్నాను కావున కుడివైపుకు వెంటనే త్రిప్పలేకపోయాను. చివరికి కుడివైపుకు త్రిప్పే క్రమములో వాహనం వేగంగా ఉంది కాబట్టి ప్రక్కన రోడ్డు కర్బింగ్ స్టోన్ కు తాకే విధంగ అతి సమీపం నుండి వెళ్ళింది. నా వెనుక మరో వాహనం మీద వస్తున్న మా సురేఖ దీనిని గమనించి జాగ్రత్త జాగ్రత్త అంటూ కేకలు వేసింది. ఆమె కనబడలేదు కాని ఆమె అరుపులు మాత్రం వినిపించాయి. ఇంతలో నేనే సముదాయించుకుని ఆ రాయికి తగలకుండా నా వాహనాన్ని ప్రక్కకు త్రిప్పాను. తరువాత కుడివైపు రోడ్డులో రథాన్ని అనుసరించాను. ఇప్పుడు సురేఖ కూడా వేరే వాహనంలో నన్ను అనుసరిస్తోంది. అది ఒక విశాలమైన తారురోడ్డు మార్గము. మాకు ఎదురుగా చాలామంది వ్యక్తులు సిపాయిల్లా అలంకరించుకుని, గుఱ్ఱాలపై వస్తున్నారు. గుర్రాలను సహితం అలంకరించారు. వీరు ఎలా ఉన్నారంటే! ఒక పెండ్లికి జరిగే ఊరేగింపులో అలంకరించిన గుఱ్ఱాలపై ప్రత్యేకమైన డ్రస్సులను ధరించి ఉన్న వ్యక్తులలాగా ఉన్నారు. వారు హిందూ చిహ్నాలను, అలంకరణ వస్త్రాలతో పాటు, మెరుపు కలిగిన వివిధ రకాల శ్రీరాముని లాంటి చిత్రపటాలను పట్టుకొని ఉన్నారు. నాకు ఎదురుగా వస్తున్నారు, మరియు మా నమో వేంకటేశాయ రథం బాగుంది, చిత్రంగా ఉంది అంటూ ఒకరికొకరు చెప్పుకుంటూ

ముసి ముసి నవ్వులు నవ్వుచు నాకు ఎదురుగా వస్తున్నారు. రథమును చూచారా అని మేమడిగిన ప్రశ్నకు వారు అలా వెళ్ళుచున్నదని జవాబిచ్చారు. నేను ఇంకా కొంత దూరం వెళ్ళినా కూడా రథమును అందుకోలేకపోయాను. అక్కడ రెండు రోడ్లు వచ్చాయి. అప్పుడు నేను అక్కడి వారిని రథం ఏ వైపు వెళ్ళిందో అడిగి ఆ వైపు వెళ్ళుటకు ప్రయత్నించాను. అంటే... ఈ రథం నాకు దొరకకుండా ముందుకు వెళ్ళిపోయింది. చివరికి నాకు దాని శబ్దం కూడా చాలా చిన్నగా వినిపించీ వినిపించనంతగా అయింది. అంటే... మా రథం మరీ వేగంగా పరిగెత్తిందని అర్థం. నేను మాత్రం రథాన్ని అందుకోలేనని భావించి, నెమ్మదించి దానిని అనుసరిస్తున్నాను. ఈ ప్రాంతములో సురేఖ కూడా నాతో కలిసి రథం వెనుక వెళ్ళుచున్నాము. కల చెదిరింది.

దీనర్థం – ఈ కళ్యాణాల గురించి శ్రీవేంకటేశ్వరుడు నాకంటే ఎక్కువ ఆత్రుతతో ఉన్నాడని భావం. నేను వారి కళ్యాణాల సింహాసనాలను, ఇతర సామగ్రిని సేకరించుటలో వెనుకబడి ఉన్నానని, వీటిని సేకరించు లోపు పరిస్థితులను బాగు చేయునని ఒక భావం. కళ్యాణాలలో జరిగే స్వామివారి ఎదుర్కోలు ఊరేగింపులో శంఖు, చక్రాల లాంటి కొన్ని చిహ్నాలను ధరించాలని మరో భావం. స్వామివారి కళ్యాణాలలో మేము ఆత్రుతతో ఉంటామని కూడా చెప్పారు ఈ కార్యక్రమములో స్వామివారు నన్ను కంటికి రెప్పలా చూచుకుంటున్నారని కూడా భావించాను. స్వామివారికి మరియు వారి దేవేరులకు కోటి కోటి ప్రణామాలను సమర్పించుకున్నాను. ఈ రోజు దసరా, శ్రవణా నక్షత్రము నాడు స్వామి ఈ రకమైన లీలను చూపించుట నా అదృష్టము. మరియు ఈ కళ్యాణాల కార్యక్రమము 2020 దసరా నుండి ప్రారంభిస్తున్నామని స్వామివారితో చెప్పాను. కాని కోవిడ్ కారణంగా ఇప్పటికీ ఆధ్యాత్మిక సమావేశాలకు అనుమతి లేదు. అంతా స్వామి దయ. ఈ మొదటి సంవత్సరంలో కనీసం 7 కళ్యాణాలను చేయగలిగితే చాలు అన్నవిధంగా పరిస్థితులు ఉన్నవి.

## శ్రీవేంకటేశం మాసపత్రికపై నిరాశ

శ్రీవేంకటేశం డిసెంబర్ 2020 కూర్పు సందర్భంగా, నవంబర్ 2020 చివర నాలో ఈ పత్రిక పైన మళ్ళీ నిరాశ ఏర్పడింది. అప్పుడు నేను ఈ క్రింది విధంగా నా మనోగతాన్ని వ్రాసుకున్నాను.

**తేది 02-11-2020:** శ్రీవేంకటేశం మాసపత్రికను సాక్షాత్తు స్వామివారి ఆజ్ఞచే ఏప్రిల్ 2007 నుండి ప్రచురిస్తున్నాము. నాకు పత్రిక పట్ల అవగాహన, ప్రతిభ లేకున్న స్వామివారు బలవంతాన నాచే ఈ పత్రికను ప్రారంభింపచేశారు. ఏప్రిల్ 2007 నుండి నేటి వరకు (కోవిడ్ సందర్భంగా 2 నెలలు తప్ప) ప్రతి నెల ప్రచురించాము. మధ్యలో దీనిపై విరక్తి భావము కలిగి విరమించుకుందామనిపించింది. కాని స్వామివారు కొనసాగించమని చెప్పారు. ఒకసారి విరమించుకుంటాననటే తనను మోసం చేసినట్లు అవుతుందని హెచ్చరించారు. చివరికి 2016 సంవత్సరంలో నా సంకల్పసిద్ధి సమయాన విరమించుకుంటాననటే "ఇప్పుడే దమ్మొచ్చిందా" అంటూ హేళనగా మాట్లాడినారు. ఇంకా కొనసాగించమని వారి మనోగతంగా గుర్తించాను. కాని ఈరోజు డిసెంబర్ 2020 వ పుస్తకము కూర్పు సందర్భముగా మళ్ళీ నాలో నిరుత్సాహ భావం నిండింది. ఇక చాలు అనే విధంగా భావాలు వచ్చాయి. మరోప్రక్క స్వామివారు ఏ పనీ అర్థరహితంగా చేయించరు, ఎందుకు నాచే ఈ పనిని చేయిస్తున్నారో ఆయనకే తెలుసు, పైగా ప్రచురణ మానుకుంటే స్వామి ఆజ్ఞను అవహేళన చేసినవాణ్ణి అవుతాను. "గోవింద దాసు" అనే పేరును పెట్టుకునే అర్హతను కోల్పోతాననే భావము మనసుకు వచ్చింది. ముఖ్యంగా ఈ పత్రికకు రోజు రోజుకూ ఆదరణ తగ్గుచున్నది, రథయాత్ర లేదు, చందాదారులు తగ్గారు, మార్కెటింగ్ వారు సరిగ్గా చేయుట లేదు. ఇన్ని కారణాలచే దీనిపై నిరాశ నిస్పృహ కలిగి వద్దనటానికి కారణమైంది. తరువాత స్వామి దయ అంటూ వ్రాసుకున్నాను.

## దగ్గరి మార్గాన్ని వదలి దూరపు మార్గాన్ని ఎంచుకున్నావనుట


**తేది 04-11-2020 :** ఈ రోజు స్వామివారు నేను చేసిన తప్పు గురించి చక్కగా తెలిపారు. నిన్న అనగా తేది 03-11-2020 నాడు పీర్జాదిగూడ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 95 సంవత్సరాల వయస్సుండి 'నా' అన్నది నశింప చేసుకున్న పరమ భాగవతోత్తమురాలగు 'యాదమాత' వద్దకు వెళ్ళాను. ఆమెతో భక్తికి సంబంధించిన చాలా విషయాలు చర్చించాను. చివరికి మేము ఎన్నో ఏండ్ల నుండి చేస్తున్న జపసమర్పణ, చేపట్టబోవు శ్రీనివాస కళ్యాణాల గురించి, ఇతర భగవంతుని విషయమై చర్చిస్తూ ఒక విషయము అడిగాను. "స్వామివారు నన్ను 'నా' అన్నది వదిలించుకొమ్మన్నారని, అలా చేసుకున్నప్పుడు ఒక బహుమానం కూడా ఇస్తానన్నారని, కాని అది సాధ్యం కాలేదు" ఏమి చేయాలని అడిగాను. అప్పుడు ఆమె "అది అంత సాధ్యమయ్యే విషయము కాదు, మన మనస్సును పశువును కట్టినట్లు ఒక గుంజకు తాడుతో కట్టివేయాలి, లేకుంటే అది మన మాట వినదు" అని తనదైన శైలిలో చెప్పారు. మరొక ప్రశ్నవేశాను "అప్పుడప్పుడు నా మనస్సు లోక వాసనలతో భ్రమిస్తున్నది, ఈ సేవ ఎందుకనే విధంగా, మనస్సును ప్రక్కకు త్రిప్పే ఆలోచనలు వస్తున్నవి. ఏమిటి? ఎందుకు? అని అడిగాను. అందులకామె "నీకు ఇంకా లౌకిక వ్యామోహము తగ్గలేదు" అందుకే ఆ

విధంగా జరుగుచున్నదన్నారు. ఆమె కూడా 'నా' అన్నది తగ్గించుకొనుటకు, లౌకిక విషయాల పట్ల విరక్తి చెందుటకు చాలా ప్రయత్నించినట్లు, చివరికి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి అనుగ్రహముతో, ఆయన సూచించిన మార్గమున నడచుటచే వీటిని జయించానని అన్నది. ప్రస్తుతం తన వయస్సు 95 సంవత్సరాలని, తనకు ధనవంతులైన కొడుకులు, కూతుళ్ళు ఇతర బంధువులు ఉన్నప్పటికీ ఏకాకిగా ఈ ఆలయంలోనే స్వామిని ధ్యానిస్తూ గడుపుచున్నానని అన్నారు. 'నా' అన్నది నశింప చేసుకుంటే భగవంతునికి మరింత దగ్గరవుతామని ఒక రకంగా నిరాశ భావముతోనే అన్నది. చివరికి ఆమెకు నమస్కరించి ఇంటికి వచ్చాను.

స్వామిని మనసారా ధ్యానిస్తూ పడుకున్నాను. ఉదయం 5 గంటలకు వచ్చింది ఈ అమోఘమైన కల. దీనిలో స్వామివారు నా అంతరాత్మ గురించిన భావాలను నా కళ్ళకు స్పష్టంగా చూపారు. ఒకరకంగా ఇంతవరకు నేను లక్ష్యాన్ని ఎందుకు చేరలేకపోయానో చెప్పారు. ఇది ఒక అద్భుతమైన లీల.

**తేది 04-11-2020 కల :** నేను నా గమ్యస్థానమైన కాశీకి చేరవలసి ఉన్నది. అక్కడికి త్వరగా చేరుటకై భగవంతుడు ఒక హెలికాప్టర్ ను ఏర్పాటు చేశాడు. దీనిలో ప్రయాణిస్తే రెండు గంటలలో కాశీ చేరగలము. దానిని ఒక విశాలమైన రోడ్డుపై నిలిపారు, నేను, మరో ఇద్దరము అక్కడికి వెళ్ళాము. కాని మేము హెలికాప్టర్ లోన కూర్చుండే అవకాశము లేదు. దాని తోకను పట్టుకుని గాలిలో వ్రేలాడుచు కాశీకి చేరవలసి ఉన్నది. సరేనని ఆ ఇద్దరు దాని తోకను చేతులతో పట్టుకున్నారు, తరువాత నేను కూడా వారి వెనుక హెలికాప్టర్ తోకను (దాని తోక స్వామివారిని పల్లకిలో మోయుటకు ఉండే పొడవాటి గుండ్రటి కట్టెలాగా ఉన్నది) రెండు చేతులతో పట్టుకున్నాను. వెంటనే హెలికాప్టర్ స్టార్ట్ అయి గాలి లోనికి లేచుటకు సిద్ధంగా ఉన్నది. ఇంతలో నేను భయపడ్డాను, ఎందుకంటే చేతులతో పట్టుకుని గాలిలోకి వెళ్ళిన తరువాత, ఈ చేతులు నొప్పి పెట్టి, నేను వదిలితే ఎట్లా? అనే సందేహం కలిగింది. రెండు గంటలు ప్రయాణిస్తే గాని కాశీ రాదు, ఈ లోగా చేతులు నొప్పి పెడితే ఎలా అని భయమేసింది. వెంటనే చేతులను వదిలాను, మరోమారు ఆలోచించి ఎలాగైనా సరే గట్టిగా పట్టుకుందామని ఆ కట్టెలాంటి తోకపై చేతులు వేసి పట్టుకోబోయాను. కాని నాకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా, వీరు ఏవిధంగా పట్టుకున్నారు అని తెలుసుకోకుండా ఈ హెలికాప్టర్ గాలిలోనికి లేచిపోయింది. పైగా నా కళ్ళముందే చక్కర్లు కొడుతూ కాశీకి వెళ్ళిపోయింది. ఆ ఇద్దరు మిత్రులు దాని తోక భాగమును గట్టిగా పట్టుకొని ఆ హెలికాప్టర్ తో వెళ్ళిపోయారు. నేను మాత్రం ఒంటరిగా మిగిలిపోయాను.

కాని నా ప్రయత్నాన్ని వదలలేదు. ఎలాగైనా కాశీకి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. ఒక్క క్షణం కూడా వ్యర్థం కాకుండా వెంటనే కాలిబాట పట్టాను. బస్సు లేదా ఇతర వాహనముల కొరకు ఆ రోడ్డుపై వెళ్ళాను. కాని నా దురదృష్టము వలన ఆ సమయాన అవి లభించలేదు. మరింత సమయం వేచి ఉండవలసిన అవసరం ఏర్పడ్డది. కాని సమయం వృధా చేయుట నచ్చక కాలిబాట పట్టాను. అది ఒక పెద్ద రోడ్. ఈ రోడ్డుపై ఒక బ్రిడ్జిని దాటవలసి ఉన్నది. ఈ బ్రిడ్జి కింద నుండి ఒక నది పారుచున్నది. ఈ నది నుండి పెద్ద పెద్ద పడవలు వెళుతుంటాయి. ఇలా పెద్ద పడవ వెళ్ళుచున్నప్పుడు ఈ బ్రిడ్జి తన రెండు రెక్కలను పైకి లేపుతుంది. దీనివల్ల పెద్ద పడవలు ఏ ఆటంకము లేకుండా వెళ్ళగలవు, అదే సమయంలో రోడ్డు మూసివేస్తారు, ఆ విధమైన




స్వామి వారు పంపిన హెలికాప్టర్ లో ఎక్కక పోవుట

ఏర్పాట్లు ఉన్నవి. నేను ఈ బ్రిడ్జిపైన ఉన్నాను. ఇంతలో ఒక పడవ కోసమని ఈ బ్రిడ్జి రెండుగా విడిపోయింది. దాని రెక్కలు పైకి లేచాయి, ఫలితంగా నాకు దారి లేకుండా పోయింది. నదిని ఏ విధంగా దాటాలన్న ప్రశ్న వెంటాడింది. కానీ ప్రయత్నం వదలలేదు. అక్కడ నిరీక్షించలేదు. ఎలాగో క్రిందికి దిగి కష్టపడి ఈదుచు నదిని దాటాను. పిదప ఆదుర్దాగా ఎలా వెళ్ళాలని ఆలోచిస్తూ అప్పుడే ఆ దారిలో వచ్చిన బస్సును ఎక్కాను. అది

అదే మార్గంలో ప్రయాణిస్తున్నది, కాని చివరి వరకు కాకుండా మధ్య లో దించింది. ఆ బస్సు గమ్యస్థానం అంతవరకే కాబట్టి అందరితో పాటు నేను బస్సు స్టాండులో దిగాను.

అప్పుడు మధ్యరాత్రి దాదాపు 2 గంటలు అవుతోంది. ఇప్పుడు ఏమి చేయాలని, ఎలా ముందుకెళ్ళాలని ఆలోచించాను. అలసిపోయాను. కాని నాకు విశ్రాంతి తీసుకొనుట ఇష్టం లేదు. అక్కడ ఒక హాస్టల్ ఉన్నదట, నాకు వారు రూమ్ ఇచ్చుటకు సిద్ధముగా ఉన్నారట, పైగా అది నా పాత రూమేనట, నేను చదువుకునే రోజుల్లో ఆ హాస్టల్ లో ఉండేవాడినట, వెనకటి దృశ్యం మొత్తం నా కళ్ళలో తిరిగింది. నేను ఇలా లక్ష్యమును చేరుటకు ఈ మధ్య రాత్రి ఇక్కడకు వస్తానని తెలిసి ఆ హాస్టల్ వారు, నా వద్దకు వచ్చి ఈ రాత్రి బస్సులు లేవు, రూములో విశ్రాంతి తీసుకోండని మర్యాదపూర్వకంగా అడిగారు. కాని నేను సమయాన్ని దుర్వినియోగం చేయదల్చుకోలేదు. ఎప్పుడు లక్ష్యమును చేరాలనే ఆత్రుత నాలో తారాస్థాయిలో ఉన్నది. కాబట్టి వారి కోరికను నిరాకరించి కాలిబాట పట్టాను. ఇంకా కాశీ ఎంతదూరం ఉందో అడిగాను. వారు చాలా దగ్గర, ఒక 70 కిలోమీటర్లు మాత్రమే అని అన్నారు. అందరూ హిందీలో మాట్లాడుచున్నారు. ఇలా దగ్గరికి వచ్చానని తెలిసి నా మనస్సు సంతోషించింది, అడ్డదారిలో వెళితే కేవలం ఒక గంటలో చేరవచ్చునని ఎవ్వరో చెప్పారు. దానితో మరీ ఆనందించాను. అడ్డదారిలో అంటే పిల్లబాట, వ్యవసాయ క్షేత్రాల గుండా ప్రయాణాన్ని సాగిస్తున్నాను. నాతో పాటు మరి కొందరు కూడా వస్తున్నారు. నిజానికి అది పిల్లబాట కూడా కాదు, కాశీ ఏ దిశలో ఉన్నదో ఆ దిశ వైపు వ్యవసాయ క్షేత్రాల గుండా వెళ్ళుచున్నాము. అసలు అది దారే కాదు, వ్యవసాయ మరియు అడవి ప్రాంతము. ఆ భూమి యజమానులు వారి వారి భూములకు ఫెన్సింగులు వేసుకున్నారు. ముందు మా సామానులను బయటికి విసిరి, ఆ తరువాత ఆ ఫెన్సింగ్ గుండా ముళ్ళు గుచ్చుకోకుండా జాగ్రత్త పడుచూ అవతలి ప్రక్కకు వెళ్ళి సామానులను తీసుకుని ప్రయాణాన్ని సాగించాము. ఇలా దాదాపు కాశీ చేరుకోబోతున్నాను. కల చెదిరింది.

దీనర్థం – నేను భగవంతుడు ప్రసాదించిన, త్వరగా చేరగలిగే మార్గమును కాదని కష్టమార్గమును ఎంచుకుని భగవంతుని వద్దకు ప్రయాణిస్తున్నానని అర్థం. స్వామి చెప్పినట్లు 'నా' అన్నది వదులుకుని ఉండి ఉంటే సులభమయ్యేది. కాని అది వదలక ఈ కష్టాలను పడుచూ దూరపు మార్గములో ప్రయాణిస్తున్నాను. సంతోషించాల్సింది ఏమంటే... నేను నా ప్రయత్నాన్ని వదలలేదు, సమయాన్ని వృథా చేయలేదు. ఎలాగైనా కాశీ చేరాలనే పట్టుదల మనస్సులో నాటుకున్నందులకు సంతోషించాను.

ఈ కల తరువాత ఇలా ప్రార్థించాను. హే ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! నేను నీ వాడను, మీకు పూర్తిగా శరణాగతి చేసినవాడను, మీ హుండీలో సమర్పించుకున్నవాడను, పైగా ఒక వ్యక్తిత్వము లేనివాడను. కాబట్టి మళ్ళీ మిమ్ములను వేడుకుంటున్నాను, మీరే నాకు దిక్కు, రక్ష, సర్వము, మీ దయ ఏవిధంగా ఉంటే అలాగే ఉండగలను. నేను ఏనాడూ ముక్తి కోరలేదు. మరు జన్మంటూ ఉంటే నాకు మీ సేవనే ప్రసాదించమని వేడుకున్నాను. ఇది నా జీవితంలో మరో ఆణిముత్యం.

## లక్ష్యం చేరేవరకు పలు సంకల్పాలు తీసుకోవలసి ఉంటుందని జాగ్రత్త పరచుట

గత కొంత కాలంగా స్వామివారి అనుగ్రహమును పూర్వములాగా పొందాలని తీవ్ర ప్రయత్నాలు చేయసాగాను. స్వామి కృపతో లభించిన కళ్యాణాల కార్యక్రమము భారీ స్థాయిలో ఉండాలని, త్వరగా ప్రారంభం కావాలని, ఏమరుపాటు లేకుండా స్వామి సేవను ఇష్టంగా చేయాలని ప్రతిరోజూ ప్రార్థిస్తున్నాను. నా ఈ పట్టుదలను చూచిన స్వామి వారు మరో అద్భుతమైన విషయమును తెలిపారు. ఇది నా జీవితములో మరో ఆణిముత్యం. మొదట దీని అర్థమును సరిగా గ్రహించలేదు. కాని దీనిపైన సాధన చేసిన తరువాత దీని నిజమైన అర్థమును గ్రహించాను. ఇది ఒక అత్యంత విశ్లేషణాత్మకమైన లీల.

**ముందు గ్రహించిన అర్థం :** శేష జీవితంలో సదా శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తూ, స్మరింప చేస్తూ జీవించమని చెప్పారనుకున్నాను.

**తరువాత గ్రహించిన అర్థం :** ఓయీ! నీవు నీ జీవితములో ఎలాగైనా లక్ష్యాన్ని చేరాలి. మొదటి సంకల్పంలో చేరకుంటే రెండవ సంకల్పము, అందులో చేరకుంటే మూడవ సంకల్పము తీసుకునైనా చేరవలసి ఉంటుంది అంటూ జాగ్రత్త పరిచారు. స్వామిపైన మాత్రమే దృష్టి నిలిపి అన్య విషయములను త్యజించి జీవించమని దిశా నిర్దేశం చేశారు.

ఇది ఒక గొప్ప లీల, ఒక భక్తుడు పొందగోరే లీల. ఇది చిన్నపాటి కలే అయినప్పటికీ విలువైన అర్థం ఇమిడి ఉంది.
చిన్నగుండవెల్లిలో మా ఇంటి నుండి మా తోటమావికి వెళ్ళేదారి కేవలం 20 అడుగుల చిన్న బండ్లబాట మాత్రమే. ఆ దారిలో ముందు మా పెద్దనాన్న గారి పొలము, ఆ తరువాత మా పాలివారు సత్తిరెడ్డిది, ఆ తరువాత గొల్లవారిది, ఆ తరువాత మాది వస్తాయి. వీరందరూ కూడా ఈ బాట వెంట వారి పశువుల కొట్టములను కట్టుకున్నారు.

**తేది 13-11-2020 కల :** నేను హైదరాబాద్ నుండి మా ఊరు చిన్నగుండవెల్లికి పోయానట. మా (పాత) ఇంటిలో ఉన్నాను. తెల్లవారి నేను మా ఇంటినుండి తోట బావి దగ్గరికి కాలినడకన బండ్లబాట (పానాది) గుండా పోవుచున్నాను. మా పెద్దనాన్న వారి పొలము దాటి సత్తిరెడ్డి పొలము వరకు వెళ్ళాను. వెళ్ళునప్పుడు

భగవంతుణ్ణి స్మ రిస్తూ వెళ్ళుచున్నాను. ''రామ శరణం... శ్రీ రామ శరణం...'' అని నా మనస్సులో స్మరిస్తున్నాను. ఇంతలో ఈ నా స్మరణ... ఒకరికి చెవిలో ఏ విధంగా మంత్రోపదేశం చేస్తారో ఆ విధంగా నాది నాకు వినిపించింది. నేను పలికే ఈ చిన్నపాటి శబ్దము తరంగాల రూపములో దూరంగా ఉన్న మా పెద్దనాన్న గారి పశువుల కొట్టమును తాకి తిరిగి సంగీతముతో కలిసిన ఒక దివ్యమైన, ఇంపైన శబ్ద తరంగములతో వచ్చి నా చెవులను తాకుచున్నది. నేను చిన్నగా పలుకుచున్నప్పటికీ తిరిగి పెద్ద శబ్దము వలె అత్యంత మధురంగా వినబడుచున్నది. ఎక్కువ శబ్దము అగుచున్నదని భావించి మరి కొంచెము మెల్లగా పలికాను. కొంచెం తక్కువైనప్పటికీ అది కూడా అదేవిధంగా ఇంపైన రీసౌండ్ తో నా చెవిని తాకి నాకు మహదానందమును కలిగించింది. ఈ విధంగా నడుచుకుంటూ వెళ్ళి సత్తిరెడ్డి మూల వరకూ వెళ్ళాను. మా తోట బావి వద్దకు వెళ్ళాలంటే అక్కడ నేను ఎడమ వైపు తిరగవలసి ఉంది. అందుకని ఎడమ వైపు దృష్టి మరల్చి నడుస్తున్నాను. ఇలా నేను ఎడమ ప్రక్కకు తిరిగిన తరువాత ఈ దారి పూర్వపు దారి కంటే చాలా వెడల్పుగా మారింది. ఒక 60 అడుగుల రోడ్డుపై మధ్యలో 15 అడుగుల వెడల్పైన డివైడర్ ఉన్నట్లు, మధ్యలోని ఈ డివైడర్ లో ఒక షెడ్డు వేసి దానికి ఇరుప్రక్కలా రోడ్డు ఉన్నది. ఈ షెడ్డులో పశువులు కట్టేసుకొనుచున్నారు. ఈ షెడ్డు వద్ద సత్తిరెడ్డి చనిపోవుట వలన వాని కొడుకు ఉన్నాడు. దీనిని చూచి ఆశ్చర్యపోయాను. పూర్వము చిన్నగా ఉన్న దారి పెద్దగా అయినది, మనుష్యులు కూడా మారారు అనుకున్నాను. చివరికి అలాగే స్వామివారిని స్మరిస్తూ మా తోట బావి దగ్గరికి పోవుచున్నాను. ఇంతలో కల చెదిరింది. కాని కలలో విన్న మంత్రము నా చెవులలో శ్రావ్యమైన శబ్దముతో మారుమ్రోగుచున్నది.

''రా..మ శరణం శ్రీ రా...మ శరణం'' ఈ విధంగా వినబడింది.

మొదట ఈ కలలోని అర్థమును సరైన విధంగా అర్థం చేసుకోలేదు, కాని దీని నిజమైన అర్థం : నేను మా తోట బావి వద్ద హరినామ క్షేత్రమును నిర్మించుటే లక్ష్యంగా శ్రీవేంకటేశ్వరుణ్ణి సదా స్మరిస్తూ ప్రయాణించాలి. నేను స్మరిస్తూ, ఇతరులచే స్మరింప చేయుచూ, ఆనందిస్తూ ఈ ప్రయాణము సాగాలి. ఈ ప్రయాణములో ఎన్నో మార్పులు జరగవచ్చు, మనుష్యులు, ప్రాంతాలు మారవచ్చు, కాని నా ప్రయాణం మాత్రం అలాగే ఉండాలి. అశ్రద్ధ చేయకూడదు. నా అశ్రద్ధ వల్ల ఒకవేళ లక్ష్యం నెరవేరనిచో మరో సంకల్పము తీసుకొనవలసి ఉంటుంది. ప్రస్తుతము ఇది రెండవ సంకల్పము. అవసరమైతే మూడవ సంకల్పము తీసుకొనియైనా లక్ష్యమును చేరాలంటూ హెచ్చరించారు. బహు కఠినంగా సేవ చేస్తూ లక్ష్యమును సాధించవలసి ఉంటుందని చెప్పారు.

## స్వామి ప్రసాదించిన అనుభూతులను చదువమనుట

తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ప్రతి విషయాన్నీ నా మూలములో మార్పు జరిగే విధంగా శిక్షణ ఇస్తారు. పరిస్థితుల ప్రభావము వలన నేను ఆయా విషయాలను మరచినప్పటికీ సమయం వచ్చినప్పుడు మళ్ళీ ఆ విషయాలు నా హృదయం నుండి రెట్టించిన ఉత్సాహంతో బయటకి వచ్చి, నన్ను ఆ మార్గం వైపు పయనింపచేస్తాయి. 16వ జప సమర్పణ తరువాత నేను నా సంకల్పము పూరించినానని భావించాను. సేవలను కొనసాగిస్తున్నప్పటికీ నాలో తపన, ఆత్రుత తగ్గాయి. నేను స్వామివారికి సేవకుడనని, ఋణపడి ఉన్నానని, పరతంత్రుడననే విషయాలను క్రమంగా మరచిపోయాను. ఈ స్థితి గత సెప్టెంబర్ 2018 నుండి దాదాపు రెండు సంవత్సరాలు కొనసాగింది. కాని స్వామివారు మళ్ళీ దీనిని కొన్ని లీలల ద్వారా పైకి తెచ్చారు. నన్ను నేను నా అంతరంగాన్ని గుర్తుంచుకునే విధంగా, పశ్చాత్తాపము చెందే విధంగా చేశారు. నా 60వ పుట్టిన రోజు సందర్భంగా నేను పరతంత్రుడననే విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు నేను స్వామివారికి సేవకుడననే విషయమును ఎలా గుర్తు చేయబోతున్నారో చూద్దాం. నిజానికి నేను స్వామివారికి సేవకుడనని భావిస్తే ఎంతో ఆనందిస్తాను, పులకరించిపోతాను. ఇప్పుడు కూడా ఎంతో ఆనందించాను. స్వామివారు అనుభూతులు చదువమనే విషయాన్ని అత్యంత గంభీరంగా కోపగిస్తూ, నేను భయపడే విధంగా చెప్పారు. నేను కూడా అదే స్థాయిలో ''నేను సేవకుడిని కాబట్టి మీకు నాపై అధికారమున్నది'' అని భావిస్తూ ఆనందించాను. ఇది ఒక అద్భుతమైన, ఒక సేవకుడు అనుభవించదగిన లీల. స్వామివారు అత్యంత ఖచ్చితమైన సమయ పాలనను పాటిస్తారనే విషయం కూడా ఇందులో తెలుస్తుంది. స్వామివారి ప్రతి లీల ఏదో సాధించుట కొరకై ఉంటుంది. ఇప్పుడు నాలో నిద్రావస్థలో ఉన్న దాస్య భావాన్ని జాగృతం చేసి, స్వామివారు నాకు ప్రసాదించిన అనుభూతులను మొదటినుండి చదవమంటూ ఈ క్రింది విధంగా ఆజ్ఞాపించారు. దీనితో స్వామి ఆశించిన పరివర్తన దశ పరాకాష్ఠకు చేరింది.

తేది 27-11-2020 కంటె ఒక మూడు రోజుల ముందు నుండి ''నీ అనుభూతులను చదువు'' అంటూ స్వామివారు నాకు ఒక హృదయాంతరంగ భావమును కలిగిస్తున్నారు. కాని నేనే నిరాసక్తితో రేపు మాపు అంటూ వాయిదా వేశాను. మూడవ రోజు కఠినమైన పదాలతో... ''నీకు వినబడుట లేదా? నీ అనుభూతులను చదవమంటూ చెప్పినప్పటికీ చదవడం లేదంటూ'' ఘాటుగా హెచ్చరించారు. ఇంతటి కోపం నేనెప్పుడూ చూడలేదు. ఒక్కసారి భయంతో, అరికాళ్ళ నుండి వణుకు పుట్టింది, శరీరం

కంపించింది. కాని మరో క్షణములో లోలోన నవ్వుకున్నాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! మీరు నా ప్రభువు, నేను మీ సేవకుడిని, నాపై కోపగించుకొనుటకు మీకు పూర్తి అధికారమున్నది కాబట్టి కోపగించుకుంటున్నారని భావించాను. ఎలాగైతే ఒక భార్యను భర్త మందలించినప్పుడు, ఆ భార్య బయటికి భయపడినట్లు కనబడినా, లోన ముసి ముసి నవ్వులు నవ్వినట్లు నేను ఆ విధంగా నవ్వుకున్నాను. మీకు నాపై అధికారమున్నది కాబట్టి మందలిస్తున్నారనుకుంటూ, నేను మీ సేవకుడిననే గర్వముతో ముసి ముసిగా నవ్వాను. ఈ మందలింపు నన్ను ఆనందానికి గురి చేసింది. కాని స్వామికి తెలియకుండా జాగ్రత్త పడ్డాను. ఈ విధంగా నాలో నిద్రావస్థలో ఉన్న దాస్య భావాన్ని జాగృతం చేసి అనుభూతులను చదవమన్నారు.

మరోప్రక్క నా గత అనుభూతుల 6 పుస్తకముల కొరకు ఇల్లంతా వెతికాను, నేను ఎక్కడైతే భద్రపరిచానో అక్కడ లేవు. గుండె ఝల్లుమంది, చాలా చోట్ల వెతికాను, కనబడలేదు. మా ఇల్లు రినోవేషన్ సమయాన లేదా పిల్లల పెండ్లిళ్ళ సమయాన మార్చామా? అనే సంశయముతో ఇల్లంతా వెతికాము కాని ఎక్కడా కనబడలేదు. ఎంతో వేదన చెందుచూ స్వామివారికి మళ్ళీ శరణు జొచ్చాను. ఆర్తితో ప్రార్థించాను, వారిని ప్రసన్నుణ్ణి చేయ రకరకాలుగా ప్రయత్నాలు ఆరంభించాను. నేను నా జీవితంలో స్వామి ద్వారా పొందిన మొత్తం ఆస్తి ఇదేనని, అది పోతే సర్వం కోల్పోయినట్లుగా ఉన్నదని, నాకు మనశ్శాంతి లేదని బాధపడుచూ ప్రార్థించాను. చివరికి స్వామివారిని ప్రసన్నుణ్ణి చేసుకొనుటకు "ప్రభూ! నేను మీరు కోరినన్ని రోజులు 'శ్రీవేంకటేశం' మాసపత్రిక ప్రచురణను కొనసాగిస్తాను", ఇది నా ప్రతిజ్ఞ, మీరు మాత్రము నేను కోల్పోయిన నా మొత్తం 6 అనుభూతుల పుస్తకాలను దొరికే విధంగా అనుగ్రహించమని ప్రార్థించాను. అవి నా ప్రాణంతో సమానమైన ఆస్తి అని, వాటిని చదువుతుంటే ఎంతో ఆనందిస్తానని, ఆ భాగ్యాన్ని ప్రసాదించమని వేడుకున్నాను.

కాని తేది 03-12-2020 వరకు ఎంత వెతికినా దొరకలేదు. మొత్తం ఆరు పుస్తకాలలో మొదటిది, రెండవది జిరాక్స్ కాపీలు, మూడవ దానిలో కొంత, నాల్గవది మొత్తం పోయాయి. అయిదవది, ఆరవది ఒరిజినల్స్ ఉన్నవి. తేది 18-08-2009 నుండి 24-02-2011 వరకు పొందిన అనుభూతులు లభించలేదు. చివరికి స్వామి ఆజ్ఞ ప్రకారం ఉన్న అనుభూతులను తేది 05-12-2020 నుండి చదువ ప్రారంభించాను. వీటిని చదువుచున్నప్పుడు నేను ఎంతో ఆనందించాను. స్వామివారి అనుగ్రహానికి పాత్రుణ్ణయ్యానని, ఆయన లీలలను చూసి మురిసిపోయాను. మరియు నా కర్తవ్యం, నా భవిష్యత్తు నడవడి ఏ విధంగా ఉండాలనే దానిని నిర్ణయించుకోవచ్చని భావించాను.

## మొదటి సంకల్పంలో ఓడిపోయినట్లు గుర్తించుట

స్వామివారు ప్రసాదించిన అనుభూతులను మొదటినుండి చదువుచున్నాను. గతంలో నేను 16 సంవత్సరముల సేవా ఫలమును సమర్పించి బొట్టు పెట్టాను. కాని అప్పుడు (తేది 07-09-2018) నేను ఇంకా పాస్ కాలేదని చెప్పారు. నేను ఏ తప్పూ లేకుండా సేవ చేసినప్పటికీ స్వామివారు ఇలా ఎందుకన్నారో గ్రహించక, వారికి వీలున్నప్పుడు నా కోరిక తీరుస్తారని భావించాను. ఈ రోజు కార్తీక ఏకాదశి, శుక్రవారము, తేది 11-12-2020 నాడు మళ్ళీ ఒకసారి స్వామివారిని మనసారా స్మరించాను. సమస్త దేవతలను ఆహ్వానించాను. 2002 సంవత్సరం నుండి 2020 సంవత్సరం వరకు చేసిన అన్ని సేవల ఫలితాన్ని సమర్పించి అందరి దేవతల సమక్షంలో నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి మరోసారి బొట్టు పెట్టాను. మరియు సదా గోవిందదాసుగా ఉండే భాగ్యాన్ని ప్రసాదించమని, తప్పులను క్షమించమని వేడుకున్నాను. ప్రభూ! నేను నా శక్తి మేర సేవ చేశాను, ఇంతకంటే ఎక్కువ చేయలేను. పొరపాట్లు ఉండవచ్చును, వాటన్నింటిని క్షమించి నా జీవిత ధ్యేయమైన మీకు బొట్టుపెట్టుట అనే దానిని స్వీకరించి నన్ను ఆనందింప చేయండని వేడుకున్నాను.

రాత్రి వేయి కళ్ళతో ఎదురు చూచాను, కాని లాభం లేదు. స్వామివారి నుండి ఎలాంటి స్పందన రాలేదు. నిజానికి 'నా' అన్నది నశింప చేసుకుని, యోగ్యత సాధించక ఓడిపోయాను. కాని ఆ సమయంలో ఈ విషయమును అర్థం చేసుకునే స్థితిలో లేను. నేను అర్థం చేసుకున్న క్రమం ఈ విధంగా ఉంది.

రోజుకు దాదాపు అయిదారు గంటల చొప్పున అనుభూతులను చదువుచున్నాను. ఇలా ఈ అనుభూతులను చదివే క్రమములో తేది 16-12-2020 రోజున నేను సంకల్పములో ఓడిపోయిన విషయమును గుర్తించాను. దుఃఖిస్తూ ఈ క్రింది విధంగా వ్రాసుకున్నాను.

**తేది 17-12-2020 :** ఎంతో బాధాతప్త హృదయంతో వ్రాస్తున్నాను. నేను నా స్వామికి 2002 సంవత్సరం నుండి 2018 సంవత్సరం వరకు 16 సంవత్సరాలు మొత్తం 111 కోట్ల జపసమర్పణ సంకల్పములో విఫలుడనైనాను. సంకల్పములోని అంశములను పూరించలేకపోయాను. ఇది సత్యము. నేను తర్కించుకొనిన సత్యము. మరియు గతంలో తేది 07-09-2018 రోజున, నేను ఇంకా పాస్ కాలేదని స్వామివారు స్వయంగా తెలిపారు. ఇంతకంటే ఋజువు ఏమి కావాలి? అందుకే ఒక్కసారి నా మనస్సంతా బాధతో నిండి, నరనరాలలోని రక్తం గడ్డ కట్టుకుపోయింది. పెద్ద బరువు మీద

పడినట్లైంది. నాకిక లోకములో ఏమీ లేదనిపించింది. నా స్వామికి ముఖమును చూపెట్టుటకు సిగ్గుగా ఉన్నది. ఆయన ముందు తల దించుకుని ఉన్నాను. ఏమి చేయాలో తోచలేదు. నేను ఇన్ని ఏళ్ళ నుండి కోరుకున్న కోరిక దక్కకుండా పోయింది. స్వామివారిని బొట్టుపెట్టి ఇంటికి పిలిచే అత్యంత మనోహరమైన, ఈ జన్మలో సాధించదలచిన మహత్తరమైన ఘట్టానికి నేను అనర్హునిగా అవడం నన్ను కలచివేసింది. జన్మ వ్యర్థమైనదనే బాధతో ఉన్నాను.

చివరికి దీనికి బాధ్యుణ్ణి నేను కానని, నా అదృష్టమే నాకు ఈ స్థితి కలిగించిందనిపించింది. నేను నా స్వామికి బొట్టుపెట్టి ఇంటికి పిలిచే అర్హతను కోల్పోయే విధంగా చేసింది. ఏ జన్మలో చేసిన పాపమో నన్ను ఈ విధంగా చేసిందని నన్ను నేను అసహ్యించుకున్నాను. ఈ క్రింది విధంగా ఓడిపోయానని గ్రహించాను.

నేను 2002 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం కనీసం 70 వేల మంది పాల్గొన్న 7 కోట్ల జపమును 16 సంవత్సరములు స్వామివారికి సమర్పించాలి. ఈ మొత్తం సేవలో ఒకటి కంటె ఎక్కువ తప్పులు ఉండకుంటే... స్వామివారు మా ఇంటికి వస్తానన్నారు. ఇది పందెం. మొదటి సంవత్సరం 7 కోట్లు సమర్పించినప్పటికీ అందులో 70 వేల మంది భక్తులు భాగస్వాములు కాలేదు. ఒకరు ఒకటి కంటే ఎక్కువ పుస్తకములు వ్రాయుటచే 70,300 పుస్తకములను పంచినప్పటికీ సంఖ్య తగ్గింది. కాని దయామయుడైన శ్రీవేంకటేశ్వరుడు అది మొదటి తప్పని భావించి స్వీకరించాడు. ఈ లోటు తీర్చుటకు 70 వేల జప పుస్తకాల పంపిణీతో పాటు 'నమో వేంకటేశాయ' అనే రథమును తయారు చేసి హైదరాబాద్ నుండి తిరుపతి వరకు 25 రోజులు రథయాత్ర చేసి, వీలైనన్ని ప్రాంతాలు త్రిప్పుచు క్రతువులను వ్రాయిస్తూ భక్తులను ఈ 7 కోట్ల జపములో భాగస్వాములను చేయుదుము. ఈ విధంగా ప్రతి సంవత్సరం సంకల్పానుసారం 7 కోట్లు సమర్పించడం జరిగేది. ఇలా 2008 వరకు సమర్పించాము.

తేది 15-10-2008న మా అమ్మ చనిపోవునప్పుడు నా మూడవ వంతు పుణ్యమును ధారపోసి ఆమెకు వైకుంఠమును ప్రసాదించమని స్వామివారిని వేడుకున్నాను. 2008 సంవత్సరం వరకు నేను 6 పర్యాయాలు 7 కోట్ల జపమును సమర్పించాను. ఇందులో మూడవ వంతు అంటే... రెండు సంవత్సరముల ఫలితము మా అమ్మకు వైకుంఠ ప్రాప్తి కొరకు కేటాయించబడ్డది. నా దాంట్లో 2 సంవత్సరాలు తగ్గిందన్నమాట. ఈ విధంగా నా సంకల్పం పూరించుటకు 2018 సంవత్సరం కాకుండా 2020 సంవత్సరానికి పొడిగించబడ్డదన్న మాట. అందుకే 2018 లో 16 సంవత్సరాలు 7 కోట్లు సమర్పించానంటే స్వామివారు ఇంకా పూరించలేదని అన్నారు. ఆ తరువాత 2019, 2020 సంవత్సరాలలో కూడా 7 కోట్ల జపమును సమర్పించాను. కాని కరోనా-19 కారణంగా 2020 సంవత్సరంలో రథయాత్ర చేయకనే, 70 వేల మంది భక్తులు నిండకుండానే 7 కోట్లు సమర్పించాము. ఇలా 16 సంవత్సరాలు 7 కోట్ల జప సమర్పణలో మొత్తం 2 తప్పులు జరిగాయి. ఫలితంగా ఓడిపోయాను. ఇది నా యొక్క గత జన్మల పాపపు ప్రభావము వలన కరోనా రావడం, రథయాత్ర చేయకుండా చేసిందని, దానికి నేనే కారకుణ్ణని భావిస్తూ దుఃఖించాను. మొత్తం మీద సంకల్పములో విఫలుణ్ణైనాను. నిజానికి నేను సంకల్పంలో ఓడిపోయాననే విషయాన్ని నన్ను నేను గుర్తించుటకు నా గత అనుభూతులను చదవమని స్వామివారు చెప్పారని గ్రహించాను. స్వామివారు ఒక తప్పు కేవలం ఒకేసారి క్షమిస్తారు, రెండవసారి క్షమించరు. 2003 సంవత్సరంలో ప్రథమ 7 కోట్ల జపసమర్పణ జరిగినప్పుడు మరియు 2020 సంవత్సరంలో కూడా ఇదే తప్పు మళ్ళీ పునరావృతం అయింది. రెండవసారి నేను రథయాత్ర చేయలేక కాదు, కరోనా ప్రభావము వలన అయినప్పటికీ నేను నష్టాన్ని పొందాను. ఇది నా దురదృష్టముచే జరిగిందని భావించాను.

ఈ రోజు నేను ఓడిపోయాననే విషయమును స్వామివారికి తెలిపి క్షమించమని వేడుకున్నాను, మరియు సంకల్పాన్ని నెరవేర్చనందులకు తరణోపాయము ఏమైనా ఉంటే సూచించమని వేడుకున్నాను. నేను ఇప్పటి వరకు స్వామివారికి చేసిన సేవ పునాది నుండి లేచిపోయినట్లైనది.

**నా దశ:** స్వామివారు నా వెనుక ఉండి కళ్యాణాల కార్యక్రమమును నడిపిస్తున్నారు. అమ్మవారు కూడా కళ్యాణాలకు సమ్మతిని తెలిపారు. సేవక భావం జాగృతం చేశారు. ఎలాగైనా లక్ష్యాన్ని సాధించమన్నారు. మొదటి సంకల్పంలో ఓడిపోయినందులకు క్షమాపణలను కోరాను.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.


**శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు**

**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**


**ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సిగూడ,**

**హైదరాబాద్. ఫోన్: 040-27175050**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

# 24వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

## శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

### సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

### నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మా నుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

### గమనిక:

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!


**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ,
హైదరాబాద్ - 500007. ఫోన్: 040- 27175050


ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:

**93482 12354**



# ముక్తికి సోపానం
# నారాయణ మంత్రం

చింతలపాటి
శివశంకర శాస్త్రి

శ్లో॥ "పంకజాసన శక్ర శంకర పూజితాంఘ్రి సరోరుహమ్
దేవదానవ సిద్ధ సాధ్య నరాది భావిత వైభవమ్
సంకటోత్తర రణోజ్జ్వల ధ్రుచితోషితాఖిల సేవకమ్
వేంకటేశ్వర పాదపంకజమాశ్రయే నిఖిలాశ్రయమ్"

మృగశిరా నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసమును మార్గశిర మాసము అని అంటారు. మార్గము అనగా దారి. శిరము అనగా తల. మానవ శరీరమునకు శిరము ఏవిధంగా దిశా నిర్దేశము చేయునో, అదేవిధంగా ఈ మాసము ఆధ్యాత్మికత వైపు దారి చూపుతుంది. భగవదారాధనకు విశేషమైన కాలం. సౌరమానము ప్రకారం ధనుర్మాసం అని అంటారు. ధనుర్మాసంలో నారాయణుని ఆరాధన విశేష ఫలాన్ని ఇస్తుంది. "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి". సకల దేవతలకు చేసిన నమస్కారం కేశవునికి చెందుతుంది.

"మాసానాం మార్గశీర్షోహం ఋతూనాం కుసుమాకరః". భగవద్గీతలో మార్గశిర మాసం సాక్షాత్తు తన స్వరూపమని శ్రీకృష్ణుడు చెప్పాడు.

"సస్యాద్య త్వాత్ శీతాతప శూన్యత్వాత్ మార్గశిర మాస ప్రాధాన్యమ్" పంటలు బాగా పండి చేతికి వచ్చేకాలం. సమశీతోష్ణ స్థితి కల కాలమగుటచే మార్గశిర మాసమునకు మార్గ, సహా ఆగ్రహాయణిక అని పేర్లు కలవు. కైవల్యకారకమైన ఈ మాసము రమణీయం, మహనీయం, కమనీయం మరియు జగద్రక్షాకరం.

అనంతుడు, అచ్యుతుడు, అప్రమేయుడు, జ్యేష్ఠుడు, సనాతనుడు, ఆశ్రిత భక్తజన వత్సలుడు, స్థితి కారకుడు, శ్రీమహావిష్ణువు. కుంఠము కానిది వైకుంఠము.

కుంఠనము అంటే కలిసి ఉండే స్థితిని చెడగొట్టడము అని అర్థము. అంటే వియోగం కలిగించడం. "వికుంఠ" అంటే వియోగాన్ని తొలగించడం కలిసి ఉండవలసిన వారి సన్నివేశాలని, పదార్థాలని కలిపి ఉంచే పరమాత్మకు వైకుంఠ శబ్దము సార్థకమైంది. వైకుంఠుడు అంటే "సర్వేషాం సంశ్లేషయితా" అని వ్యుత్పత్తి. మహాభారతం శాంతి పర్వంలో "మయా సంశ్లేషితా భూమిః అద్భిః వ్యోమః చ వాయు నా వాయుశ్చ తేజసా సార్థం వైకుంఠ దత్తం అంతతో మయాః" అని స్వామి స్వయంగా చెప్పాడు. పంచభూతాల పంచీకరణాదులు చేసేది నేనే. అందుకే నన్ను వైకుంఠుడు అంటారు అన్నాడు.

**"కశ్చిదశ్చిన్మంతకా వికుంఠాయాం మాతరి జాతత్వాద్వైకుంఠః"**

'వికుంఠ' అనే తల్లికి కుమారునిగా అవతరించినందువల్ల ఆ స్వామి వైకుంఠుడు అని అమరకోశం వర్ణిస్తోంది. ఆ స్వామి నివాస స్థానం వైకుంఠం. ఆ వైకుంఠవాసుడే శ్రీమన్నారాయణుడు. ఆ నారాయణుని మంత్రమే "ఓం నమో నారాయణాయ" ఎంతో శక్తివంతమైంది.

**"ధ్యాయన్ కృతే యజన్ యజ్ఞై స్త్రేతాయాం ద్వాపరేఽర్చయన్**
**యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవమ్"**

భగవన్నామ స్మరణం అంటే దేవీ దేవతలలో ఎవరినైనా సరే భక్తి శ్రద్ధలతో స్మరించడం అని చెప్పవచ్చు. "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అని చెప్పినట్లుగా ఏ దేవీ దేవతనైనా స్మరించవచ్చు. సేవించవచ్చు. భక్తి శ్రద్ధలే ముఖ్యం. నామం అనంతమైంది. అవ్యయమైనది. సులభసాధ్యమైనది. భగవదనుగ్రహానికి పాత్రులయ్యేందుకు, భగవంతునిలో ఐక్యమయ్యేందుకు పరమోత్కృష్ట సాధనం శరణాగతి. "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ". తమకు భగవంతుడు తప్ప, ఇతరమైన ఆధారమేదీ లేదని గ్రహించి, విశ్వసించి, అతడే దిక్కని, ఆతని పాదములను ఆశ్రయించి కొలవడమే శరణాగతి. శరణుజొచ్చిన వారిని కాపాడటం భగవంతుని స్వభావం.

భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు మనకు అందించే ఆధ్యాత్మిక నిధి మంత్రం. వ్యక్తి మానసిక దౌర్బల్యాన్ని మటుమాయం చేసి, అచంచలమైన ధైర్యాన్ని, దివ్యతేజస్సునీ కలుగజేస్తాయి మంత్రరాజములు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను విడిచిపెట్టి నిత్యం మంత్ర బీజాక్షరాన్ని జపిస్తూ ఎందరో మహర్షులు తపోనిధి సంపన్నులుగా మన దేశానికి ఆధ్యాత్మిక సంప్రదాయానికి ఎనలేని కీర్తినార్జించి పెట్టారు. అంతేకాదు యోగసాధనను, పరమాత్మ సాన్నిధ్యాన్ని పొందడానికి చేయవలసిన కృషినీ, దానికి చేయవలసిన విధానాన్ని తరువాతి తరాలకు అందజేసి ఘనత వహించారు. మన మహర్షుల సంకల్పానికి కార్యరూపమైనవే ఈ మంత్రాలు. పరమార్థాన్ని, జీవేశ్వర సంబంధాన్ని బోధించే మంత్రరాజం అష్టాక్షరి. తిరుమంత్రమని, మూలమంత్రమని పిలువబడుతోంది. ఏకాంతమునగానీ, విష్ణువిగ్రహం ముందు గానీ, విష్ణ్వాలయంలో గానీ, నీళ్ళలో గానీ నిశ్చలమైన మనస్సుతో శ్రీమహావిష్ణువును అష్టాక్షరీ మంత్రాన్ని జపించాలి. ఈ మంత్రానికి ఋషి నారాయణుడు. ఛందస్సు దేవి గాయత్రి. దేవత పరమాత్మ.

**"ఆర్తా విషణ్ణాః శిథిలాశ్చ భీతాః**
**ఘోరేషు చ వ్యాధిషు వర్తమానాః**
**సంకీర్త్య నారాయణ శబ్దమేకం**
**విముక్త దుఃఖాః సుఖినో భవన్తి"**

పీడితులు, విషాదగ్రస్తులు, భయభీతులు, భయానకమైన వ్యాధులచే పీడింపబడువారు ఒక్కసారి నారాయణ శబ్దమును సంకీర్తన చేసినంతనే దుఃఖములకు దూరమై సుఖమును పొందెదరు. ఎందువలననగా విష్ణుభగవానుని నామము మహత్తరమైన నామము. మోక్షప్రదాయిని అయిన శ్రీహరి నామము వీనులకింపైనది. నిరంతరం భగవన్నామ స్మరణ చేస్తుంటే ఆయన కరుణా కటాక్షాలు మనపై ప్రసరిస్తాయనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. భగవన్నామమే పరమధర్మం. ఆయన నామమే పరమ తపస్సు. ఆయన నామమే లోకాలకు గతి. అందుకే మనం ఎన్నిసార్లు భగవంతుని నామాన్ని జపించినప్పటికినీ అలుపు రాదు. ఆర్తి తీరదు. అదొక తీరని దాహం.

"ఓం నమో నారాయణాయ" అని ఎనిమిది బీజాక్షరాలతో కూడి యుండుట వలన దానికి అష్టాక్షరీ మంత్రం అను పేరు వచ్చింది. ఈ మంత్రాన్ని జపిస్తూ నిత్యం తపస్సు చేసి ఎందరో మునిపుంగవులు పరమాత్మ సాయుజ్యాన్ని పొందారు. ఈ మంత్ర స్వరూపాన్ని పరిశీలిస్తే నారాయణ స్వరూపం అవగతమవుతుంది. భగవంతుని క్రియాశీలత్వాన్ని విశ్వస్వరూపాత్మకుడైన శ్రీహరి స్వరూపాన్ని ఈ మంత్రం ద్వారా తెలుసుకోవచ్చు.

ఈ మంత్రంలో ప్రథమాక్షరం 'ఓం' కారం. అ–ఉ–మ = ఓం. ఇదే ప్రణవం. సకల ప్రాణులను సంసార సముద్రాన్ని దాటించే నావయే ప్రణవం. ఓంకారం త్రిమూర్త్యాత్మకం. 'అ'– ఇడానాడి, 'ఉ' – పింగళనాడి, 'మ' – సుషుమ్న నాడి. ఈ నాడుల ద్వారా శ్వాసక్రియ జరిగి లౌకికంగా జీవనం సాగుతుంది. అలౌకికంగా యోగం నిలుస్తుంది.

**"ఓం స్మరణాత్ కీర్తనాద్వాణి శ్రవణాశ్చ జపాదపి**
**బ్రహ్మం తత్రాప్నువ్య తే నిత్యయో మిత్యే తత్పరాయణః"**

ఓంకారం యొక్క స్మరణ, కీర్తన, శ్రవణ, జపాదుల వలన

మానవుడు పరబ్రహ్మను పొందుతాడు.

"తస్య వాచకః ప్రణవః" అంటూ పతంజలి ఓంకారాన్ని బ్రహ్మవాచకంగా సూత్రీకరించాడు. మూలాధారంలో పడుకొని ఉన్న మూడున్నర మాత్రల కుండలిని ఓంకార శక్తి. యోగసాధనలో వెనక్కి తిరిగి మూలాధారం నుంచి అనాహతం మీదుగా నుదుటి నడిమి నున్న ఆజ్ఞాచక్రానికి చేరుతుంది. అందువలననే మానవ జీవితంలో ఉపాసనకు మించిన మార్గం మరొకటి లేదు.

ఈ సృష్టి రచనకు పూర్వం అఖిల బ్రహ్మాండంలో ఒకే ఒక అపార నాదం ప్రతిధ్వనిస్తుండేదని, అది ఓంకార నాదమని మహర్షులు తెలిపారు. ఈ ఓంకారం నుంచే సప్త వ్యాహృతులు ఉత్పన్నమైనాయి. ప్రణవ జపం వలన ఐశ్వర్యం వృద్ధి అవుతుంది. అమరత్వాన్ని, విష్ణులోక, కిన్నెరలోక, గంధర్వలోక, శివలోక, దేవలోక – ఇవీ, అవీ అనేకంటే సర్వలోక సంచారం కలుగుతుంది. సద్భావనలను, మంచి వ్యక్తిత్వాన్ని కలిగించే శక్తి ఏర్పడుతుంది. మనిషి లోపల అంతర్గతశక్తిని ప్రేరేపించే మంత్రం ఓం నమో నారాయణాయ. మానసిక వికారాలను, మనో వైకల్యాన్ని తొలగిస్తుంది. కర్తవ్య పాలనను బోధిస్తుంది. సిరిసంపదలు, సౌఖ్యం, మానసిక వికాసం, శారీరక ఆరోగ్యాలను ప్రసాదిస్తుంది.

**"ఓం నమో నారాయణాయేతి మంత్రోపాసకః**
**వైకుంఠ భువన లోకం గమిష్యతి"**

ఈ అష్టాక్షరీ మంత్రమును భక్తి శ్రద్ధలతో జపించినవారు వైకుంఠమును చేరగలరు.

**"ఆపో నారా ఇతి ప్రోక్తా ఆ పోవై నరసూనవః**
**ఆయనం తస్యతాః పూర్వం తస్యోన్నారాయణః స్మృతః"**

"నారములు" అనగా ఉదకములు. "అయనము" అనగా స్థానముగా గలవాడని బాహ్యార్థము. చరాచర స్వరూపముగా నుండు శరీరములని 'నర' శబ్దార్థము. 'అయన' అనగా ఆశ్రయుడు. అంతర్యామి. నియామకుడు. సర్వాంతర్యామి అని అర్థము. అదీగాక నర+అయన = నారాయణ – నదులకు గమ్యస్థానమైనవాడు. మరియు ప్రళయాంతమున కూడా నశించక సముద్రము నందు మర్రి ఆకుపై శయనించువాడని అర్థము కూడా నుడివెదరు. సకల జీవాలకు ప్రాణస్వరూపుడు. సర్వాంతర్యామి అయినవాడు నారాయణుడు. సర్వ శుభాల్ని ప్రసాదించే విమలాంతరంగుడే కాక, నవ్య స్వరూపంతో, నవ్య మార్గాలలో వాత్సల్యాన్ని కురిపిస్తాడు.

మోహన రూపాత్మకుడైన విశ్వేశ్వరుడు విశ్వాన్ని తన స్వరూపంతో వహించి భక్తులను, యోగులను, ఋషులను, పుణ్యచరిత్రులను తన దివ్య స్వరూప సాక్షాత్కారము చేత సమ్మోహ పరచే స్వభావం కలవాడు. అందువల్ల శ్రీహరి శిష్టాచార పరాయణులైన సాత్విక సంపన్నులను, సమర్థవంతంగా పోషించేవాడిగా కీర్తి వహించాడు. మోహాన్ని, వ్యామోహాన్ని విధ్వంసం చేసి, సత్య సందర్శనం గావించి, జ్ఞానజ్యోతి వెలిగించి మోక్షాన్ని ప్రసాదించే కరుణా స్వరూపుడు, భక్తవత్సలుడు శ్రీమన్నారాయణుడు.

మోహము ఒక సాలెగూడు వంటిది. మోహపాశములో చిక్కుకున్న మానవుడు తన ధర్మమును, సత్కర్మను మరచిపోయి పురుషార్థ హీనుడవుతున్నాడు. కనుకనే గీతలో భగవంతుడు "నష్ట మోహో స్మృతిర్లబ్ధః" అని ఉపదేశించాడు. దేహము, దేహ సంబంధాలను త్రెంచి వేసి, ఒకే ఒక పరమపిత పరమాత్మ స్మృతిలో నిమగ్నుడవై కర్తవ్యపాలన చేయమని భగవంతుని మహావాక్యము.

భగవంతుని నామాన్ని ఉచ్చరించడం వలన మన జిహ్వకు శుద్ధత ఏర్పడుతుంది. అనేక ఇతర విషయాల గురించి మాట్లాడినా అటువంటి శుద్ధత ఏర్పడదు. దేవాలయాలలో ఈశ్వరుని దివ్యమంగళ స్వరూపాన్ని సందర్శించినప్పుడే మన కళ్ళకు సార్థకత లభిస్తుంది. కానీ ఇతర దృశ్యాలను చూసినప్పుడు సార్థకత లభించదు. ఈశ్వరుని అర్చించడానికే మన కరములు. అలా అర్చించని నాడు అవి కరములు కానే కావు. అదేవిధంగా మన మనస్సు ఎల్లప్పుడూ భగవంతుని పాదపద్మములనే ధ్యానించాలి. ధ్యానిస్తూ ఉండాలి. పరమాత్మను భక్తితో స్మరించడమే సర్వోత్తమ ధర్మమని భీష్ముని మాట అక్షరసత్యం. పరమాత్మ పట్ల భక్తి లేకపోతే మన జీవితాలు నిష్ప్రయోజనాలే అవుతాయి.

**"చక్రి చింతలేని జన్మంబు జన్మమే తరళ సలిల బుద్బుదంబు గాక"**

దుర్లభమైన మానవజన్మ సార్థకంబు కావాలంటే భక్తి మార్గము సరియైన మార్గము.

నారదుడు తన త్రిలోక సంచారం ద్వారా భగవన్నామ ప్రచారం కావించి, త్రిలోకాలను తరింపచేశాడు. ప్రహ్లాదుడు తనకు ఎన్ని కష్టాలెదురైనా చలించక త్రికరణశుద్ధిగా హరిగాన మొనర్చి తరించాడు.

విషయాలలో చిక్కి గుడ్డివారై సంసారమందు మమత కలిగిన వారికి సర్వపాపాలను నశింపచేసే సాధనం హరినామ మొకటే. అన్ని నామాలకన్నా హరి నామమొక్కటే అనంత ఫలప్రదమని అన్నమయ్య అభిప్రాయం. అన్ని పాపాలను హరించ గలిగేది అనంత శయనుని నామ జపమే అని అతని అచంచల విశ్వాసం. హరినామ మాహాత్మ్యమును విధాత నారదునితో

**సురభి, నందిని అనుగ్రహిస్తే - స్మరించి తరించింది రఘువంశం**

విష్ణునామ సంకీర్తనం వల్ల సకల పాపాలు నశిస్తాయని ''నామ సంకీర్తనాద్విష్ణోః దహ్యంతే బహుపాతకాః''. సర్వవ్యాపి, అమిత తేజస్సు గల నారాయణుని కీర్తించటం సూర్యుడు ఉదయించగానే చీకట్లు తొలగిపోయినట్లు హరినామాన్ని జపించగానే పాపాలు తొలగిపోతాయంటూ –

**"కీర్తనా దేవకృష్ణస్య విష్ణో రమిత తేజసః**
**దురితాని విలీయంతే తమాం సేవ వినోదయే"**

అని వివరిస్తూ ఎంత పెద్ద వెదురు పొదనైనా నిప్పురవ్వ బూడిద చేసినట్లు భగవన్నామము ఘోర పాపాన్నైనా నశింప చేస్తుందని పలికాడు.

**"'రా' శబ్దోచ్చారణే జాతే వక్త్రాత్ పాపం వినిగచ్ఛతి**
**'మ'కార శ్రవణే జాతే భస్మభావం గమిష్యతి"**

'రా' అనే శబ్దానుచ్చరించడం వల్ల నోటిద్వారా పాపం బయటకు వెడుతుంది. 'మ' కారాన్ని వినడం వలన భస్మమైపోతుందని శాస్త్రోక్తి. 'రా' కారం అందరిని రమింపచేసి పరమాత్మ తన పూర్ణామృత హృదయంలో తనను సేవించే వారిపై కరుణను కురిపించే ప్రసన్నవదనుడు, 'మ' కారం మద మాత్సర్యములను విధ్వంసం చేసే స్వభావం కలవాడని అర్థం. అన్నీ నావే అన్న భావంతో అన్నింటిపైనా మోహం పెంచుకుంటారు. అజ్ఞానాంధకారంతో కష్టాలను కొని తెచ్చుకుంటారు. అలాంటి వారి వ్యామోహాన్ని విధ్వంసం చేసి, సత్య సందర్శనం గావించి, జన్మ పునరావృతం నుండి విమోచన కావించి మోక్షాన్ని ప్రసాదించే విశ్వరూపుడు శ్రీహరి.

**"శ్రీనివాసస్య దేవస్య స్మరణం సతతం తథా"**

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన ఆ దేవదేవుని నిరంతరం స్మరిస్తూ ఉండటమే ఆయన పట్ల భక్తియని వేంకటాచలం ద్వారా తెలుస్తోంది. విశ్వాసంతో, భక్తితో, ఆర్తితో నిర్మల చిత్తంతో హృదయ పూర్వకంగా భగవన్నామ స్మరణ చేసి, భగవంతుని దివ్యానుగ్రహమును పొంది తరించెదమని మన వచస్సును, మన మనస్సును, కొత్త యశస్సును, మోక్షమునకు మార్గం సుగమం చేయాలని ఆశిస్తూ ఆ దేవదేవుని సంకీర్తనామృతంలో ఓలలాడి తరిద్దాం. తరింపచేద్దాము.

**"నారాయణ – నారాయణ జయ గోవిందహరే**
**నారాయణ – నారాయణ జయ గోపాలహరే**
**కరుణాపారా వార వరుణాలయ గంభీర నారాయణ**
**ఘన నీరద సంకాశకృత కలి కల్మష నారాయణ"**
**"శ్రీదశ్శ్రీన శ్రీనివాసః శ్రీనిధి శ్రీ విభావనః**
**శ్రీధర శ్రీకర శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః"**

**"ఇతి శ్రీవేంకటేశ్వర పాదార్పణమస్తు"**
**"సర్వే జనాః సుఖినో భవంతు"**

★★★



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 89 వ కళ్యాణం

ఇది తేది 02-11-2025 ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. దీనిని శ్రీమాన్ గాది నరేంద్ర కుమార్, మల్లీశ్వరి దంపతులు మరియు గాయత్రీనగర్ కాలనీ సభ్యులు కలిసి నిర్వహించారు. ఇది హైదరాబాద్ లోని మౌలాలి వద్ద గల గాయత్రీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ లో జరిగింది.

## 90 వ కళ్యాణం

ఇది తేది 07-11-2025 శుక్రవారం ఉదయం 11 గంటల నుండి శ్రీ శ్రీనివాస రైస్ మిల్, చందుపట్ల రోడ్, చందుపట్ల (భువనగిరి)లో జరిగింది. దీనిని శ్రీమాన్ పెద్ది సిద్ధయ్య, ధనలక్ష్మి దంపతులు మరియు పెద్ది శ్రీనివాసులు, శోభారాణి దంపతులు నిర్వహించారు.

## 91 వ కళ్యాణం

ఇది తేది 17-11-2025 సోమవారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇది 60' రోడ్డు వద్ద గల వాసవి బృందావనం, గాయత్రీనగర్, అల్లాపూర్, బోరబండ వద్ద జరిగింది. దీనిని శ్రీమాన్ సముద్రాల రాములు, లలిత దంపతులు మరియు సముద్రాల చంద్రశేఖర్, నాగమణి దంపతులు నిర్వహించారు.

## 92 వ కళ్యాణం

ఇది తేది 23-11-2025 ఆదివారం ఉదయం 10.30 గంటల నుండి జరిగింది. ఇది శివాలయం మడివార్ల గోశాల, లోయర్ ట్యాంక్ బండ్, కవాడిగూడ, హైదరాబాద్ నందు జరిగింది. దీనిని శివాలయం మడివార్లు, శ్రీ మడివార్లు మంచిదేవుని దేవాలయ కమిటీ నిర్వహించింది.




# మార్గదర్శకులు మహర్షులు

డా|| శివానందమూర్తి

"నమః ఋషిభ్యో మంత్రకృద్భ్యో మంత్రపతిభ్యో
మామామృషయో మంత్రకృతో మంత్రపతయః
పరాదుర్మామ్యృషీన్మంత్రకృతో మంత్రపతీన్పరాదామ్"

"మంత్రద్రష్టలకు, మంత్రపతులకు, మహర్షులకు నమస్కారము. వాళ్ళు నన్నెప్పుడూ విడిచిపెట్టకుండా ఉందురుగాక. నేను వాళ్ళను విడిచిపెట్టను, వాళ్ళు నన్ను వదిలిపెట్టకూడదు".



ఋషుల దయ మనయందున్నంత కాలం మనం క్షేమంగా ఉంటాము. మనం వారిని తలచుకొంటే, వారి దయ మనయందు ఉంటుంది.

దేవతల కంటె, ఈశ్వరుని కంటె కూడా మనకు దగ్గరగా ఉండి, మనను నిత్యమూ నడిపిస్తూ, మనకు సంప్రదాయాన్ని ఇచ్చినవారు ఋషులు. వారి చరిత్రలు మనం తెలుసుకుని తీరాలి. వేద మంత్రములన్నీ ఋషిప్రోక్తములే. ప్రతి మంత్రానికీ ముందు 'అస్య శ్రీ....ఋషిః' అని ఉంటుంది. ఆ ఋషి దర్శించినట్లు ప్రారంభమవుతుంది ప్రతి మంత్రమూ కూడా. ఋషులు లేకపోతే మంత్రములే లేవు. మన సంస్కృతిలో ఋషులకున్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. వారివల్లనే మనం ఈనాటికీ ఇలా ఉన్నాము. వారి వల్లనే మనకు ఈ సంస్కృతి వచ్చింది. (అట్టి ఋషులు ఈ శతాబ్దంలో కూడా మనకు ఉన్నారు. రమణమహర్షి అటువంటివారు).

ఋషుల చరిత్ర మనం తెలుసుకుంటే, పురాణం అంతా అందులో వస్తుంది. మనుష్యుల కథలు, భగవంతుడి లీలలు, గాథలు అన్నీ అందులో వస్తాయి. ఋషుల చరిత్ర మనలో ఒక ఉత్తేజం కలుగజేసి, మనకు గొప్ప జ్ఞానం ఇస్తుంది. మన సంప్రదాయాన్ని ఈనాటి వరకు నిలబెట్టి, ఇంకా మనలో సజీవంగా ఉన్న వారెవరయితే ఉన్నారో, ఆ ఋషులే మనకు ప్రేరణనిస్తున్నారు. ఇంతటి వేదరాశిలో ఇన్ని మంత్రములకు, ఇన్ని సూక్తములకు ద్రష్టలుగా ఉండి, వేదమును మనకు ప్రసాదించారు వారు. బ్రహ్మ ముఖంలో నుండి వేదం పుట్టింది గాని, దానిని మనకు ప్రసాదించింది ఋషులే. బ్రహ్మ మనకు నేరుగా ఇవ్వలేదు. ఋషులే ఇచ్చారు. అందుకని మనందరికీ ఋషులు ఆరాధింపతగినవారు.

చాలామంది 'నాకు గోత్రం లేదు, ఋషులు లేరు, మేం బ్రాహ్మణులం కాదు, అగ్రవర్ణాలము కాము' అని అనుకొంటూ ఉంటారు. అది సరి కాదు. ఋషులు లేకపోతే మనుష్యులే లేరసలు. కశ్యప ప్రజాపతి సంతానమైన మనమంతా

'కాశ్యపసగోత్రం' (అంటే కశ్యపుని గోత్రం) అని చెప్పుకోవాలి. 'కాశ్యపస గోత్రం' లేనివారు ఎవ్వరూ లేరు. అనేక తరాలనుండి దానిని చెప్పుకోవడం మరచిపోయినందువల్ల, ఇది మరుగున పడిపోయి చాలామందికి తెలియడం లేదు. పోనీ తనకు ప్రవర, గోత్రం – అంటే ఋషులున్నారని చెప్పుకుంటున్న బ్రాహ్మణులందరూ కూడా ఆ ఋషులు చెప్తున్న మార్గంలో నడుస్తున్నారా? అదీ లేదు కాబట్టి, చిట్టచివరకు మనం జ్ఞాపకం చేసుకోవలసింది ఏమిటంటే అందరమూ కశ్యప ప్రజాపతి సంతానమని. 'కాశ్యపస గోత్రోద్భవస్య – (ఫలానా) నామధేయస్య' అని ఎవరైనా చెప్పుకోవచ్చు. తప్పేమీ లేదు. అది సత్యమే. మూడు తరాలపాటు ఒక వంశములో కాశ్యపస గోత్రమని తమ పేర్లు చెప్పుకుంటే, ఆ వంశస్థునికి బ్రాహ్మణుడినని చెప్పుకునే అధికారం వస్తుందని ఆపస్తంభ సూత్రాలలో ఉన్న కొన్ని వాక్యాల ఆధారంగా తెలుస్తోంది. ఏ వర్ణస్థుడైనా ఈ మాట చెప్పవచ్చు. మరి అలా ఋషుల నుండి కాకపోతే మనమంతా ఇంకెక్కడ నుండి పుట్టాం?

బ్రహ్మ మొట్టమొదట సృష్టించిన అతడి మానసపుత్రులు, వైరాగ్యంతో తపస్సుకు వెళ్ళిపోయి మోక్షం పొందారు. పూర్వ కల్పంలో (అంటే ప్రళయానికి ముందరున్న పూర్వసృష్టిలో) ఉండే దేవతలు, ఋషులు, మునులు – వాళ్ళే ఈ సృష్టిలో జ్ఞానులై పుట్టడము, వెళ్ళిపోవడము జరిగింది. ప్రజాపతుల ఉద్దేశ్యం ఏమిటంటే – మనుష్యులు పెళ్ళి చేసుకోవాలి, పిల్లల్ని కనాలి, వాళ్ళ సంతానం వృద్ధి చెంది దేశమంతా నిండాలి, కళకళ లాడాలి అని. వారికొక విషయం అర్థమయింది. అవిద్య, అజ్ఞానం, దేహాత్మభావన, దేహాభిమానం – ఇట్లాంటి లక్షణాలుంటే తప్ప మనుష్యులు వృద్ధి పొందరు. శుద్ధజ్ఞానంలో ఉండేవారు ఈ లోకం వదిలిపెట్టి వెళ్ళిపోతారు. జ్ఞానా జ్ఞానములు రెండూ, విద్య – అవిద్యలు రెండూ ఎవరికైతే ఉంటాయో వారే సంతానము పొందుతారు. అప్పుడే ప్రజలు వృద్ధి అవుతారు.

అలా సృష్టి ప్రారంభంలో బ్రహ్మకు అనేక ఇబ్బందులు కలిగాయి. ఆదిలోనే చాలా పెద్ద ఇబ్బంది కలిగిందాయనకు. మనుష్యులను సృష్టించగానే, వారికి తల పైకి ఉండాలో, క్రిందికి ఉండాలో, కడుపు ఎక్కడ ఉండాలో తెలియలేదు. ఆకారం ఎలా ఉండాలో ఆయనకు జ్ఞాపకం రాలేదట. ఒకవేళ జ్ఞాపకం వచ్చి అలాగే పెడదామని ప్రయత్నించినా కూడా, వంకరటింకరగా తల క్రిందికి, కాళ్ళు పైన, చేతులు వీపు వెనక – అలాగ వచ్చాయట. దీనికి కారణం ఏమిటి?

అంటే మనకందరికీ మూలాధార చక్రంలో చతుర్దళ పద్మంలో గణపతి అధిష్ఠానదేవతగా ఆసీనుడై ఉండి, 'ఈ దేహమే నేను' అనే భ్రాంతిని కలుగజేస్తున్నాడు. ఆయన అలా చేస్తున్నందువల్లనే మనం అన్నం తింటున్నాము, పడుకుంటున్నాము. దేహం నాదని, ఇల్లు నాదని కాపాడుకుంటున్నాము. ఇందువలనే సంతానం కలుగుతున్నది. ఇదంతా – ఈ నాగరికత అంతా కూడా దేహాభిమానం వల్లనే కలుగుతోంది. దేహాభిమానం లేకపోతే ఇదంతా కూడా సర్వనాశనమైపోతుంది. ఎవరూ ఉండరు.

దేహాభిమానం చెడ్డది కదా అని ఎవరైనా అనవచ్చు. జ్ఞానానికీ, మోక్షానికీ వెళ్ళే దారిలో దానిని వదిలిపెట్టమన్నారు కానీ, అది లేకుండా జీవితంలో సంచరించడమే సాధ్యం కాదు. అది లేకుండా సంచరిస్తే, మనిషి – త్రాగినవాడివలె, పిచ్చివాడివలె – తనను ఏ స్తంభానికో వేసి కొట్టుకుంటాడు. దేంట్లోనో పడి చచ్చిపోతాడు. అలా ఉంటుంది దేహ సంరక్షణ. "ఈ దేహం నాది, దీనిని సంరక్షించి ఉంచుకుంటాను" అనేటటువంటి వివేకం ఒకటి జీవలక్షణంలో సహజంగా ఉండాలి. అట్టి జీవలక్షణము అయిన భావానికి అధిపతి గణపతి. వారి దయ లేకుండా మనం ఇలా ఉండనే ఉండము.

అప్పుడు ఆ గణపతిని బ్రహ్మదేవుడు తన ముందర ఆవాహన చేసుకున్నాడు. ఆ గణపతి బ్రహ్మదేవునికంటే పూర్వుడు. 'బ్రహ్మణాం బ్రహ్మణస్పతి' అని మంత్రం చదువుతాం మనం. (ఆయన ఎంతటి పూర్వుడంటే... సృష్టి ప్రారంభానికి ముందు ఒకప్పుడు రాక్షసులతో అమ్మవారు యుద్ధం చేస్తున్నది. ఇంకా మనుష్యులే పుట్టకముందు మాట. అమ్మవారు పరమేశ్వరుణ్ణి తలచుకున్నది. ఆయన అక్కడ ఉన్నారు. వారి ఇద్దరి చూపులు కలిసినవి. ఆ చూపుల కలయికలో నుండి విఘ్నేశ్వరుడు పుట్టాడు. ఆయన పేరు మహాగణపతి. అంతటి పూర్వుడాయన. ఆ గణపతి యొక్కం అవతారాలనే ఇప్పుడు మనం ప్రతి కల్పంలోనూ పూజిస్తున్నాం).

బ్రహ్మదేవుడు ఆ మహాగణపతిని తలచుకున్న తరువాత ఆయన ప్రత్యక్షమై "మూలాధారమనే చక్రాన్ని సృష్టించు, అక్కడనుండి సహస్రార కమలం దాకా నిర్మాణం చెయ్యి. ఆ మూలాధార చక్రంలో నేను అధిష్ఠాన దైవంగా ఉండి నీవు సృష్టించే జీవులకు దేహాత్మ భావనను ప్రసాదించి, వాళ్ళ ఆత్మ సంరక్షణోపాయంలో వాళ్ళు ఉండేటట్లు, అన్న వస్త్రాలను సంపాదించుకుని బ్రతకాలనే కోరిక వాళ్ళలో కలిగేటట్లుగా చేసి, ఆ కోరికలో నుండి సంతానమందు వాళ్ళకు ఇచ్ఛ కలుగజేసి సృష్టిని కలుగజేస్తాను. నీవు సృష్టించు, నేను ఈ పనిని చేస్తాను" అన్నాడు. కాబట్టి ఆ మహాగణపతి జీవులలోకి ప్రవేశించగానే, ఆయన అనుగ్రహం చేత వాళ్ళకు దేహాత్మభావన కలిగింది. దేహాభిమానం కూడా కలిగింది. అటువంటి గణపతి అనుగ్రహం చేత, తరువాత సృష్టి సక్రమంగా జరిగింది.

ఈ సృష్టి రహస్యము యావత్తు, సమస్త జీవకోటి యొక్క జీవ లక్షణమూ అంతా సంపూర్ణంగా అర్థం చేసుకుని, "బ్రహ్మ ఎవరు? ఆత్మ ఎక్కడ? పదార్థం అంటే ఏమిటి? పంచభూతములు ఎలా

వచ్చాయి? ఈశ్వరుడు అంటే ఎవరు? ఆయన యొక్క స్వరూప స్వభావావాలు ఎలా ఉన్నాయి?'' – ఇన్ని విషయాలూ తెలిసి, ఈ జగత్తు యొక్క భవిష్యత్తు తెలిసి, జీవులకు ఏది క్షేమకరమో అది తెలిసినవారు మహర్షులు. ఆద్యంతమూ సృష్టి కథ అంతా తెలిసి, వాళ్ళ కర్తవ్యమే కాక, మన కర్తవ్యము, భవిష్యత్తులో పుట్టబోయే వారి యొక్క యోగక్షేమాలు కూడా ఆలోచించగలిగినవారు మహర్షులు. అట్లాంటి మహర్షులు అనేకమంది ఆర్య సంస్కృతిని రక్షించి జీవకోటిని ఉద్ధరించారు. వారిని గురించి తెలుసుకోవడం మన ప్రధాన కర్తవ్యం.

## అగస్త్య మహర్షి

యుగాల పర్యంతం వ్యాపించి యున్న అగస్త్య మహర్షి యొక్క మహత్తు, ప్రభావం మన సంస్కృతిపై అంతా ఇంతా కాదు. దేశం నలుమూలలా (కొన్ని ఇతర దేశాలలో కూడా) ఈ మహర్షి సంచరించని ప్రదేశం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ మహర్షి ప్రతిష్ఠలుగా చెప్పబడే ఎన్నో దేవాలయాల స్థల పురాణాలు మనం వింటూ ఉంటాము. ముఖ్యంగా దక్షిణదేశంలో. అందునా తమిళనాట అగస్త్యుడే ఆ సంస్కృతికి మూల పురుషుడని వారి విశ్వాసం. అగస్త్యుని ప్రసాదంగా అనేక శాస్త్రాలు, నాడీ గ్రంథాలు, స్తోత్రవాఙ్మయం మనకు అందుతూ ఉంది. నేటికీ ఈ మహర్షి అనుగ్రహ దృష్టి మన జాతిపై ఉంది. వారి ప్రణాళిక లోకంలో అమలు జరుగుతోంది. ఈ మహర్షి యొక్క అత్యద్భుత జీవిత విశేషాలను తెలుసుకుందాం.

పూర్వం ఒకప్పుడు తారకాది రాక్షసులు దేవతలను ఇతర జీవకోటిని బాధిస్తూ జగత్తునంతా క్షోభ పెడుతూ ఉంటే, మహేంద్రుడు అగ్నిని, వాయుదేవుడిని పిలిచి ఆ రాక్షసులను చంపమని ఆజ్ఞాపించాడు. వారు ఆ రాక్షసులను చంపటం మొదలుపెట్టారు. వారిని తరిమి తరిమి కొట్టారు. చావగా మిగిలిన రాక్షసులు సముద్ర జలాల్లోకి వెళ్ళి దాక్కున్నారు. వారు భూమి మీద ఎక్కడా కనబడటం లేదు. స్వర్గానికి రావటం లేదు. దేవతలను బాధించటం లేదు. అందుచేత అగ్ని, వాయుదేవుడు ఇద్దరూ కూడా విశ్రాంతి తీసుకున్నారు. రాక్షసులు పగలల్లా సముద్రంలో దాక్కుని, రాత్రి సమయాల్లో సమస్త జీవకోటి నిద్రిస్తున్న సమయంలో జీవకోటిని హింసిస్తూ భక్షిస్తూ ఉండేవారు. మునులను, సామాన్య మనుష్యులను, యోగులను, పండితులను, అనేకమంది సజ్జనులను, భక్తులను, ఏ పాపమూ ఎరుగనటువంటి భక్తులను చంపేసేవాళ్ళు రాత్రిపూట.

రాక్షసుల చేతుల్లో ఒక రాత్రిలోనే అడవిలోని జంతువులన్నీ మృత్యువాత పడి అడవంతా ఖాళీ అయిపోయేదని పురాణము చెబుతోంది. దేవతలను కూడా పీడించారు. పెద్ద ఉపద్రవము ఏర్పడింది. లోకంలో అశాంతి ఏర్పడింది. దేవతలకు ఏం



చేయాలో తెలియలేదు. ఈ ప్రకారంగా 12 వేల సంవత్సరాలు గడిచాయి. పూర్వం బయట ఉన్నప్పుడు వాళ్ళను చంపటానికి వీలయేది. వాళ్ళను తరిమికొట్టేసరికి ఇప్పుడు దొరక్కుండా పోయారు.

అప్పుడు దేవేంద్రుడు మళ్ళీ అగ్ని, వాయుదేవుళ్ళను పిలిచి కోప్పడ్డారు. ''రాక్షసులను చంపడానికి మిమ్మల్ని వినియోగించాను. మీరు వాళ్ళను ఉపేక్షించారు. వాళ్ళు పారిపోతే వాళ్ళను వదిలిపెట్టారు. వెతికి వేటాడి చంపవలసింది కదా! ఇప్పటికయినా వాళ్ళని భస్మం చేయండి'' అన్నాడు ఆయన.

అప్పుడు అగ్ని వాయువులు ''సముద్రంలో దాక్కున్న వాళ్ళను ఎలాగ చంపాలి?'' అని దేవేంద్రుడిని అడిగారు. అప్పుడు ఇంద్రుడు ''సముద్రాన్ని ఇంకింపచెయ్యండి'' అన్నాడు.

ఆ ఆలోచన విని అగ్ని, వాయుదేవులు నవ్వారట. ''సముద్రంలో వెయ్యిమంది రాక్షసులు ఉండవచ్చు. వాళ్ళను చంపటానికి ఒకవేళ సముద్రాన్ని ఇంకింపచేస్తే సముద్రంలో ఉండే అనంతకోటి జీవరాశులను చంపవలసి వస్తుంది. అవి ఏం పాపం చేశాయి? ఏ పాపం ఎరుగనటువంటి ఆ జలచరాలను చంపి మేము ఈ రాక్షసుల కోసం పాపం మూట కట్టుకోము. సముద్రాల్లో వృక్షాలున్నాయి. చేపలున్నాయి. తిమింగలాలు, రకరకాల జీవకోటి భూమిమీద ఉన్నదాని కంటే ఎక్కువ ఉంది అక్కడ. వాటిని మేము చంపము'' అన్నారు.

ఒక చిన్న ప్రయోజనం కోసం రాజు ఆజ్ఞ ఇస్తాడు. వివేకంతో దాన్ని వినాలి. క్షుణ్ణంగా ఆలోచించి సలహా అడగాలి మళ్ళీ. ''ఏదైనా ఇంకో ఉపాయం చెబితే అలా చేస్తాం'' అన్నారు

ఇంద్రుడితో. ఇంద్రుడికి అధికార దర్పం వచ్చింది. ''నేను చె బితే మీకు ఇంకా అర్థం కావటం లేదా? పాపమో పుణ్యమో నాకు తెలియదా? నా సూచనలు పాటించకుండా ఉండటమే కాకుండా తప్పని చెప్పి నా మీద నేరము మోపుతారా? కాబట్టి ముందు మీకొక శిక్ష వేస్తున్నాను. మీరు భూలోకంలో మనుష్యులై పుట్టండి'' అని వాళ్ళను శపించాడు.

అయితే వాళ్ళు దేవతలు. ఎవరి గర్భంలో పుడతారు? అగ్నిదేవుడిని, వాయుదేవుడిని మోసే కన్నతల్లి ఎవరు? ఆ ప్రశ్న వాళ్ళు ఇంద్రుణ్ణి అడిగారు. అప్పుడు ఇంద్రుడు వాళ్ళతో ''అచేతనమయిన పదార్థము – జడ పదార్థము – రాయి రప్ప లాంటి వాటిలోంచి పుట్టండి'' అన్నాడు. అది ఇంద్రుడి ఆజ్ఞ. శాపం కూడా. అక్కడితో ఆ ఘట్టం పూర్తయింది.

ఒకప్పుడు ధర్ముడు అనే ముని యొక్క కొడుకులు ఇద్దరు, 'నర నారాయణులు' అనేవారు, గంధమాదన పర్వతం మీద తపస్సు చేసుకుంటున్నారు. వాళ్ళు అపూర్వంగా, మహా వైభవంగా తపస్సు చేస్తూ ఉంటే దేవేంద్రుడికి అసూయ కలిగి ఆ తపస్సును విఘ్నం చేయమని వసంతుడిని, మన్మథుడిని ఆజ్ఞాపిస్తూ వారి మనస్సును చెదరగొట్టమన్నాడు.

అనేకమంది అప్సరసలతో వసంతుడు వసంత ఋతువు రూపంలో వచ్చినా వాళ్ళు ఏమీ చలించలేదు. నిజానికి అప్సరసలు తాము చాలా సౌందర్యవంతులమని, తమ సౌందర్యానికి వారే గర్విస్తూ ఉంటారు. ''మీరు చాలా సౌందర్యవతులమని అనుకుంటారు. మా తపస్సును చెదరగొడదామని వచ్చారు కదా! అయితే చూడండి నా శక్తిని చూపిస్తాను'' అని నారాయణుడు తన తొడను కొట్టుకుని తన తేజస్సు లోంచి ఒక అందమైన స్త్రీని సృష్టించాడు. తొడలోంచి వచ్చిన శబ్దం లోనుంచి – అంటే ఊరువు (తొడ) లోంచి వచ్చింది కాబట్టి ఆమెకు 'ఊర్వశి' అని పేరు. ''ఈమె అందం ముందర మీ అందం ఏపాటిది? అన్నాడు ఆయన. ''మీ అందచందం చూచి నేనేమీ మోసపోయేవాణ్ణి కాదు'' అని వాళ్ళను వెళ్ళగొట్టాడు నారాయణుడు.

ఊర్వశిని సూర్యుడు తన భార్యగా చేసుకుని తీసుకువెళ్ళాడు. వాళ్ళిద్దరూ కలిసి వెళుతుండగా, వరుణదేవుడు దారిలో ఆమెను చూచి మోహించాడు. ''సూర్యుడికి ఇదివరకే నేను అంకితమయినాను. నేను అతడితోనే ఉంటాను'' అని ఆమె అన్నది. అప్పుడు వరుణదేవుడు ''సరే నేను నిన్ను ఇక కోరను. నాకు నీమీద ఒక కోరిక కలిగింది. మోహం కలిగింది. నన్ను దయచేసి నీ మనసులో జ్ఞాపకం పెట్టుకో'' అన్నాడు. ఊర్వశి సూర్యునితో వెళ్ళిపోయింది. వరుణుడికి అదో తృప్తి. అధర్మంలో చిన్న ధర్మం అన్న మాట. దీనిని ఏమనాలి? మొదటగా అధర్మం. దాంట్లో మళ్ళీ ధర్మాన్ని పరిపాలించటం.

అది సూర్యుడు తెలుసుకుని ''నువ్వు అతనిని మనస్సులో పెట్టుకుంటానని వాగ్దానం చేసి నాతో కాపురం చేయటం తగదు. ఇది మహా దోషం. ఇలాంటి తప్పులు భూలోకంలోనే చేస్తుంటారు. దేవలోకంలో ఇలాంటి తప్పులు చేయరు. అందువలన భూలోకానికి వెళ్ళిపో'' అని ఊర్వశిని శపించాడు.

**–శివానంద సువిధ ఫౌండేషన్ సౌజన్యంతో**


## రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

సీతాదేవి కాలిపోయిందని భయపడ్డాను. రామకార్యం వ్యర్థమైందని దుఃఖించాను. జానకి దహింపబడలేదు – అది చారణులు చెప్పుకుంటున్న మాటలు. విన్నాను. నా తోక కాలిపోలేదు. నేను కాలిపోలేదు. సీతమ్మ సుఖంగా వుంటుందనుకున్నాను. మళ్ళీ వెళ్ళాను. సీతాదేవిని దర్శించాను. సెలవు తీసుకున్నాను. వచ్చేశాను. మిమ్మల్ని చూడగల్గాను. రాముని ప్రభావంతో సీతమ్మ తేజస్సుతో సుగ్రీవుని అనుగ్రహంతో కార్యం నెరవేర్చాను – ముగించాడు హనుమంతుడు.

## కర్తవ్యం

లంకా వృత్తాంతం వివరించాడు హనుమంతుడు. మళ్ళీ అంటున్నాడు. రామప్రయత్నం సఫలమైంది. సుగ్రీవుని ఆందోళన తగ్గింది. సీతాదేవి సౌశీల్య ప్రభావం చూశాను. భక్తి భరితుడయ్యాను. రావణుడు తపోబల సంపన్నుడు. ఆ తపశ్శక్తితో సర్వలోకాలు జయించగలడు. ఆగ్రహిస్తే వాటిని దహించగలడు. సీతమ్మను తాకాడు. ఆ తపోబలంతో కాలిపోలేదు వాడు.

**న దగ్ని కుర్యాత్ సంస్పృష్టా పాణినా సతీ ।**
**జనకస్యాత్మజా కుర్యాత్ యత్క్రోధ కలుషీ కృతా ॥**

జనకాత్మజ సీతాదేవి ఆగ్రహించి చేత్తో తాకితే ఏదైనా భస్మమైపోతుంది. ఆ పని అగ్నిశిఖ కూడా చేయజాలదు. రావణుడు రాముని వలన మరణించాలి. పైగా సీతమ్మ కోపించలేదు. అందుకే వాడు దగ్ధం కాలేదు – అన్నాడు మారుతి.

ఇదీ సంగతి. అన్ని విషయాలు చెప్పాను మీకు. లంకకు వెళ్దాం. సీతామాతని తెద్దాం. రాముని సన్నిధికి వెళ్దాం. అదే మంచిది. నేనొక్కడినే చాలు లంకాపురిని నాశనం చేస్తాను. రాక్షస సేనల్ని హతమారుస్తాను. మహాబలశాలి రావణుని చంపుతాను. మహావీరులు, ఈ బలశాలురు, విజయశీలురు మీరు తోడుంటే ఇక చెప్పేదేముంది?

బ్రహ్మాస్త్రం ఇంద్రాస్త్రం రౌద్రాస్త్రం వాయువ్యాస్త్రం వారుణాస్త్రం ఇంకా ఎన్నో అస్త్రాలు ఇంద్రజిత్తు ప్రయోగించినా వాటిని వ్యర్థం చేస్తాను నేను. రావణుని పుత్రుల్ని, సోదరుల్ని నేనొక్కణ్ణే చాలు యుద్ధంలో మట్టుపెట్టగలను. నేను కురిపించే రాళ్ళవానకి దేవతలు సైతం చస్తారు. నా పరాక్రమం తొందర పెడుతోంది. మీ అనుమతే ఆలస్యం.

సముద్రం చెలియలి కట్టని దాటవచ్చు. మందరపర్వతం చలించవచ్చు. శత్రుసైన్యాలు జాంబవంతుని ఎదుర్కొనలేవు. నిలవజాలవు. సకల రాక్షస గణాల్ని వాలి పుత్రుడు అంగదుడు ఒక్కడే చంపగలడు. పనసుడు నీలుడు మందర పర్వతాన్ని పిండి చేయగలరు. ఇక రాక్షసుల్ని చంపటం ఒక లెక్కా వారికి?



దేవతలు అసురులు రాక్షసులు గంధర్వులు నాగులు ఎవ్వరూ మైందుని ద్వివిదుని గెలువలేరు. వారు అమృతపానం చేశారు. బ్రహ్మవర రణోత్సాహులు. లంకలోని చతురంగ బలాల్ని నాశనం చేయగలరు.

లంకా నగరాన్ని ధ్వంసం చేశాను నేను. లంకను కాల్చాను. బూడిద చేశాను. రాజమార్గాల్లో నా పేరు మారు మోగింది.

**జయత్యతి బలో రామో లక్ష్మణశ్చ మహాబలః ।**
**రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభి పాలితః ॥**

రామునికి జయం. లక్ష్మణ స్వామికి జయం. రామానుగ్రహపాత్రుడు సుగ్రీవునికి జయం. నేను రామదాసుణ్ణి హనుమంతుణ్ణి అని చాటాను. అశోకవనం శింశుపా వృక్షం కింద వుంది సీతమ్మ. బలగర్వితుడు రావణుడు ఎంతో ప్రలోభపెట్టాడు. కాని పతివ్రత జానకీమాత సదా రామస్మరణలో ఉంది.

వరాలు పొందాడు రావణుడు. అయినా సీతమ్మ పాతివ్రత్యమే రావణుణ్ణి చంపుతుంది. రావణ వధకు రాముడు నిమిత్తమాత్రుడే. కనుక మన కర్తవ్యం ఏమిటో ఆలోచించండి – అని ముగించాడు హనుమ.

విన్నారు వానర వీరులు. అంగదుడు అంటున్నాడు. సీతాదేవిని హనుమ చూశాడు. లంకా దహనం చేశాడు. మనం విన్నాం. సీతను చూశాం కాని తీసుకురాలేదు అని మనం రామునికి ఎలా చెప్పాలి? అందుకు సముద్రం దాటుదాం. రాక్షసుల్ని హతమారుద్దాం. రావణుని చంపుదాం. సీతను తెద్దాం. సంతోషంతో రామసన్నిధికి చేరుదాం. హనుమంతుడు రాక్షసుల్ని చంపేశాడు. ఇక మనం చేయాల్సింది ఒక్కటే. జనకాత్మజని తెద్దాం. వెళ్దాం.

విన్నాడు జాంబవంతుడు. అతడు కార్యాకార్య విచక్షణా జ్ఞాని. అంటున్నాడు యువరాజా! నీవు చెప్పింది బాగుంది. కాని రామాజ్ఞ ఎలా ఉంది – ఆలోచించు. సీత జాడ తెల్సుకో అన్నాడు. ఆమెను తెమ్మని చెప్పలేదు. సీతాదేవిని చూశామని నివేదన చేద్దాం. అది తగింది.

## మధువనం

జాంబవంతుడు చెప్పింది విన్నారు వానరవీరులు. జాంబవంతుని సూచనను ఆమోదించాడు అంగదుడు. హనుమ సరే అన్నాడు. రాముణ్ణి చూడాలన్న ఉత్సాహం. సంతోషం. హనుమంతుని ముందు ఉంచుకున్నారు. మహేంద్రగిరి నుంచి ఎగిరారు. కిష్కింధ వైపు పోతున్నారు. ఆకాశమంతా కప్పినట్లుగా ఉంది వానరసేన. సీతను చూడటం, లంకాదహనం చేయటం ఇత్యాది సాహస కార్యాలు చేశాడు హనుమంతుడు. అందరూ అతణ్ణే రెప్పలార్పక చూస్తున్నారు. తక్కిన వానరులకన్నా తామే రామకార్యం సాధించామని తామే గొప్పవాళ్ళమని ఉత్సాహంలో పోతున్నారు.

మధువనం చూశారు. అది సకల వృక్షాలతో సంపన్నమైంది. నందనవనంతో సమానమైంది. అది సుగ్రీవుని రక్షణలో ఉంది. అందుకే ఎవ్వరూ అటు కన్నెత్తి చూడరు.

దధిముఖుడు ఒక వానరుడు. సుగ్రీవుని మేనమామ. నిరంతర వనరక్షకుడతడు. మధుపానం చేయాలని ఆరాటపడ్డారు వానరులు. అంగదుణ్ణి అడిగారు. జాంబవంతాది వృద్ధుల్ని సంప్రదించాడు అంగదుడు. వాళ్ళు అంగీకరించారు. మధు భక్షణకై అనుమతి లభించింది.

సంతోషించారు అందరూ. కిందికి దిగారు. కమ్మని దుంపల్ని తిన్నారు. పండ్లు తిన్నారు. తేనెలు తాగారు. అమితానందం పొందారు. మత్తెక్కింది. మైమరచారు.

**గాయంతి కేచిత్ ప్రణమంతి కేచిత్**
**నృత్యంతి కేచిత్ ప్రహసంతి కేచిత్ ।**
**పతంతి కేచిద్వి చరంతి కేచిత్**
**ప్లవంతి కేచిత్ ప్రలవంతి కేచిత్ ॥**

కొందరు పాడుతున్నారు. కొందరు తలకిందులుగా వేళ్ళాడుతున్నారు. నృత్యాలు చేస్తున్నారు కొందరు. పక పక నవ్వుతున్నారు కొందరు. కొందరు కిందపడిపోయారు. కొందరు అటు ఇటు తిరుగుతున్నారు. గంతులేస్తున్నారు కొందరు. వాగుతున్నారు కొందరు. ఒకళ్ళని ఒకళ్ళు పట్టుకుంటున్నారు. రహస్యాలు చెప్పుకుంటున్నారు. జతలు కట్టి ఆడుతున్నారు. చిటారు కొమ్మలెక్కి దూకారు. కిందినుంచి చెట్టుపైకెగిరారు. ఒకళ్ళ మీద ఒకళ్ళు పడుతున్నారు. ఒకడు ఏడుస్తున్నాడు. ఒకడు మరొకణ్ణి తోస్తున్నాడు. ఒకడు గర్జించాడు. ఒకడు కేకలు వేశాడు.

వానరసేన చిందర వందర అయింది. ఒక్కడు మత్తెక్కనివాడు, మధుపానంతో తృప్తి పొందనివాడు ఒక్కడు లేడు. పూలన్నీ రాల్చారు. కొమ్మలు విరిచారు. చెట్లు పడగొట్టారు. ఆకుల్ని తుంచేశారు.

చూశాడు దధిముఖుడు. కోపం వచ్చిందతనికి. అడ్డుకున్నాడు వానరుల్ని. అందరూ బెదిరించారు. కోపోద్రిక్తుడైనాడు. వనరక్షణకు పూనుకున్నాడు. పరుషంగా మాట్లాడాడు. ఎవ్వరూ పట్టించుకోలేదు. చేత్తో బెదిరించాడు. సామోపాయంతో ప్రార్థించాడు. మత్తెక్కిన వానరులు ఒకచోట చేరారు. దధిముఖుణ్ణి చుట్టుకున్నారు. భయపెట్టారు. లాగారు. గోళ్ళతో గీరారు. పళ్ళతో కొరికారు. కాళ్ళతో తన్నారు. వనమంతా పాడు చేస్తున్నారు.

## విధ్వంసం

వానరులను చూశాడు హనుమంతుడు. 'మీరు భయపడవద్దు. తేనె తాగండి. అడ్డు వచ్చేవారిని నేను నివారిస్తాను' అన్నాడు.

విన్నాడు అంగదుడు. అంటున్నాడు. హనుమంతుడు కార్యం



సాధించాడు. మారుతి చెప్పింది చేయండి. అది అకార్యమైనా సరే అంగీకరించాలి. వెళ్ళండి. తేనెలు తాగండి'.

ఇక వానర వీరులకి అడ్డేం ఉంది. వన పాలకుల్ని తోసేశారు. మధువనం మీద పడ్డారు. కావలి వాండ్లని పట్టుకున్నారు. కొట్టారు. కట్టేశారు. తేనె తుట్టెల్ని పట్టుకున్నారు. ఒక్కొక్కరు ద్రోణం (కుండెడు) తేనె తాగారు. మిగిలింది నేలపాలు చేశారు. తేనె తుట్టెల్ని విసిరేశారు. కొందరు వాటితో పరస్పరం కొట్టుకున్నారు. కొందరికి మత్తెక్కింది. చెట్ల ఆకులు పరచారు. పడుకున్నారు. ఒకర్నొకరు తోసుకున్నారు. తప్పటడుగులు వేశారు. పిచ్చెక్కిన వాళ్ళలా ప్రవర్తించారు. సింహనాదాలు చేశారు. పక్షుల్లా కూతలు పెట్టారు. నేలపై పడి నిద్రపోయారు. చేయకూడని పని చేశారు. చేసిన పాడుపనిని ఇతరులకి చెప్పారు. ఇలాంటి పనులు కూడా చేయవచ్చా అనుకున్నారు కొందరు.

వన రక్షకుల్ని హింసించారు. ఆ బాధలు తాళలేకపోయారు. నలుదిక్కులకి పారిపోయారు. కొందరు కావలి వాళ్ళని పట్టుకున్నారు. తమ పృష్ఠ భాగాలు చూపించారు. అవమానించారు. మోకాళ్ళ మీద నడిపించారు. దధిముఖుణ్ణి చేరారు. తమ బాధలు విన్నవించారు.

విన్నాడు దధిముఖుడు. ఓదార్చాడు. వనం పాడైంది. కోపగించుకున్నాడు. అందరం వెళ్దాం. వాళ్ళతో పోరాడుదాం. నా వెంట రండి అని పిలిచాడు. ఓ చెట్టును పెరికాడు. వాళ్ళవైపు పరిగెత్తాడు. చూశారు అనుచరులు. మద్దిచెట్లు తాటిచెట్లు పెరికారు కొందరు. రాళ్ళు పట్టుకున్నారు కొందరు. నాయకునితో పాటు వెళ్ళారు. వానరుల్ని చుట్టుముట్టారు.

చూశాడు అంగదుడు. దధిముఖుణ్ణి పట్టాడు. రెండు చేతులతో కొట్టాడు. కొట్టింది తన తాతనని తెలియదు అంగదునికి. నేలమీద పడేశాడు. కాళ్ళతో కుమ్మినాడు. దధిముఖుని చేతులు, భుజాలు, తొడలు దెబ్బ తిన్నాయి. రక్తం కారింది. తెలివి తప్పాడు. మళ్ళీ తేరుకున్నాడు. ఒక కర్ర తీసుకున్నాడు. వానరుల్ని తరిమాడు. అంటున్నాడు తన వాళ్ళతో. ఈ అంగదాదులు ఇక్కడే ఉండనీ. మన రాజు సుగ్రీవుడు. అతని దగ్గరికి వెళ్దాం. తండ్రి తాతల నుంచి వస్తున్న మధువనం ఇది. దేవతలు కూడా కాలు పెట్టలేరు. అంగదుడు మహాపరాధం చేశాడు. వాళ్ళని ఏం చేస్తావో చెయ్ – అని చెబుతాం. ఆగ్రహిస్తాడు సుగ్రీవుడు. ఈ వానరుల్ని దండిస్తాడు. వీళ్ళని చంపాలి. అపుడే మన కోపం పోతుంది అన్నాడు. వెంటనే తన భృత్యులతో ఆకాశంలోకి ఎగిరాడు. ఓ నిమిషంలో సుగ్రీవుని సమీపించాడు. రామ లక్ష్మణ సుగ్రీవులు ఉన్నచోట దిగాడు. దీనవదనుడైనాడు. వెంట ఉన్న అనుచరుల్ని చూశాడు సుగ్రీవుడు. చేతులు

అందరికీ కావాలి అమ్మ పాలు – అంతే అవసరం ఆవు పాలు

జోడించాడు వానరరాజు పాదాలకి శిరసా నమస్కరించాడు.

## కార్యం సఫలం

చూశాడు దధిముఖుణ్ణి. భయపడ్డాడు సుగ్రీవుడు. ఎందుకు నా పాదాలు పట్టుకున్నావు. అభయమిస్తున్నాను. భయపడకు. మధువనం భద్రంగా ఉందికదా అంటూ లేవదీశాడు. అసలేం జరిగిందో చెప్పు.

అంటున్నాడు దధిముఖుడు. 'రాజా నీ తండ్రి ఋక్షరజుని కాలంలో కాని వాలి కాలంలో కాని నీవు రాజు అయ్యాక కాని మధువనం రక్షింపబడుతోంది. ఒక్కరూ ప్రవేశించలేదు. ఈరోజు వానరులు వచ్చారు. ఫలాలు భక్షించారు. తేనెలు తాగారు. వనాన్ని పాడు చేశారు. వన పాలకుల్ని కొట్టారు. మేం లెక్కలేదు వాళ్ళకి. తేనెలు తాగి మిగిలింది పారబోశారు. నన్ను కొట్టారు. మోకాళ్ళతో కుమ్మారు. ఈడ్చారు. బాధించారు. మీరంటే కూడా భయం లేదు వాళ్ళకి.

అక్కడ రామలక్ష్మణులున్నారు. వారికి ఆ భాష అర్థం కాలేదు. అతడేం చెబుతున్నాడో – సుగ్రీవుణ్ణి అడిగాడు లక్ష్మణుడు. సీతమ్మకి ఏదైనా అనర్థం జరిగిందా అని సౌమిత్రి భయం.

సుగ్రీవుడంటున్నాడు. 'పూజ్యుడా! ఇతడు దధిముఖుడు. మధువన రక్షకుడు. మన వానరులు దక్షిణ దిశకు వెళ్ళారు. గడువులోగా తిరిగి రాలేదు. ఆ వానర వీరులు వచ్చారు. మధువనాన్ని ధ్వంసం చేశారు. అదే చెబుతున్నాడు ఇతడు. నాకెంతో ప్రియమైన వనాన్ని పాడు చేశారు. అంటే సీతాదేవిని చూశారని అనుకోవాలి.

**దృష్టా దేవీ న సందేహాన బాన్యేన హనుమతా**

సీతమ్మని చూసింది ఎవరో కాదు. హనుమంతుడే చూశాడు. అతడు తప్ప వేరొకరు కార్యం సాధించలేరు. కార్య సాధన కౌశలం బుద్ధిబలం ఉత్సాహం పరాక్రమం విద్య – ఈ అయిదూ హనుమంతునిలో ఉన్నాయి. అనుభవజ్ఞుడు జాంబవంతుడు – బలశాలి అంగదుడు నాయకుడిగా ఉండగా – హనుమంతుడు ప్రధానుడైతే కార్యం సఫలమవుతుంది. వనరక్షకుని వన పాలకుల్ని చావగొట్టారు. వనభంగ వార్త చెప్పాలని వచ్చాడు ఇతడు.

మా తండ్రి గారికి మధువనాన్ని బ్రహ్మదేవుడు వరంగా ఇచ్చాడు. వానరవీరులు బుద్ధిమంతులు. వనధ్వంసం చేయరు. అలా చేశారంటే సీతాదేవిని చూశారు. ఇది ముమ్మాటికీ నిజం. ఆ ఆనందంతో వనాన్ని పాడు చేశారు.

అలా రామలక్ష్మణులతో చెప్పాడు సుగ్రీవుడు. తర్వాత దధిముఖుణ్ణి చూశాడు. వానరవీరులు కృతకృత్యులయ్యారు. మధువనంలో ప్రవేశించారు. మధువు సేవించారు. సంతోషంగా ఉంది నాకు. ఇక వాళ్ళ చేష్టలు క్షమించాను. రామలక్ష్మణులు నేను వాళ్ళని చూడాలని ఉన్నాం. వెంటనే వెళ్ళు. అందరినీ పంపించు అన్నాడు. అతని కన్నులు మెరుస్తున్నాయి. శరీరం పులకరించింది. కార్యం సిద్ధించింది అనుకున్నాడు. ఆనందభరితుడైనాడు.

## కిష్కింధకు రాక

విన్నాడు దధిముఖుడు. సుగ్రీవుని ఆదేశానికి తలూపాడు. రామలక్ష్మణ సుగ్రీవులకి నమస్కరించాడు. ఆకాశంలోకి ఎగిరాడు. మధువనంలో దిగాడు. చూశాడు వానరుల్ని. మత్తు దిగిపోయింది వాళ్ళకి. అందరూ మూత్ర విసర్జన చేస్తున్నారు. అంగదుణ్ణి సమీపించాడు దధిముఖుడు. చేతులు జోడించాడు. అంటున్నాడు.

యువరాజా! మిమ్మల్ని అడ్డగించాను. మా వాళ్ళు అజ్ఞానులు. కోపించకు. నీవు యువరాజువు. ఈ వనానికి నీవే ప్రభువు. అది తెలియదు. అందుకే మావాళ్ళు తప్పు చేశారు. క్షమించు. మీరంతా ఇక్కడికి వచ్చారని వనాన్ని పాడు చేశారని సుగ్రీవునితో చెప్పాను. ఆయనకు కోపం రాలేదు. సంతోషించాడు. మిమ్మల్ని చూడాలని ఉన్నాడు. వెంటనే పంపించమన్నాడు.

విన్నాడు అంగదుడు. అంటున్నాడు వానర వీరులతో. 'మన వృత్తాంతం రామునికి తెలిసింది. సుగ్రీవుడు రమ్మంటున్నాడు. ఇక్కడ ఉండరాదు. మనం వెడదాం. వీరులారా! మీరెలా చెబితే అలా చేద్దాం. నేను యువరాజునే. కార్యం సాధించింది మీరు. నేను మిమ్మల్ని ఆజ్ఞాపించడం తగదు. దానికి సమర్థుణ్ణి కాదు.

విన్నారందరూ. అంటున్నారు. ఐశ్వర్యమదంతో అన్నీ నాకే తెలుసు. అధికారమదంతో నేనే సర్వాధికుణ్ణి అంటారు కొందరు. ఇలా వినయంతో పలకడం నీకే తగింది. అది ఇతరులకి అసాధ్యం నీకు మంచి భవిష్యత్తు ఉంది. శుభం. నీ అనుజ్ఞ లేనిదే మేం అడుగు తీసి అడుగు పెట్టం. ఇది నిజం.

సరే అన్నాడు అంగదుడు. అందరూ ఒక్కుమ్మడిగా ఆకాశంలోకి ఎగిరారు. యంత్రంలో పైకి చిమ్మిన కొండల్లా ఉన్నారు వానరులు. ఆకాశంలో అవకాశం లేకుండా వ్యాపించారు. గాలి తోడైంది. మహావేగంతో వెళ్ళారు. హనుమ అంగదుడు ముందున్నారు. మిగిలినవారు అనుసరిస్తున్నారు వారిని.

రాముణ్ణి ఓదార్చుతున్నాడు సుగ్రీవుడు. సీతాదేవిని చూశారు వీరులు. వచ్చేస్తున్నారు. నీకు భద్రమగు గాక. హనుమంతుడే దర్శించి ఉంటాడు జనకాత్మజని అన్నాడు.

అంతలో కిలకిలా రావాలు వినబడుతున్నాయి. సింహగర్జనలు వినపడుతున్నాయి. విన్నాడు సుగ్రీవుడు. సంతోషించాడు. తన తోక పైకెత్తాడు. గమ్యస్థానం చేరాలి విమానం. అందుకు దీపకాంతులు సూచింపబడతాయి. అలా ఇక్కడే దిగాలి అన్నట్లు వాలం పైకెత్తాడు సుగ్రీవుడు. **(సశేషం)**

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు



### 383. బహురామా కృతాహ్లోదాయ నమః

పెక్కురు స్త్రీల చేత కలిగింపబడిన ఆనందము కలవాడు, లేదా పలువురు కాంతలకు ఆనందము కల్గించువాడు.

కృష్ణుడు స్వయంవరమున వరింపబడి శాస్త్రోక్తముగ అగ్నిసాక్షిగా వివాహమాడిన భార్యలు ఎనిమిదిమంది. వీరు అష్ట మహిషులని కీర్తింపబడినవారు. వీరు గాక నరకాసురునిచే చెరబట్టబడిన 16 వేల రాజకుమార్తెలను బంధ విముక్తులను చేసి వారిని ద్వారకకు తీసికొని వచ్చి వారిని కులీనులైన రాజకుమారులు వివాహమాడుటకు నిరాకరింపగా, వారి హితము కోరి ఆ 16 వేల మంది రాజ కన్యలను తాను వివాహమాడి, వారికి సంఘములో గౌరవము, సుఖజీవనము కృష్ణుడు కల్పించినాడు. కృష్ణుడు గొప్ప సంఘ సంస్కర్త. బహు రామా కృతాహ్లోదుడైన కృష్ణుడే వేంకటేశునిగా అవతరించినాడు. అట్టి వేంకటేశ కృష్ణునకు నమస్కారము.

### 384. గంధ మాల్యాను లేపనాయ నమః

సువాసనను విరజిల్లు పూలమాలలు, మైపూతలు కలవాడు కృష్ణుడు. విష్ణువు. వీరికి అభేదము కలదు. గంధ మాల్యాను లేపనములు అష్టభోగములలోనివి. గంధమాల్యాను లేపనయుతుడైన కృష్ణుని అవతారమే అయిన వేంకటేశునకు నమస్కారము. నేటికీ వేంకటేశ్వర స్వామికి శుక్రవారం అభిషేక సమయము స్వామి విగ్రహమునకు కదంబము, పునుగు గంధాదులను పూసి ఉద్వర్తనం చేసి, శుద్ధ జలముతో అభిషేకము జరుగుతున్నది. స్వామివారి ఊర్ధ్వపుండ్రము పచ్చకర్పూరము పొడితో, కస్తూరితో దిద్దబడుతుంది.

### 385. నారదాదృష్ట చరితాయ నమః

మహాజ్ఞాని యగు నారదమహర్షికి కూడా కనపడని తెలియని చరిత్ర కలవాడు విష్ణుదేవుడు. న – దృష్ట – అ దృష్ట – కనపడని అని అర్థము.

నారదునికి కూడా అదృష్ట (కనపడని) చరితుడైన విష్ణుదేవుని అర్చామూర్తి యైన వేంకటేశునకు నమస్కారము.

### 386. దేవేశాయ నమః

దేవానాం ఈశః దేవేశః – దేవాధి దేవుడు – విష్ణువు. దేవతలకే అధిపతి అయినవాడు విష్ణువు.

''అగ్ని రవమో దేవా నాం, విష్ణుః పరమః'' అని వేదము దేవతలలో అగ్నిని కనిష్ఠ దేవతగా, విష్ణుని పరదేవతగా స్తుతించింది. ''విష్ణుః సర్వేషాం అధిపతిః'' అని శ్రుతి వాక్యము. యే దేవేష్వధిదేవ ఏవ ఆసీత్ కస్మై దేవాయ హవిషా విధేమ అని ఋగ్వేదం విష్ణువును కీర్తించింది. మన దేహంలోని ఇంద్రియములకు దేవ అను పేరు కలదు. ఈ సర్వేంద్రియ శాసకులు నియామకుడు ఆత్మస్వరూపమున విష్ణువు దేవేశుడు అనబడుచున్నాడు.


దేవేశుడయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

దేవేశః నామము విష్ణు సహస్ర నామములలో 493 సంఖ్యతో ఉన్నది.

### 387. విశ్వ రాజే నమః

ఈ సమస్త ప్రపంచమునకు ప్రభువు – విష్ణువు.

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**



విష్ణు సహస్ర నామములలో మొదటి రెండు నామములు విశ్వమ్, విష్ణుః అనునవి విశ్వమునకే అధిపతి విష్ణువని, విష్ణువు విశ్వరూపుడని తెలుపుచున్నవి. హరిమయము విశ్వమంతయు హరి విశ్వమయుండు అని పోతన ఉవాచ.

సర్వం విష్ణుమయం జగత్, సర్వ దేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి అను వాక్యములు విష్ణువే విశ్వపతి, విశ్వరాజు అని ధ్రువపరచుచున్నవి.

విశ్వరాజయిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

### 388. గురవే నమః

భారత యుద్ధం ప్రారంభ సమయంలో కర్తవ్య మూఢత్వము పొందిన అర్జునునికి కృష్ణుడు భగవద్గీతగా ప్రసిద్ధిని పొందిన యోగ శాస్త్రమును ఉపదేశించి అర్జునుని కర్తవ్యమును నిర్వహించుటకు సంసిద్ధుని చేసినాడు. నాటి నుండి కృష్ణుడు గీతాచార్యుడుగా వ్యవహరింపబడినాడు. గీతాచార్యుడైన కృష్ణుడు సమస్త ముముక్షువులకు, జ్ఞానులకు పరమ గురువుగా గౌరవింపబడినాడు. పూజింపబడినాడు.

గుప్తం రౌతీతి గురుః అని వ్యుత్పత్తి – రహస్యార్థములను బోధించువాడు గురువు అని అర్థము.

గిరతీతి గురుః, సర్వాః విద్యాః ఉపదిశతి సః గురుః

విష్ణువు దేవతలకు వేదముల నుపదేశించి వారందరికీ గురువు అయినాడు. యోగసూత్రము కాలము అపరిచ్ఛిన్నమైనందున ఆ భగవంతుడే (విష్ణువే) అతి ప్రాచీనులైన మహర్షులకు, దేవతలకు ప్రథమ గురువు అని చెప్పబడెను. ఆశ్రితులందరికీ సర్వవిద్యలను ఉపదేశించినవాడు గురువు. విష్ణుదేవుడు.

వైష్ణవులు తమ గురు పరంపరను స్తుతించునప్పుడు లక్ష్మీనాథ సమారంభాం అని ప్రథమ గురువుగ విష్ణుదేవునే కీర్తించుచున్నారు. దేవతలందరికీ, మహర్షులకు ప్రథమ గురువైన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము. ఈ గురుః నామము విష్ణు సహస్ర నామములలో 495 సంఖ్యతో ఉన్నది. ఈ నామము శివ సహస్ర నామములలో 842 సంఖ్యతో ఉన్నది. అందరికీ జ్ఞానము నొసంగు బృహద్రూపుడు శివుడు. త్వం త్వామర్చంతి కుశలాః ప్రపన్నార్తి హరం గురుం – భార ఆను, 7–21

శివ కేశవులకు అభేదమని పురాణములు, శాస్త్రములు చెప్పుచున్నవి. అయినా మనం శివ కేశవుల మధ్య భేదం పాటించుచున్నాము. మనలో సమ భావము కలుగవలె నని భగవంతుని ప్రార్థించాలి.

### 389. బాణ బాహు విదారకాయ నమః

వేయి చేతులు గల బాణాసురుని బాహువులను ఖండించిన వాడు కృష్ణుడు.

బాణుడు బలి చక్రవర్తి యొక్క పెద్ద కుమారుడు. ప్రహ్లాదుని మనుమడు. ఇతడు వేయి చేతులు కలవాడు. బాణుడు శివుని గూర్తి ఘోరమైన తపస్సు చేసి తన పుర ద్వారమునందు శివుడు కావలి ఉండునట్లు వరము పొందినాడు. బాణునికి తెలియక అతని కుమార్తె ఉష కృష్ణుని మనుమడు, ప్రద్యుమ్నుని కుమారుడగు అనిరుద్ధునితో అంతఃపురమున కాపురము పెట్టినది. ఈ సంగతి తెలిసిన బాణుడు అంతఃపురమున నున్న అనిరుద్ధుని బంధించి నాగపాశబద్ధుని చేశాడు. ఈ వార్త నారదుని ద్వారా తెలిసిన కృష్ణుడు బాణునిపై దండెత్తిపోయి యుద్ధములో కృష్ణుడు బాణుని సహస్ర బాహువులలో 996 బాహువులను ఖండించి శివుడు కృష్ణుని ప్రార్థింపగా నాలుగు చేతులతో ప్రాణము తీయక విడిచిపెట్టినాడు. ఈ సందర్భములో కృష్ణునికి బాణునితో జరిగిన యుద్ధమున భక్తుని పక్షమున శివుడు కూడా పాల్గొన్నాడు. యుద్ధానంతరము కృష్ణుడు శివుని భక్తులగు ప్రమథ గణములలో బాణుడు ముఖ్యుడు అగునని అనుగ్రహించి, ఉషానిరుద్ధులతో కృష్ణుడు ద్వారకకు చేరినాడు.

బాణుని బాహువులను ఖండించిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

# ముకుందమాల

- డా|| భువనేశ్వరి మారేపల్లి, 9550241921

ధారావాహికం

## 38వ శ్లోకం

**ధ్యాయంతి యే విష్ణు మనంత మవ్యయం**
**హృత్పద్మమధ్యే సతతం వ్యవస్థితం ।**
**సమాహితానాం సతతాభయప్రదం**
**తే యాంతి సిద్ధం పరమాం చ వైష్ణవీమ్ ॥**

హృదయ కమలము యొక్క మధ్యమున ఎల్లప్పుడూ ఉండి ప్రకాశించేవాడు, ఆశ్రితులకు అభయ మిచ్చేవాడు, అవ్యయుడును, అనంతుడైన శ్రీమహావిష్ణువుని ఎవరు తలుస్తారో నిరంతరం శ్రేయస్కరమైన విష్ణుస్థానమగు పరమపదమును పొందుతున్నారు.

పరమాత్మ అనంతుడు, పరత్వం, సౌశీల్యం కలిగిన వ్యక్తి కృష్ణ పరమాత్మ దివ్య చక్షువులను ప్రసాదించి అర్జునుడికి తన విరాట్ స్వరూపం చూపించి అనుగ్రహించాడు, ఒక్క సూర్యుడినే మనం సరిగా చూడలేము అలాంటిది వేయి కోట్ల సూర్య కాంతి కలిగిన స్వామిని ఎటునుండి ఎటువైపుకు చూడాలో తెలియక, చూడలేక దివ్య చక్షువులను తీసివేయమని ప్రార్థించాడు.

"దేవ అభ్యస్య రూపస్య నిత్యం దర్శన కాంక్షిణః" ఈలాంటి నారూపం చూడటానికి ఎందరో తపస్సులు చేస్తూనే ఉన్నారు, కానీ ఎవ్వరికీ చూపించలేదు. చూసావు కదా అని దివ్య చక్షువుని తీసివేసాడు. అప్పుడు అర్జునుడు నీవేనా నా బావవేనా అన్నాడు. చేతికి అందితే చులకన, పర రూపం చూపిస్తే భయం. ఇదీ లోకపు రీతి.

నేను ఎవ్వరికీ కనిపించేవాడిని కాదు, అందరిలో ఉండేవాడిని. భక్తితో తప్ప దొరకని వాడిని. ఎందుకు అంటే! అది నా స్వభావం. ప్రేమించిన వాడికి దొరికి పోవడం నాలక్షణం. నువ్వు నీ సాధనంగా ఎన్ని యజ్ఞాలు, దానాలు, ధర్మలు చేసినా దొరకను. ప్రేమకి మాత్రమే అందేవాడిని అని చెప్పాడు.

**"నేహాభిక్రమ నాశో స్తి ప్రత్యవాయో న విద్యతే ।**
**స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భూయాత్ ॥"**

అని భగవద్గీతలో వివరించినట్లు సమాధి యుక్తునికి అభయమిస్తాడు పరమాత్మ, అభయము కలిగితే ధ్యానం, జ్ఞానము మరింత పెరిగి ప్రకృతి మాయ వీడి వైష్ణవత్వం కలుగుతుంది తద్వారా ముక్తి పొంది పరమపదం లభిస్తుంది.

ఆ విధంగా పరమపదం చేరుకున్నవారిలో ఒకరు అల్లూరి వెంకటాద్రిస్వామి. తమిళనాడులోని సంగీత త్రిమూర్తులు- శ్రీ



త్యాగరాజు, శ్రీ ముత్తుస్వామి దీక్షితార్ మరియు శ్రీ శ్యామశాస్త్రి లాగానే, ఆంధ్ర రాజ్యానికి కూడా దాని విశిష్ట ప్రతిరూపాలు అయినవారు – తాళ్ళపాక అన్నమాచార్యులు, భద్రాచలం రామదాసు మరియు అల్లూరి వెంకటాద్రిస్వామి.

'అమరము నాంధ్రము కావ్యము' అంటూ, ఆంధ్ర భాష కూడా దేవభాషేనన్న వాగ్గేయకారుడు శ్రీమాన్ అల్లూరి వెంకటాద్రి స్వామి- తిరువరసుగానూ, శ్రీమత్ పరమహంస తిరువేంగడ

రామాను జ జియరుగానూ వైష్ణవ భక్తకోటిలో ప్రసిద్ధుడు. హరికథాగానానికి విశిష్టత తెచ్చినవాడు. భద్రాచల రామదాసు పరంపరకు చెందిన కవి ఆయన.

"యేమయ్యా రామయ్యా" అని పరమాత్మణ్ణి ప్రాణ స్నేహితుడిలా సంభావించిన వాడాయన.

శ్రీరంగం రంగనాథస్వామిని కస్తూరి రంగయ్యగా తెలుగింట నిలిపాడు.

"కస్తూరిరంగయ్య, కరుణింపవయ్య, సుస్థిరముగ నమ్మితి నయ్య" అనే హరికీర్తన వీరిదే!


"పరాకు సేయుట, పాడిగాదురా పరమపురుష వరదా" పాట హరిదాసులనోట వినిపిస్తూనే ఉంటుంది.

"బిరాన బ్రోవక నిరాకరించుట బిరుదు నీకు దగురా–వరదా" అని ప్రశ్నిస్తాడు ప్రభువును.

భారద్వాజస గోత్రీకులైన ఆరువేల నియోగులు శ్రీ అల్లూరి వెంకయ్య, శ్రీమతి వెంకమ్మ దంపతులకు అల్లూరి వెంకటాద్రిస్వామి, 1806లో అక్షయ నామ సంవత్సరం ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో, ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన కృష్ణాజిల్లా జుజ్జూరు పరగణా ఆలూరులో జన్మించారు. ఆ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిపై బాల్యం నుండీ అతిభక్తి ఉండేది. విద్యా గురువు లేకుండానే అనేక స్తోత్రాలు, శాస్త్రాలు ఆ బాల వెంకటాద్రికి అబ్బటం, తలిదండ్రులను అమితాశ్చర్యచకితుల్ని చేసింది. తనకు సన్మార్గ దర్శి అయిన గురువు లభించాలని ఉబలాట పడుతున్న సమయంలో తూము నరసింహ దాసుగారి దర్శనం లభించి, తారక నామ మంత్రోపదేశం చేసి, హరినామ సంకీర్తన మార్గంలో ప్రవేశ పెట్టారు.

దీన, నిర్భాగ్యులను ఉద్ధరించే సత్సంకల్పమున్న వెంకటాద్రిస్వామి, శాయశక్తుల వారికి సహాయ సహకారాలు అందించేవారు. వైష్ణవ సంప్రదాయంలో ఉన్నారు కనుక పవిత్ర వైష్ణవ క్షేత్రదర్శనం చేసే వారు. అలా భద్రాచలం వెళ్లి అయిదేళ్ళు నిర్విరామంగా శ్రీహరి నామ సంకీర్తనతో మునిగిపోయారు. స్వామి భక్తి యెంత పటిష్టమైనది అంటే స్వప్నంలోనూ, సామాన్యంగానూ ఆయనకు శ్రీరామ చంద్రుడు సాక్షాత్కరించి, సంభాషించి, ఆయన గుణ గరిమను అభినందించేవాడు. రామనామం కోటి దాకా రాసి, కీర్తనలు రచించి తన్మయత్వంతో గానం చేసేవారు వెంకటాద్రిస్వామి. కల్యాణి రాగంలో వెంకటాద్రి స్వామిరచించిన "శరణు శరణు, శరణు శ్రీరామ రామ రామచంద్ర" కీర్తనలో శ్రీరామ వైభవం కళ్ళ ముందు నిలిపారు. పవిత్ర గోదావరి, పరమ పవిత్ర అపర వైకుంఠం భద్రాద్రి ఆర్తత్రాణ శరణ్యుడు సీతారామచంద్రమూర్తిని వదలి ఎక్కడికీ వెళ్లాలని అనిపించేది కాదు స్వామికి.

ధారణ నామ సంవత్సరం 1824లో వెంకటాద్రిస్వామి



చైత్ర బహుళ సప్తమినాడు తిరుమల చేరి, పెరుమాళ్ళ పూలంగి సేవలో అయిదు సంవత్సరాలు ఆనందంగా స్వామి వారి సేవ చేసి, దివ్యనామ సంకీర్తన చేస్తూ ధన్యులయ్యారు. "ఇందిరా రమణ నీ విందు రారా" కీర్తనను సహన రాగంలో రచించి భక్తి పారవశ్యంతో గానం చేశారు. పరమ ప్రీతి చెందిన శ్రీవారు స్వప్నంలో సాక్షాత్కరించి కంచిలో తన సేవ చేసుకోమని ఆదేశించారు.

భగవదాదేశం ప్రకారం వెంకటాద్రిస్వామి కాంచీపురం చేరి వేగవతి నదిలో పుణ్యస్నానం చేసి, పేరుందేవి తాయార్ దర్శనం చేసి "నిను నమ్మి ఉన్నా సీతమ్మ" అని కాపీ రాగంలో కీర్తన రచించి, గానం చేసి అమ్మవారికి అర్పించారు. వెంకటాద్రిస్వామి నిశ్చల భక్తికి మెచ్చిన వరదరాజ స్వామి శ్రీదేవీ భూదేవీ సహితంగా వెంకటాద్రిస్వామికి దివ్య దర్శనమిచ్చాడు. పరవశం చెందిన వేంకటాద్రి స్వామి ఆనంద నృత్యం చేస్తూ నాట రాగంలో "జయ జలధర శ్యామ" మరియు "దేవ దేవ శౌరే మురారే" కీర్తనలు గానం చేసి తరించి భక్తులను తరింపజేశారు.

పుష్ప కైంకర్యం నుంచి చందనం అలదటం కూడా చేస్తూ స్వామివారికి నిత్యం కాచిన పాలను అందించే ఏర్పాటు కూడా చేశారు వెంకటాద్రిస్వామి. బ్రహ్మతీర్థ తటంపై సేన ముదలియార్

సన్నిధిలో ఉంటూ సేవలు అందజేసేవారు. ఆయన ఉన్న ఆ గదిని ఇప్పటికీ వెంకటాద్రిస్వామి గదిగా పిలుస్తారు. ఒక రోజు స్వామి సేవకు పూలతోటలో పుష్పాలు కోయబోతుంటే, ఒక పాము ఆయన కాలిపై కాటు వేసింది. ఏమాత్రం కంగారు పడకుండా నిబ్బరంగా పేరుందేవి సన్నిధికి వెళ్లి కమాస్ (ఖమస్) రాగంలో "కాపాడరా నన్ను" అని కీర్తన రాసి పాడుతూ, ధ్వజస్థంభ సమీపంలో అపస్మారకంగా పాము కాటు ప్రభావం వలన నేలపై పడిపోయారు. కాసేపటికి తేరుకొని దేవరాజ సన్నిధి చేరి, దర్శనం చేసి తీర్థ ప్రసాదాలు తీసుకొని దైనందిన కృత్యంలో, గానంలో, కీర్తనలలో నిమగ్నమయ్యారు.

భిక్షాటనంలో జీవిస్తున్నా, మహదైశ్వర్యవంతులు, మహారాజులు కూడా ఇవ్వలేనంత భూరి సంపాదనను వరదరాజ స్వామి సేవకు అందజేసేవారు వెంకటాద్రిస్వామి. తన శక్తి సామర్థ్యాల గురించి ఆలోచించకుండా భగవంతుని అపార కరుణా దృష్టిపైనే నమ్మకంతో మహాద్భుత కార్యాలు సాధించి కీర్తి పొందారు స్వామి. భగవంతుని కింకరుడిగా తాను చేస్తున్నాను అనే వినయం ఆయనది. అందులో తన గొప్పదనం ఏమీ లేదు. తాను నిమిత్తమాత్రుడను అనుకొనే వారు. భక్తులు దాతలు అందజేసిన విరాళాలను జాగ్రత్త చేసి స్వామి కైంకర్యాలకు అనువుగా ఖర్చు చేసేవారు. ఎక్కడా ఎప్పుడూ ఏ లోటు రానీయలేదు.

దివ్య దేశమైన కంచిలో జీర్ణోద్ధరణ కార్యక్రమాలు నిర్వహించారు వెంకటాద్రిస్వామి. అందులో ముఖ్యమైనది విలక్కోలి పెరుమాళ్ సన్నిధి మండపం, గోపుర నిర్మాణం, వేదవిద్యా వాప్తికోసం, బాలురకు వేదాభ్యాసం కోసం ధార్మిక సంస్థను నెలకొల్పారు స్వామి. భక్తుల కానుకలతో భూమికొని, ఆ స్వామి భూములపై వచ్చే ఆదాయంతో వేద విద్య నేర్పించారు. దూసి మామందూర్ లో ఆరోజుల్లో అత్యధిక ధరగా భావించే 5వేల రూపాయలతో పొలం కొని తాను ఏర్పాటు చేసిన ఎండోమెంట్ కు అందజేశారు.

భక్తులు వెంకటాద్రిని ఆయన తిరునామాలు, కుడి చేతిలో తంబురా, ఎడమ చేతిలో తాళాలు, పారవశ్యంతో కీర్తనలు గానం చేస్తుంటే, స్రవించే ఆనంద పరవశంగా వచ్చే, ఆనంద బాష్పాలు చూసి "శ్రీ వెంకటాద్రి స్వామి" అని భక్తితో పిలవటం ప్రారంభించారు. ఒకసారి వరదరాజస్వామి వెంకటాద్రి కలలో కన్పించి, తనకు వజ్ర కిరీటం చేయించి అమర్చమని ఆదేశించాడు. దీనికి చాలా డబ్బు ఖర్చు అవుతుంది కనుక, భూరి విరాళాలు సమర్పించే దాతల కోసం 1835 మన్మథ నామ సంవత్సర వైశాఖ శుద్ధ నవమి నాడు మద్రాస్ వెళ్ళారు స్వామి. కైరవానిలో స్నానించి, శ్రీ పార్థసారథి స్వామిని దర్శించి కమాస్ రాగంలో "పార్థసారథి పదభజన చేయవే మనసా" కీర్తన కూర్చి ఆర్తిగా పాడారు. ఈ ఆలయ అర్చకుడు శ్రీ షోల సింహపురం శేషాచార్యకు అతిథిగా ఉన్నారు. స్వామి వ్యక్తిత్వం అక్కడి వారు బాగా గ్రహించి వరదరాజ స్వామి వజ్ర కిరీటం కోసం విరాళాలు కురిపించారు. అర్చకస్వామి స్వయంగా 500 రూపాయలు సమర్పించగా, కంచికి చెందిన వెంకట రంగం పిళ్ళై సుమారు పది తులాల స్వచ్ఛ బంగారం అందించాడు. అనుకున్న దానికంటే తక్కువ సమయంలోనే ధనం సమకూరటం వలన వెంకటాద్రి స్వామి పేరు ప్రఖ్యాతులు మద్రాస్ లో విశేష వ్యాప్తి చెందాయి.

వజ్ర కిరీటం తయారవగానే మద్రాస్ పురవీధులలో, సెవెన్ హిల్స్ ప్రాంతంలో ఊరేగించి, కంచికి చేరి, తెల్ల గొడుగు, ధ్వజం మేళతాళాలతో వేలాది పురజనులతో ఊరేగింపు జరిపి కనువిందు చేకూర్చారు. 1858 కాళయుక్తి నామ సంవత్సర వైశాఖ పౌర్ణమి నాడు గరుడసేవ రోజున శ్రీ కంచి వరదరాజ స్వామికి వజ్రకిరీటాన్ని సకల లాంఛనాలతో అమర్చారు. ఆ సమయంలో వెంకటాద్రి స్వామి ఆనంద నృత్యం చేస్తూ, కమాస్ రాగం లో "నిగమ గోచరా స్వామీ", మధ్యమావతి రాగంలో "పక్షి వాహనా స్వామీ" కీర్తనలు రాసి సుమధురంగా గానం చేసి ధన్యత చెందారు. ఈనాటికీ ఆ వజ్రకిరీటాన్ని వెంకటాద్రిస్వామి సమర్పితంగా భక్తులు చెప్పుకొంటారు. ఆ రోజు రాత్రి స్వామి స్వప్నంలో శ్రీదేవి, భూదేవి కనిపించి తమకూ అలాంటి కిరీటాలే చేయించి పెట్టమని కోరారు. అచిరకాలంలోనే వారి కోరిక తీర్చారు వెంకటాద్రిస్వామి. వరదరాజ, శ్రీదేవి, భూదేవులు నగర వీధులలో ఊరేగింపుగా వజ్ర కిరీటాలతో జగజ్జేగీయమానంగా ఊరేగుతుంటే జనాలకు చూడటానికి రెండు కళ్ళు చాలలేదు. ఆ శోభకు కారణం వెంకటాద్రిస్వామియే.

ఇంతటి అంకిత భావంతో పెరుమాళ్ళ సేవ చేస్తున్న వెంకటాద్రిస్వామి సేవలకు తగిన ప్రతిఫలం ఇవ్వాలని శ్రీ దేవరాజ స్వామి భావించి, అర్చకత్వ విధానం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించటానికి ఆచార్య అంగీకారునిగా చేయాలని భావించాడు. వరదరాజస్వామి వెంకటాద్రిస్వామి స్వప్నంలో దర్శనం అనుగ్రహించి, వైష్ణవ సంప్రదాయ బద్ధమైన పంచ సంస్కారాలు పొందమని ఆదేశించాడు. స్వామి ఆజ్ఞా పాలనా నిమిత్తం కంచిలోని మనవాళ్ళ జీయర్ స్వామిని దర్శించి సమాశ్రయనం అంటే పంచ సంస్కారాలు పొందారు శ్రీ వెంకటాద్రిస్వామి.

కంచి వరదరాజస్వామి సేవలో నిండా మునిగి ఉన్న సమయంలో, శ్రీరంగంలోని శ్రీరంగనాథ స్వామి తనకు వెంకటాద్రిస్వామి సేవలు కావాలని అభిలషించాడు. ఒక రోజు స్వామి కలలో కనిపించి తనకున్న అత్యంత విలువైన వజ్రకిరీటం దెబ్బతిన్నదని దాని స్థానంలో కొత్త కిరీటం తయారు చేయించే బాధ్యత వెంకటాద్రిస్వామియే తీసుకోవాలని ఆదేశించాడు.



ఆ కిరీటం కొలతలేమిటో మన స్వామికి తెలియదు. ఏమి చెయ్యటానికీ పాలుపోక వరదరాజస్వామి పైనే భారం వేసి, ఒక నమూనా కిరీటం తయారు చేయించి శ్రీరంగం తీసుకువెళ్ళారు. తిరుక్కావేరిలో పవిత్ర స్నానం చేసి శ్రీరంగని దర్శించటానికి ఆ లయానికి వెళ్ళారు. ఆలయంలో కోవిలన్నన్, భట్టారస్వామి మొదలైన ప్రముఖులు ఘన స్వాగతం ఇచ్చి స్వామి సన్నిధికి తీసుకు వెళ్ళారు. ఆలయంలో రంగని పైనా, అమ్మవారి పైనా పున్నాగ వరాళి రాగంలో "నిన్ను కోరియున్నా" కీర్తన రాసి పరవశంతో గానం చేసి, తను తెచ్చిన నమూనా (మోడల్) వజ్రకిరీటాన్ని శ్రీరంగనికి సమర్పించారు. ఆశ్చర్యంగా ఆయనకు సర్గ్గా చక్కగా సరిపోయి అందరికీ అద్భుతమనిపించి వెంకటాద్రిస్వామి దైవభక్తికి ముగ్ధులయ్యారు. ఈ సంఘటనతో వెంకటాద్రి స్వామి కీర్తి శ్రీరంగంతో సహా అన్ని ప్రాంతాలలో మిన్నంటింది.


పాండ్యకిరీటం తయారీకి పూనుకున్న వెంకటాద్రి స్వామి దానికి కావలసిన ధనం కోసం ప్రయత్నిస్తూ, రోజుకు కనీసం పది రూపాయల విరాళమైనా రాకపోతే నిరాహార దీక్ష చేస్తానని నిర్ణయం ప్రకటించారు. విరాళాలు రాని రోజున దేర్ హౌస్ వెంకటస్వామి నాయుడు, పుదుచ్చేరి అప్పాస్వామి నాయుడు తామే పది రూపాయలు సమర్పిస్తూ స్వామికి నిరాహారదీక్ష శ్రమ కలగకుండా చేశారు. విరాళాల వెల్లువ సాగగానే, పాండ్యకిరీట నిర్మాణపనులు మొదలుపెట్టారు స్వామి.ఈ కిరీటానికి అమర్చటానికి సరిపడే మరకతం అనే పచ్చరాయి కావాల్సి వచ్చి, ఎక్కడ దొరుకుతుందా అని నిర్వేదంలో పడి పోయారు వెంకటాద్రి స్వామి. ఒక రోజు రాత్రి స్వప్నంలో స్వామి దర్శన మిచ్చి పాండ్య కిరీటానికి సరిపోయే ఎమరాల్డ్ కలకత్తాలో మాధవసేట్ వద్ద ఉన్న ఇనుప బీరువాలో ఉత్తర మూల ఉన్నది అని తెలియజేశారు. వెంకటాద్రిస్వామి భక్తుడు సహాయకుడు కాశీదాస సావుకార్ కలకత్తాలోని మాధవ సేట్ కు ఉత్తరం ద్వారా విషయం తెలియజేశాడు. ఉత్తరం చదివిన మాధవసేట్, తన బీరువాలో వెదికితే ఉత్తరంలో సూచించిన చోటు లోనే పచ్చ కనపడగా మహాదాశ్చర్యపడి తన తండ్రి తనకు తన కుటుంబ సభ్యులకూ ఎవరికీ తెలియకుండా దాన్ని అలా దాచి ఉంచటం భగవల్లీల అని భావించాడు. వెంటనే ఆ మరకతాన్ని, దానితో పాటు తన విరాళంగా వెయ్యి రూపాయలను మద్రాస్ పంపాడు.

కిరీటం తయారు చేస్తున్న కంసాలి దురాశతో విలువైన ఆ మరకతం దాచేసుకొని సామాన్యరాయి అమర్చి తయారుచేశాడు. వెంకటాద్రిస్వామి కలలో శ్రీరంగడు ప్రత్యక్షమై జరిగిన తప్పు చెప్పాడు. శిష్య బృందంతో ఆ కంసాలి ఇంటికి వెళ్లి గదమాయిస్తే ముందు అంతా అబద్ధం అని బూకరించి, వెంకటాద్రి స్వామి శిష్యుడు అప్పా స్వామిరాజు వాడిని వీర బాదుడు బాదితే, తప్పయిపోయిందని లెంప లేసుకొని క్షమాపణ కోరి ఆ అసలు పచ్చ రాయిని అప్పగించాడు. నకిలీ రాయిని తీసేసి అసలు మరకతాన్ని అందులో బిగింపజేసి, శ్రీరంగానికి శిష్యులతో సహా తీసుకువెళ్ళారు.1863 రుధిరోద్గారి నామ సంవత్సర మార్గశిర శుద్ధ ఏకాదశి అంటే పరమపథ ఏకాదశి అనగా ముక్కోటి ఏకాదశి నాడు రంగరంగ వైభవంగా శ్రీరంగనాథునికి పాండ్య కిరీటం అమర్చారు.

చేయించే భక్తులు తేరగా దొరికితే, రంగడికి కొదవేముంది. మళ్ళీ వెంకటాద్రిస్వామి కలలో కనిపించి మకర కుండలాలు చేయించమని ఆజ్ఞ జారీ చేస్తే చెన్నై నగర వాసుల విరాళాలతో అలాగే చేయించి స్వామికి 1867 ప్రభవ నామ సంవత్సర నవమి నాడు సమర్పించారు. అయిదు శిఖరాలతో బంగారు విమానాన్ని నెల్లూరు శ్రీరంగనాథస్వామి పునరుద్ధరణ పనులలో చేయించి అర్పించారు శ్రీ వెంకటాద్రి స్వామి. అలాగే తిరుక్కూడాల్ మల్లై స్థల శయన పెరుమాళ్, తిరువిదా విందైతాయార్, ఆండాళ్

దేవాలయాల జీర్ణోద్ధారణ కూడా దగ్గరుండి జరిపించారు వెంకటాద్రి స్వామి.

వృద్ధాప్యం మీద పడుతుంటే శ్రీరంగంలోనే ఉండి, శ్రీరంగనాథ స్వామి సేవలో అందునా, స్వయంగా తానే సాన మీద గంధం నూరి చందనాలంకారం చేసేవారు. అతిరస, వడ సురుల మూడు, పాల మూడు ప్రసాదాలు తానే వండి స్వామికి నైవేద్యం పెట్టేవారు వెంకటాద్రి నిత్యమూ. శ్రీరంగ నాచియార్ కు అరవన ప్రసాదం చేసి నిత్య నైవేద్యం పెట్టె ఏర్పాటు కూడా వెంకటాద్రి స్వామియే చేశారు. ఈ సేవలన్నీ నిరాటంకంగా జరగటానికి స్వామికి 25.35 ఎకరాల మాగాణి, రెండు మనాల మెట్టభూమి, 5,050 రూపాయలకు తిరుప్పరై తురి గ్రామంలో కొన్నారు వెంకటాద్రి. ఆలయ ధ్వజస్తంభంపై ఈ వివరాలన్నీ చెక్కించారు. రంగ నాచియార్ కు కిరీటం చేయిస్తుండగా, గోవర్ధనం రంగాచారి అనే మహాత్ముడు వచ్చి అమ్మవారిని దర్శించగా అక్కడి అధికారులు, అర్చకులు అందరూ ఆయనను అమ్మవారి కిరీటం తయారీలో సాయం చేయమని కోరగా, సరే అని చెప్పి కొన్ని నెలలలోనే తయారు చేయించి పంపించి వెంకటాద్రి గారి కోరిక తీర్చారు. మధుర దగ్గర తిరుమలించోరి సోమచంద్ర విమానం పనులు, పాండ్య నాడు దివ్య దేశం పనులు కూడా చేశారు వెంకటాద్రిస్వామి.



72వ ఏట 1864 రక్తాక్షి నామ సంవత్సరంలో వెంకటాద్రిస్వామి సన్యాసం స్వీకరించారు. త్రిదండం, కాషాయ వస్త్రాలు ధరించి "తిరు వెంకట రామానుజ జియ్యర్" అయ్యారు. స్వామి సేవ తప్ప ఇతర వ్యాపకాలు లేకుండా జీవితాన్ని ధన్యం చేసుకొన్నారు వెంకటాద్రిస్వామి. ఈయన ప్రేమ ఆదరణ పొందిన మహా మహులలో 1866-1872లో స్వామి గొప్పతనాన్ని తెలుసుకొని సందర్శించిన మద్రాస్ గవర్నర్ లార్డ్ ఫ్రాన్సిస్ నేపియర్స్ ఉన్నాడు. గొప్పవారు వచ్చినా ఆయన ఏమాత్రమూ తన సేవ తపస్సు ధ్యానం నుంచి బయటికి వచ్చేవారు కాదు. జీవిత చరమాంకంలో శ్రీరంగంలో శ్రీరంగని సేవలో పూర్తిగా గడిపారు వెంకటాద్రి జియ్యర్ స్వామి. ఇహ జీవితం చాలించాలనే ఇచ్ఛ గాఢమవగా రంగడు కలలో కనిపించి, ఆయన సాయుజ్యానికి సమయం వగైరాలన్నీ చెప్పి అందరికీ తెలియ జేయించాడు.

1877 ధాతు నామ సంవత్సర సప్తమి సోమవారం అర్ధరాత్రి అష్టాక్షర మంత్రం జపిస్తూండగా, దివ్య జ్యోతి వెంకటాద్రి స్వామి వారి శిరస్సును చీల్చుకొని వెలువడి పరమాత్మలో కలిసిపోయింది. శ్రీరంగం దేవాలయం మహాత్మా వెంకటాద్రిస్వామి వారి పార్థివ దేహానికి విధి విధానంగా అంత్యక్రియలు నిర్వహించింది. ఈనాటికీ ఉత్సవాల సందర్భంలో రంగనాయక దంపతులకు వెంకటాద్రిస్వామి తయారు చేయించిన కిరీటాలు అలంకరించి ఊరేగింపు జరుపుతారు. స్వామివారి ప్రసాద తీర్థాలను వెంకటాద్రిస్వామి వారి బృందావనానికి ఊరేగింపుగా తీసుకొని వెళ్లి సమర్పించి మళ్ళీ ఆలయానికి చేరుస్తారు. కావేరీ నదీ తీరంలో అలవందార్ పడిత్తు రాయిలో వేంకటాద్రిస్వామి వారి స్మారక విగ్రహం ఏర్పాటు చేశారు. 1977లో శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరిపారు. నల నామ సంవత్సర మాఘ మాసం 28వ రోజు 11-3-77 వెంకటాద్రిస్వామి దివ్య తిథి నిర్వహించారు. 2006 నుంచి మద్రాస్ లో కూడా ఆరాధన ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆంధ్రదేశంలో అందునా ఉత్తర కృష్ణాజిల్లా జుజ్జూరు దగ్గర అల్లూరులో జన్మించిన అల్లూరి వెంకటాద్రి, శ్రీవెంకటాద్రి జియ్యంగార్ గా కీర్తి శిఖరాలు అందించి నిత్యం భగవత్ దర్శనంతో తరించి, స్వామి అడిగినవన్నీ తయారుచేయించి కట్టు దిట్టమైన పూజ కైంకర్య వ్యవస్థ ఏర్పాట్లు చేసిన దివ్య పురుషులు.

"అవ్వచద్దిరొట్టె యానబాలు వెన్న, యారగింతువు రంగ మేలుకో" అనే చరణంలో. 'ఆనబాలు' అంటే, నీళ్ళు ఇగిరేంత చిక్కగా కాచిన పాలు అని అర్థం. అవ్వ, చద్ది, రొట్టె అనేవి మూడు వేర్వేరు వంటకాలు. 'అవ్వ' అంటే అవ్వం అనే ప్రసాదం. 'చద్ది' అంటే చలిది అన్నం. తాలింపు పెట్టకుండా చల్ల కలిపిన అన్నం. 'రొట్టె' అంటే పెద్ద పరిమాణంలో వేసిన దిబ్బరొట్టె లాంటి ప్రసాదం. ఈ మూడింటినీ కలిపి అవ్వచద్దిరొట్టెగా ఆయన వ్యవహరించి ఉండవచ్చు.

భావకవులకు పదలాలిత్యం నేర్పిన కవి అల్లూరి వేంకటాద్రిస్వామి.

అనంతుడు, అవ్యయుడు, హృదయ పద్మములో సదా వెలసి ఉండేవాడు, స్థిరచిత్తులై ఉండే వారికి ఎల్లప్పుడూ అభయమిచ్చేవాడు అయిన శ్రీ మహావిష్ణువుని ఎవరు సదా ధ్యానం చేస్తారో, వారికి ఆ భగవదనుగ్రహం వల్ల సకలాభీష్టసిద్ధి కలుగుతుంది మరియు విష్ణు సంబంధ మనెడి పరమసిద్ధిని పొందుదురు అని అంటారు కులశేఖరులు.

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

**జన్మనిచ్చేది అమ్మ – ఆయుష్షు నిచ్చేది ఆవు**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## శ్రీ వామన పురాణాంతర్గతం

గత సంచిక తరువాయి

ఇలా చాలా సంవత్సరాలు గడిచిన తరువాత గరుత్మంతుడు బంగారు మయమైన, రత్నాలంకృతమైన వృషాద్రిని పెకలించి వైకుంఠానికి తీసుకువెళ్ళాలని అనుకున్నాడు. విష్ణుమూర్తి దానిని తెలుసుకొని చిరునవ్వుతో గరుడునితో యిలా అన్నాడు – మహాబలవంతుడవైన ఓ పక్షిరాజా! నేనొక ముఖ్యమైన విషయాన్ని చెబుతాను విను. మనమందరం ఈ పర్వతం మీదనే నివసిద్దాం. నీవు ఈ పర్వతం దక్షిణ చరియలో నిత్యం నివసించు. ఆదిశేషా! యిటు రా! నీవు గరుత్మంతుడికి క్రింది భాగంలో పర్వతరూపాన్ని ధరించి ఉండు.

నేను ఈ జగత్తును పరిపాలించుటకై, కాపాడుటకై నా ప్రీతికై కల్పాంతం వరకు ఈ పర్వతమంతా వ్యాపించి ఇక్కడే నివసిస్తూంటాను. ఈ పర్వతము ప్రతి యుగంలోను వేరు వేరు పేర్లతో ప్రసిద్ధి చెందింది. ఈ పర్వతం వరములను ప్రసాదిస్తుంది. వర ప్రదాయిని అయిన ఈ వృషాచలం వివిధములైన, శ్రేష్ఠమైన నామములను పొందింది.

తావన్నిత్యం మమప్రీత్యై శైలమాశ్రిత్య సర్వతః ।
ఆకల్పాంతం వసామీహ జగత్పాలన కారణాంత ॥
యుగేయుగే గిరిరూపం నామాని వివిధాని వై ।
గమిష్యతి వరాణ్యేవ వరదోయం వృషాచలః ॥

**- వామనపురాణం, అ.24, శ్లో.104,105**

కృతయుగంలో ఈ పర్వతం వృషాద్రి అని, త్రేతాయుగంలో గరుడాద్రియని, ద్వాపరయుగంలో శేషాద్రియని, కలియుగంలో వేంకటాద్రియని పిలువబడుతున్నది. 'వేం' అనగా అమృత బీజము, 'కట' మనగా ఐశ్వర్యం అమృతైశ్వర్యములతో కూడి ఉండుటవలన దీనికి వేంకటాద్రి అని ప్రసిద్ధి వచ్చింది.

కృత వృషాద్రిం వక్ష్యంత త్రేతాయాం గరుడాచలమ్ ।
ద్వాపరే శేషశైలం చ వేంకటాద్రిం కలౌ యుగే ॥
'వేం' కారోమృత బీజంతు కటమైశ్వర్య ముచ్యతే ।
అమృతైశ్వర్య సంఘత్వా ద్వేంకటాద్రిరితి స్మృతః ॥

**- వామనపురాణం, అ.24, శ్లో.106,107.**

ప్రతి యుగంలోను అనేకమంది మహర్షులు, మానవులు ఈ నారాయణాద్రిని అనేక పేర్లతో పిలుస్తుంటారు. ఈ విధంగా గరుడుని, శేషుని ఆదేశించి శ్రీనివాసుడు సురాసురులు చేత నమస్కరించబడుతూ స్వామి పుష్కరిణీ తీరంలో లక్ష్మీదేవితో కూడి ఎల్లప్పుడు విహరిస్తున్నాడు. ఓ గిరిజా! మనమిద్దరం కూడా ఆ పర్వతానికి వెళ్ళి సత్త్వగుణసంపన్నులమై అక్కడా నివసిస్తూ దేవసేన, పులిందులతో (వల్లీ) వృషాచలంలో విహరిస్తున్న శాశ్వతుడైన చిరంజీవియైన స్కందుని చూస్తూ ఆనందంగా

అక్కడ ఉందాం! అని శంకరుడు పార్వతీదేవితో చెప్పాడు.

## శేషాద్రిలో శివపార్వతుల నివాసము

పరమేశ్వరుడు ఈ విధంగా చెప్పి పార్వతీదేవితో పాటు వృషభవాహనా న్నధిరోహించి ప్రమథ గణాలతో పాటు స్కందుని చూడటానికై వృషభాచలానికి బయలు దేరాడు. మార్గమధ్యంలో అక్కడక్కడ పర్వత శిఖరాలపై మూడు రాత్రుళ్ళు విశ్రమిస్తూ అక్కడి దేవతలచే ఆరాధించబడుతూ ఆ వృషధ్వజుడు వృషభాద్రిలోని 'అస్థికూట' మనే సరోవరాన్ని చేరాడు. ఆ సరోవరంలో చనిపోయినవారి అస్థికలను వేస్తే వాళ్ళు పునర్జీవితులై ఆ నీటినుండి పూర్వరూపంతో బయటికి వస్తారు. అందువల్ల ఉత్తమమైన ఆ సరస్సుకు 'అస్థికూట' మనే పేరు వచ్చింది.

**మృతానామస్థికుంటాని ప్రక్షిప్తాని సరోవరే ।**
**యేషాన్తు పూర్వరూపాస్తే సముద్గచ్ఛన్తి తజ్జలాత్ ।**
**తస్మాత్ తదస్థికూటాఖ్యం ఆగచ్ఛ సర ఉత్తమమ్ ॥**

**- వామనపురాణం, అ.24, శ్లో.113,114.**

పరమేశ్వరుడు త్రిశూలపాణి అయిన మహాదేవుడు ఉమాదేవితో పాటు ఆ అస్థిసరోవర తీరంలో వృషభాన్ని దిగి ఆ పవిత్ర తీర్థంలో స్నానం చేశాడు. వృషాద్రిపతియైన లక్ష్మీనాథునకు నమస్కరించాడు. ఆ తరువాత మయూర వాహనుడైన షణ్ముఖుని చంద్రశేఖరుడు చూశాడు. ఆ తరువాత స్వామి పుష్కరిణికి వెళ్ళి, దానిలో స్నానమాచరించి శ్రీనివాసుని అనుమతితో వేంకటాచలానికి ఆగ్నేయ దిక్కున కపిల తీర్థం తీరంలో సుదర్శన చక్రముతో పూజింపబడిన కపిల మహర్షిచే ఆరాధించబడిన కపిల లింగాన్ని దర్శించాడు. ఆ సుదర్శనునికి ఎదురుగా వృషభారూఢుడై ప్రమథ గణాలతో సాక్షాత్కరించాడు.

ఆ విధంగా ప్రత్యక్షమైన పరమశివుని దర్శించి సుదర్శనుడు (చక్రం) నమస్కరించి, అంజలిబద్ధుడై నిలబడ్డాడు. అప్పుడు ఈశ్వరుడు సంప్రీతుడై 'ఓ సుదర్శనా' నీ తపస్సు చేత సంతోషించాను. నీ అభీష్టమైన వరాన్ని కోరుకో; దేవతలకు కూడా దుర్లభమైన వరం కోరినా యిస్తాను'. అని పలుకగా సుదర్శనుడు ఉమాపతియైన శంకరుడు తన యందు ప్రసన్నుడయ్యాడని తెలుసుకొని ఈ విధంగా వరం కోరాడు.

'ఓ గిరిజాపతీ! నీవు నా యందు ప్రసన్నుడవైతే నా అంతరాత్మలో నీవు నివసించు. నిత్యం నా హృదయంలో నివసిస్తూ ఆయా సమయాలను బట్టి భయంకరుడవుగాను, శాంత స్వభావుడవుగాను, వరప్రదుడవుగాను, మృత్యుంజయుడవుగాను విరాజిల్లు స్వామీ! అని ప్రార్థించాడు. అప్పుడు గిరిజాపతి అయిన పరమేశ్వరుడు సంప్రీతుడై ఉత్తమోత్తమమైన ఆ కాలచక్రంతో యిలా అన్నాడు –

'ఓ సుదర్శనమా! ఆయుధరాజమా! మహాబాహూ! నీవు చేసిన తపస్సింక చాలు. విష్ణువు యొక్క వరప్రసాదం వల్ల నాయందు నీకు చాలా ప్రీతి ఏర్పడింది. నీవు పూర్వం నా పట్టణాన్ని దహించిన విషయాన్ని నేను క్షమించాను. నేనిప్పుడు నీ స్నేహాన్ని చూస్తున్నాను. నన్ను సంతోషపెట్టు. ఇంకేమి కావాలి? నీవు చేసిన తపస్సు చాలు. మనిద్దరి మధ్య భేదభావం లేదు. ఓ పవిత్రమైన సుదర్శన చక్రమా! నీవు నన్ను నీ హృదయంలో నివసించమని అడిగావు. అది శ్రీమహావిష్ణువుకు తప్ప యితరులకు సాధ్యంకాదు. ప్రాణులందరికి జగత్ప్రభువైన శ్రీమన్నారాయణుడే అంతరాత్మ.

**'అంతరాత్మా హి సర్వేషాం ఏకో నారాయణః ప్రభుః'**

**- వామనపురాణం, అధ్యాయం 24, శ్లోకం 137.**

నీవు నాయందలి స్నేహాతిశయం వల్ల ఈ విధంగా అడిగావనుకుంటున్నాను. నేను నిన్ను చిరకాలంగా కోరుతున్నప్పటికీ త్రిపురాసుర సంహార సమయంలో నేను నిన్ను నారాయణునికి దక్షిణగా యిచ్చాను, అందుకు సందేహిస్తూ శ్రీమన్నారాయణుడు నీతో 'నీవు శివుని ప్రసన్నం చేసుకో' అని నీకు చెప్పాడు. ఇదంతా నా యోగబలం చేత నేను తెలుసుకున్నాను. నీకు అంతర్యామిగా ఉండడం నాకిష్టమే. దీనికొక ఉపాయం నాకు తోచింది. ఓ సఖుడా! నా అభిప్రాయాన్ని నీవు నిర్వర్తించు. శుద్ధసత్త్వ స్వరూపుడైన శ్రీమహావిష్ణువు యొక్క శరీరమంతా యజ్ఞమయమైనది. తమోగుణ ప్రధానుడైన నేను దానిని తాకుటకు భయపడుతున్నాను. నాకు విష్ణువు యొక్క దివ్యమంగళ శరీరంలో ఉండాలని ఉన్నది. కాబట్టి శ్రీమహావిష్ణువును ఎల్లప్పుడు వదలకుండా ఉండే నీ దేహంలో నేను ప్రవేశిస్తాను. సుదర్శనా! ఈ విధంగా చేస్తే నీ అభీష్టము. నా కోరిక నెరవేరుతుంది. నేననుకొన్నదే నీవు కోరావు. ఇది చాలా అద్భుతంగా ఉంది. మన యిరువురి కోరిక ఒకటే. కాబట్టి నీవు నేను చెప్పినట్లు చేయి.

నిత్యం జ్వాలామాలికలతో కూడి ఉండే నీవు నీ హృదయంలో నన్ను దహించు (నిలుపుకో). నీలో నేను నిత్యం నివసించుటవలన లోకంలో ప్రజలు నన్ను బంగారు కాంతి కలవాడనీ, నూరు భుజములు కలవాడనీ, ఇరవై ఎనిమిది ఆకులు కలవాడనీ, లేదా పదహారు ఆకులు కలవాడనీ, ఎనిమిది బాహువులు కలవాడనీ, చతుర్భుజుడననీ, జ్వాలల వంటి కేశములు కలవాడనీ, త్రినేత్రుడననీ, బ్రహ్మ విష్ణు శివాత్మకుడననీ నన్ను శైవక్షేత్రాలలో గానీ, వైష్ణవ క్షేత్రాలలో గానీ అనేక ఉపచారాలతో, సాంగంగా పూజిస్తాడు. స్త్రీలు గానీ, పురుషులు గానీ ఎవరైనా నన్నారాధించే వారందరు శుభాలను పొందుతారు.

ఈ విధంగా వృషభధ్వజుడైన శంకరుడు సుదర్శనునికి వరం ప్రసాదించి అదృశ్యంగా ప్రమథ గణాలతో ఆ కపిలతీర్థం ఒడ్డున నివసిస్తున్నాడు. సుదర్శనుడు కూడా వరాన్ని పొంది తన

పంచాయుధ తీర్థానికి వెళ్ళి అక్కడ అదృశ్యంగా నిత్యం తపస్సు చేస్తున్నాడు.


శతానందుడు జనకునితో 'మహారాజా! నాదరమహర్షి చెప్పిన ఈ ఉపాఖ్యానాన్ని వాల్మీకి మహర్షితో పాటు యితర మునులందరూ విని ఆనందించి వారంతా సంతృప్తులై వేంకటాచలానికి వెళ్ళారు. నేను వారి అనుమతి తీసుకొని మిథిలా నగరానికి వచ్చాను. నేను విన్నదంతా మీకు చెప్పాను. ఈ విధంగా శరీరాన్ని పులకరింపజేసే అద్భుతమైన ఈ చరిత్రను విని జనకమహారాజు సంతోషించి తన పురోహితుడైన శతానందునితో 'మహారాజా! మీరు చెప్తున్న కథ వింటుంటే నాకు తృప్తి కలగడం లేదు. కావున మరల ఆ వేంకటేశ్వరుని గురించి యింకా చెప్పండి' అని అడిగాడు. అప్పుడు శతానందుడు మిథిలాధిపతియైన జనక మహారాజుతో 'మహారాజా! సవిస్తరంగా చెబుతాను. సావధానంగా వినండి.

పూర్వం నిమి పుత్రుడైన జనక మహారాజుకు వామదేవ మహర్షి యజ్ఞం జరుగుచున్నపుడు చెప్పిన కథను నీకు చెబుతాను' అన్నాడు.

## భగవదవతార వర్ణన

పూర్వం గంగా నదీతీరంలో వ్రతం పూర్తి చేసుకొన్న అశ్వమేధ మహాయాగ దీక్షను పూనిన జనకుని వద్దకు మునులంతా విచ్చేశారు. జనక మహరాజు వారందరినీ పూజించి సంతోషంతో ఆ మహర్షులతో యిలా అన్నాడు – 'మునిశ్రేష్ఠులారా! ఈ రోజు నా జన్మ సార్థకమైనది. నేను చేసిన తపస్సు ఫలించింది. మీరందరు కలిసి మా ఈ యజ్ఞవాటికకు రావడం మాకెంతో సంతోషం' అనగా విని మునులందరు ఎంతో సంతోషడి జనకుని ఆదరానికి సంప్రీతులై ఆ యజ్ఞశాలలో ఒకరాత్రి గడిపారు.

వారందరూ ఆ రాత్రంతా పరస్పరం అనేక విషయాలు మాట్లాడు కుంటూండగా రాత్రి గడిచి తెల్లారింది. ఆ మహర్షులంతా ప్రాతఃకాల సంధ్యావందనం చేసి జనక మహారాజు ఉన్న యజ్ఞవాటికకు వచ్చారు. వారంతా శ్రీమన్నారాయణుని కథలను పరస్పరం చెప్పుకొంటూ జనకునితో పాటు అక్కడ ఆసీనులయ్యారు. అప్పుడు మహాతేజస్సంపన్నుడు, బ్రహ్మర్షి అయిన వామదేవుడు భూప్రదక్షిణం చేస్తూ అక్కడికి వచ్చాడు. వేదపారంగతు లైన ఆ మహర్షులందరూ లేచి నిలబడి నమస్కరించి బ్రాహ్మణోత్తముడైన, ఆ వామదేవునితో 'మహాత్మా! వామదేవా! మీరు ఈ భూమినంతా చుట్టి వచ్చారు. కావున మీ ద్వారా శ్రీమన్నారాయణుని పవిత్రమైన దివ్య చరితమును వినాలని కుతూహలపడుతున్నాము. జగత్ప్రభువైన ఆ శ్రీనివాసుడు ఎక్కడ వేంచేసి ఉన్నాడు? ఈ విషయం తెలుసుకోవటానికై జనక మహారాజు ఎంతో ఆతురపడుతున్నాడు. కాబట్టి మా కా



విషయాన్ని తెలియజేయవలసింది' అని అడిగాడు.

ఆ మహర్షులందరూ ఆ విధంగా అడుగగా వామదేవ మహర్షి యిలా చెప్పసాగాడు –

ఇక్కడికి దక్షిణ దిక్కున రెండు వందల యోజనముల దూరంలో నారాయణ పర్వతమనే శ్రేష్ఠమైన పర్వతరాజమున్నది. దాని మీద దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు ఆహార నియమంతో నివసిస్తున్నారు. నేను కూడా ఆ వేంకటాచలానికి వెళ్ళాను. అక్కడ అగస్త్యుడు, నారదుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, ఆంగిరసుడు, దకక్షుడు, జాబాలి మొదలైన మాననీయ మహర్షులందరూ యోగాభ్యాస పరాయణులై తపస్సు చేస్తున్నారు. నేను వారిని దర్శించి వారితో 'ఓ మహాత్ములారా! మీరందరూ కలసి ఇక్కడ ఈ పర్వతం మీద ఎందుకు సమావేశమయ్యారు?' అని అడుగగా వారంతా నాకేమీ సమాధానం చెప్పలేదు. మౌనంగా ఉన్నారు.

అప్పుడు మహాత్ముడైన అగస్త్య మహర్షి నన్ను పిలిచి యిలా అన్నాడు– 'మేమిక్కడ ఉండటానికి కారణం చెబుతాను విను. యోగులలో శ్రేష్ఠుడైన నారదమహర్షి భగవంతుణ్ణి ఉపాసిస్తూ గోదావరీ తీరంలో కొన్నాళ్ళు ఉన్నాడు. కాని ఆయనకు శ్రీపతి దర్శనం కాలేదు. ఆయన పరలోకమైన వైకుంఠంలో ఆయన కనపడలేదు. దానితో నారదముని ఆందోళన చెంది సనాతనుడైన బ్రహ్మదేవుని వద్దకు వెళ్ళి 'పితామహా! సకల జీవులకు పరమాత్మయైన సనాతనుడైన పరదేవతయైన శ్రీమన్నారాయణుడు ఎక్కడికి వెళ్ళాడో చెప్పండి' అని అడిగాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు కొంతసేపు ధ్యానం చేసి అంజలిబద్ధుడై నిలిచిన నారదునితో యిలా అన్నాడు. 'ఓ మహామునీ! భూలోకంలో నారాయణగిరి అనే పర్వతమున్నది. దానిమీద

పురుషోత్తముడైన శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవితో క్రీడిస్తున్నాడు. ఆయనకు ఆ పర్వతంపై ఉండాలని, విహరించాలని చాలా ప్రీతి కలిగిం ది. కాబట్టి నారదా! నీవా సర్వేశ్వరుడైన జగత్ప్రభువును చూడాలనుకుంటే వేంకటాచలానికి వెళ్ళు'.

బ్రహ్మదేవుడు ఈ విధంగా ఆదేశించగా మునిశ్రేష్ఠుడైన నారదుడు అక్కడి నుండి బయలుదేరి వేంకటాచలానికి వస్తున్నాడు. దారిలో మేమందరమూ ఆయనతో కలిశాం. మేమంతా కలిసి వేంకటాచలాన్ని చేరాం. ఆ తరువాత చతుర్ముఖ బ్రహ్మ దేవతలతో కూడా అక్కడకు వచ్చాడు. బ్రహ్మదేవుడు మా అందరితో కలిసి ఆ మహత్తర పర్వతం మీద అవ్యయుడు, నాశరహితుడు అయిన పరమాత్మను వెదుకుతూ సంచరించాడు. కాని ఆ పురుషోత్తముడు కనపడలేదు.

అప్పుడు బ్రహ్మదేవుడు నారదునితోను, మహర్షులమైన మాతోను యిలా అన్నాడు – 'మహామునులారా! ఈ పర్వతం మీద ఎన్ని నదులున్నవో ఎన్ని సరస్సులున్నవో శుభప్రదములైన మహాపుణ్య ప్రదములైన పవిత్ర జలములు కల పుష్కరిణులు ఎన్ని ఉన్నవో, చెరువులెన్ని ఉన్నవో, అలాగే బావులు, సెలయేళ్ళు, దిగుడు బావులు, మునులు సేవించే పవిత్ర మడుగులు మొదలైనవి ఈ పావనమైన పర్వతంమీద ఎన్నున్నాయో వాటన్నిటిని మీరు సేవిస్తూ ఈ పర్వతమంతా సంచరిస్తూ ఈ పర్వతానికి మీరంతా ప్రదక్షిణం చేయండి. శ్రీహరి మాకు దర్శనమిచ్చేంతవరకు ఎంతకాలమైనా సరే మీరీ పర్వతముపైనే విహరించండి' అని చెప్పి లోకపితామహుడైన బ్రహ్మదేవుడు తన అనుచరులు, దేవతలతో పాటు అక్కడే అదృశ్యమయ్యాడు.

'ఓ జనక మహారాజా! అప్పుడు అగస్త్య మహర్షి యితర మునులతో పాటు అనాది అయిన ఆ పరబ్రహ్మకు నమస్కరించి పరబ్రహ్మస్వరూపుడైన వాసుదేవుని గురించి చింతిస్తూ వృషభాద్రి వాసుడైన ఆ దేవదేవుని దర్శించగోరుతూ ఆ పర్వతానికి పశ్చిమ దిక్కుదాటి అక్కడ తపస్సు చేస్తూ దేవదేవుడైన శ్రీహరిని స్మరిస్తూ బ్రహ్మదేవుని పలుకులను గుర్తుచేసుకుంటూ ఉన్నాడు. అక్కడక్కడ తపస్సుతో పవిత్రులైన ఋషులతోను సూర్యసమాన తేజస్సుతో జడలను ధరించిన మునులతోను కలిసి ఆ పర్వతం మీద సంచరిస్తూ వాయువ్య దిక్కులో ఒక గొప్ప అద్భుతాన్ని దర్శించాడు.

శుద్ధస్ఫటికమువలె తెల్లని పాలరాతివలె నున్న ఒక పెద్ద రాయి కనబడింది. అది చూడటానికి ఎంతో అందంగా నున్నగా, విశాలంగా, శుభ్రంగా ఉంది. ఆ రాతిపై ఒక ఆజానుబాహుడు, పర్వతాకారుడు దివ్యతేజస్సుతో ప్రకాశిస్తూ ఉన్నాడు. అతని నేత్రాలు విశాలంగా ఉన్నాయి. భయంకరమైన కోరలు, పెద్ద దవడలు, విశాలమైన వక్షఃస్థలం, గొప్ప భుజాలు కలిగి ఉన్నాడు. ఆయన ఎర్రని వస్త్రాలు ధరించి ఎర్రని చందనం పూసుకున్నాడు. చంద్రునివలె ప్రకాశిస్తున్న దివ్యమైన రత్నకుండలాలు ధరించాడు. ఎర్రగా మెరుస్తున్న ఆభరణం ధరించాడు. అనేక రత్నఖచితాలైన దివ్యాభరణాలతో విరాజిల్లుతున్నాడు. నానా వివిధ రత్నాలతో శోభాయమానమైన కిరీటాన్ని ధరించాడు. మహా భుజపరాక్రమాలు గల ఆ మహాకాయుడు, మహావీరుడు, శ్యామల వర్ణంలో ఉన్నాడు.

అగస్త్యమహర్షి ఆశ్చర్యచకితుడై ఆయనను మరల మరల తేరిపార చూశాడు. ఆ తరువాత ఆ మహర్షి సత్తముడు సూర్యతేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ దివ్యపురుషునికి (దేవునికి) నమస్కరించి 'మహాత్మా! ప్రియదర్శనా! మహావీరా! నీవెవరు? ఎవరి పుత్రుడవు? ఎవరి వాడవు?మాకు నీ వృత్తాంతాన్ని యథార్థంగా చెప్పు. అబద్ధమాడవద్దు' అని వినేవారికి, ప్రీతి కలుగునట్లుగా మధురమైన వాక్కులతో స్తుతిస్తూ తనను ప్రశ్నించిన మహాతేజశ్శాలియైన అగస్త్య మహర్షితో ఆ మహాపురుషుడు ఏమీ మాట్లాడలేదు. ఆయన అగస్త్య మహర్షిని మరల మరల చూశాడు. ఆ మహాత్ములైన మహర్షులందరూ చూస్తుండగానే మహాతేజశ్శాలియైన ఆ పురుషుడు అంతర్ధానం చెందాడు. అది వారికి మహాశ్చర్యం కలిగించింది. అప్పుడు ఆ మునులందరూ ఆశ్చర్యంతో విప్పారిన నేత్రాలు కలవారై' ఆహా! ఏమి ఆశ్చర్యం! ఏమి అద్భుతం? మనం ఎటువంటి మహాద్భుత దృశ్యాన్ని చూశాము? సూర్యునివంటి కాంతి కల మహాశ్చర్యకరమైన తన దివ్యరూపాన్ని మనకు దర్శింపజేసి ఆ మహాపురుషుడు తన మాయతో మనలను మోహింపజేసి వెంటనే అదృశ్యమయ్యాడు! అని ఆ మునులందరు అనుకుంటూ అద్భుత తేజశ్శాలియైన ఆ దివ్యపురుషునికి, దేవదేవునికి నమస్కరించి ఆ పర్వతంపై సంచరించసాగారు.


అగస్త్యమహర్షి దేవదేవుడు, సర్వాంతర్యామి, సర్వజీవ హృదయవాసి అయిన ఆ భగవంతుని దర్శించగోరినవాడై మునులందరితో కూడి నారాయణాద్రి యొక్క విశాలము. నిర్మలమునైన పశ్చిమ దిక్కును వదలి ఆ మహర్షి సత్తముడు, బ్రాహ్మణోత్తముడు, మహాత్ముడు ఆ పర్వతం ఉత్తర దిక్కునకు చేరాడు.

## భగవదన్వేషణ

మహాతేజశ్శాలియైన అగస్త్యమహర్షి మునులందరితో కూడి ఆ వేంకటాచలంపై సంచరిస్తూ ఆ పర్వతం ఉత్తరభాగంలో ఆశ్చర్యకరమైన అద్భుతమైన దృశ్యాన్ని చూశాడు. అక్కడ నేరేడు వృక్షాల పెద్ద పెద్ద కొమ్మలు వ్రేలాడుతున్నాయి. ఆ వృక్షాలు తెల్లగా ఉన్నాయి. అక్కడి చెట్లు, లతలు, పండ్లు, తెల్లని పూలతో శోభిస్తున్నాయి. నిర్మలమైన నీటితో కూడిన పవిత్రమైన సరస్సులు, పుణ్యప్రదములు, సర్వపాప హరములు. దర్శన

మాత్రం చేతనే శుభాన్ని కలిగించే పుణ్యనదులలో అగస్త్యమహర్షి ఇతర మునులందరితో పాటు శౌచవిధులను నిర్వర్తించి యథావిధిగా శ్రద్ధతో నిర్మలమైన మనస్సుతో వాసుదేవుడైన శ్రీమన్నారాయణుని, శ్రీ హరిని మనస్సులో ధ్యానిస్తూ స్నానం చేశాడు.

ఆ తరువాత సంధ్యాది అనుష్ఠానములనన్నింటిని పూర్తిచేసి జగత్ప్రభువైన ఆ కేశవుణ్ణి నిశ్చల చిత్తంతో ఆరాధించాడు. ఆ దేవదేవుని దర్శించుటకై మునులతో పాటు బయలుదేరాడు. ఆ పర్వతమంతా సంచరిస్తూ ఆ గిరికి ఉత్తర దిక్కున నానావిధములైన వృక్షములతో శోభిస్తున్న పర్వతాకారములైన మేఘములతో కూడిన, చూచుటకు సుందరమైన దృశ్యాన్ని



చూశాడు. మృగాలు, సర్పాలు, కొండచిలువలు, మహానాగులు, పక్షులతో నిండి అనేక పూలతీగలతో అల్లుకుపోయి ఆ ప్రదేశం సుందరంగా ఉంది.

అక్కడ చల్లని వాయువు సుఖంగా వీస్తున్నది. అక్కడ తటాకాల్లోని నీరు చల్లగా ఉంది. భ్రమరాలు (తుమ్మెదలు) ఝుంకారం చేస్తూ పూలలోని మధువును ఆస్వాదిస్తున్నాయి. ఆ కొండగుహల నుండి బయటకు వచ్చిన కోకిలలు మధురంగా గానం చేస్తున్నాయి. గంధర్వులు సుస్వరంగా పాడుతున్నారు. నెమళ్ళు పెద్దగా పురివిప్పి నాట్యం చేస్తున్నాయి. రావి, జువ్వి, మారేడు వృక్షాలు అనేక శాఖలతో శోభిస్తున్నాయి. తిలక (బొట్టును) వృక్షాలు, ఱేలచెట్లు, పులిగోరు చెట్లు, కొండగోగు వృక్షాలు,పాటలి వృక్షాలు నిండుగాపూసి పూలతోశోభిస్తున్నాయి.

ఊడుగు చెట్లు చిత్రవిచిత్రాలైన శాఖలతో విలసిల్లుతున్నాయి. మాదీఫల వృక్షాలు, దిరిశెన వృక్షాలు, శింశుపాల (ఇరుగుడు), గిరకతాడి, పనస వృక్షాలతోను, నెమ్మిచెట్లు, గానుగ, తినాస, చందన, పొగడ, ఎఱ్రచందనం వృక్షాలతోను నిండి ఉన్నది ఆ ప్రదేశం. ఈ విధంగా అనేక వృక్షాలతో, అనేక శాఖలతో శోభిస్తూ, పరిమళమైన సువాసనలు వెదజల్లుతూ అనేక గైరికాది ధాతువులతో సమ్మిళితమై మణులతో ప్రకాశిస్తున్న ఆ పర్వతోత్తర భాగాన్ని ధీమంతుడైన అగస్త్యమహర్షి మునులందరితో కూడి దర్శించాడు.

ఆ తరువాత 'ఆ మహర్షి మునులతో పాటు ఆ పర్వతంపై సంచరిస్తూ పద్మాలతో నిండిన అద్భుతమైన పుష్కరిణిని చూశాడు. దానిలో కలువలు వికసించి ఉన్నాయి. పద్మాలు బాగా వికసించి కమ్మని సుగంధ పరిమళాన్ని వెదజల్లుతున్నాయి. ఆ పుష్కరిణిలోని నీరు సుగంధయుక్తమై ప్రసన్నంగా నిర్మలంగా పవిత్రంగా ఉంది. చంద్రకాంత మణులవలె ఉన్న రాజహంసలు ఆ సరోవరంలో విహరిస్తున్నాయి. ఆ పరిసరాల్లో సింహాలు, పెద్ద పులులు, జింకలు సంచరిస్తున్నాయి. నీటికోసం వచ్చిన తెల్లని దంతాలు గల ఏనుగులు ఘీంకరిస్తున్నాయి. క్రౌంచ పక్షులు, వానరాలు, వరాహములు మొదలగు పక్షి జంతు సమూహంతో ఆ ప్రాంతం శోభాయమానంగా ఉంది.


అక్కడి పక్షులు మధురంగా ధ్వని చేస్తున్నాయి. దేవతలు, గంధర్వులు, విద్యాధరులు మొదలగు దేవతాగణాలు ఆ పుష్కరిణిని సేవిస్తున్నారు. సకల దుఃఖములను పోగొట్టే అత్యద్భుతమైన ఆ పుష్కరిణిని చూసి అగస్త్య మహర్షి ఆశ్చర్యచకితుడై ఆ మునులతో మనమీ సరస్సులో స్నానంచేసి ఈ పర్వతం తూర్పు దిక్కునకు వెళదాం. ఈ పవిత్ర సరస్సు పాపాలను పోగొట్టి శుభాలను కలిగిస్తుందని లోకంలో ప్రసిద్ధి. ఈ పవిత్రమైన, పుణ్యప్రదమైన, నిర్మలమైన, పరిశుద్ధమైన, సర్వపాపహరమైన పద్మాలతో నిండిన పుష్కరిణి సర్వదుఃఖములను పోగొడుతుంది. సర్వతీర్థముల ఫలమును ప్రసాదిస్తుంది.

**(సశేషం)**

# తిరుమల సర్వస్వం

ధారావాహికం

– పల్లపోతు వాణిశ్రీ



గత సంచిక తరువాయి

## తరిగొండ వెంగమాంబ

తిరుమలేశుడు ప్రతిరాత్రి ఏకాంతసేవ తరువాత, ఓ భక్తురాలి ఇంటికి వెళ్ళి ఆమె భక్తి పారవశ్యంతో తనను కీర్తిస్తుంటే, తాను నాట్యం చేస్తుండేవాడు. ఆమె చెప్పే ముచ్చట్లు ఆసక్తిగా వింటుండేవాడు. ఆమెకు అవమానం జరిగితే, తనకు జరిగినట్లుగానే భావించేవాడు. ఈ లీలలన్నీ పూర్వ యుగాల నాటివో, వేల ఏళ్ళ నాటివో కాదు. కేవలం రెండు వందల యాభై ఏళ్ళ క్రితం జరిగిన యథార్థ సంఘటనలు.

ఆ మహాభక్తురాలే పరమపూజ్యురాలైన తరిగొండ వేంగమాంబ గారు. మహా మహిమాన్వితురాలు. వెంగమాంబ ప్రస్తావన లేకపోతే శ్రీనివాసుని ఐతిహ్యం అసంపూర్తిగానే మిగిలిపోతుందంటే అతిశయోక్తి కాదు.


### వెంగమాంబ బాల్యం

తిరుపతి నుండి మదనపల్లె వెళ్ళే మార్గంలో నేడు ''వాయల్పాడు''గా పిలువబడే ''వాల్మీకపురం'' అనే పట్టణానికి నాలుగు మైళ్ళ దూరంలో తరిగొండ అనే గ్రామం నేటికీ ఉంది. ఆ గ్రామంలో కానాల కృష్ణయ్య–మంగమ్మ అనే దంపతులకు ఐదుగురు కొడుకుల తర్వాత శ్రీనివాసుని కటాక్షంతో జన్మించిన ఆడపిల్లకు ఆమె తల్లితండ్రులు ''వెంకమ్మ'' అని స్వామివారి పేరే పెట్టారు. ఆమె అతి చిన్నతనం నుండి భజనలు, ఉపవాసాలతో గంటలకొద్దీ ధ్యానంలో మునిగి ఉండడంతో తల్లితండ్రులు మొదట్లో ముచ్చట పడ్డారు. అయితే రోజులు గడిచే కొద్దీ పెళ్ళి కావలసిన పిల్ల ఇలా పనిపాటలు మానేసి ఎడతెరిపి లేకుండా పూజా పునస్కారాలలో మునిగి ఉండడం వారికి ఆందోళన కలిగించింది. ఆ చింతతోనే వెంకమ్మకు పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించారు. వెంకమ్మ మాత్రం ''వేంకటేశ్వరుడే నా భర్త, నాకు వివాహ ప్రయత్నాలు విరమించండి'' అని వేడుకుంటూ ఉండేది. ఆమె మొరను పెడచెవిన పెట్టిన తల్లితండ్రులు సమీప గ్రామానికి చెందిన వెంకటాచలపతి అనే యువకుడితో ఆమెకు అతి చిన్నతనంలోనే బలవంతంగా వివాహం జరిపించారు. కానీ వేంకటేశ్వరుని తలంపు వేరే విధంగా ఉండడంతో, వెంకమ్మ కాపురానికి వెళ్ళకముందే భర్త మరణించాడు. ఇవేమీ పట్టించుకోని వెంకమ్మ మాత్రం శ్రీనివాసుణ్ణే తన భర్తగా తలుస్తూ, కొలుస్తూ, పసుపు కుంకుమలు సింగారించుకుని, సమీపంలోనే ఉన్న ఆలయంలోని ఆంజనేయస్వామికి, నారసింహునికి హారతులిచ్చేది. తరిగొండ గ్రామంలో ఈ ఆలయాన్ని నేడూ చూసి తరించవచ్చు.

### వెంగమాంబగా మారిన వెంకమ్మ

కూతురి వ్యవహారంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో తండ్రి కృష్ణయ్య, వెంకమ్మకు మదనపల్లి వాస్తవ్యులైన

సుబ్రహ్మణ్యశాస్త్రి అనే ఆధ్యాత్మిక వేత్తతో ఉపదేశం చేయించాడు. అసలే మహాభక్తురాలైన వెంకమ్మ, ఆ ఉపదేశ మహిమతో మహా తపస్వినిగా మారిపోయింది. ఆమె నోటినుండి వేంకటేశ్వరుణ్ణి కీర్తిస్తూ అనేక శ్లోకాలు, శతకాలు ఆశువుగా వెలువడుతూ ఉండేవి. ఇరుగు పొరుగు వారందరూ అప్పటినుండి ఆమెను ఒక మహా యోగినిగా భావించి వెంగమాంబ అంటూ గౌరవ మర్యాదలతో సంబోధించేవారు.



### పీఠాధిపతుల ఆగమనం

అయితే, వితంతువులను చిన్నచూపు చూసే ఆ రోజుల్లో భర్తను కోల్పోయిన ఓ మహిళ, సౌభాగ్యవతి వలె ఆలయాన్ని సందర్శించడం కొందరు సాంప్రదాయ వాదులకు కంటగింపైంది. ఆమెను ఎలాగైనా ఇంటికే పరిమితం చేయాలని భావించారు. అదే సమయంలో తన ఆధ్యాత్మిక పర్యటనలలో భాగంగా ఆ గ్రామానికి వేంచేసిన పుష్పగిరి పీఠాధిపతుల వారికి, గిట్టనివారు కొందరు వెంగమాంబ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. ఆ విషయాన్ని స్వాములవారు వెంగమాంబతో ప్రస్తావించగా, ఆమె తన భర్త వేంకటనాథుడని, ఆయనకు మరణం లేదని, తాను నిత్య సౌభాగ్యవతినని ఖరాఖండిగా సమాధానమిచ్చింది. ఆమె మాటలకు అవాక్కయిన పీఠాధిపతుల వారు ఆమెను ఏమార్చాలనే ఉద్దేశ్యంతో, తానో పీఠానికి అధిపతిననీ, తనకు నమస్కరించాలని తెలియదా? అంటూ వెంగమాంబను ప్రశ్నించారు. అంతట వెంగమాంబ ''స్వామీ! నేను నమస్కరిస్తాను, ఒక్కసారి తాము ఆసీనులై ఉన్న పీఠం మీద నుండి లేవండి'' అని ప్రార్థించడంతో పీఠం మీదనుండి పైకి లేచారు. ఆమె నమస్కరించగానే, హఠాత్తుగా పీఠం అగ్నికి ఆహుతైపోయి, పీఠాధిపతుల వారికి తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. అచ్చెరువొందిన స్వామివారు, ఆమె మహా తపస్సంపన్నురాలనీ, దైవకృప సంపూర్ణంగా కలిగిన మహిళామూర్తి అనీ, ఆమె ఆలయంలోకి ప్రవేశించడానికి ఏవిధమైన అభ్యంతరం పెట్టవద్దని గ్రామస్తులకు నచ్చచెప్పారు. ఆ ఉదంతంతో వెంగమాంబ మరింత ప్రసిద్ధురాలైంది.

### తిరుమలకు పయనం

అయినా కొందరు ఆమెనూ, ఆమె కుటుంబాన్నీ ఇంకా వేధిస్తూనే ఉన్నారు. ఇవేమీ పట్టించుకోని వెంగమాంబ ఆ ఊళ్ళోనే ఉన్న నృసింహస్వామినీ, ఆంజనేయుణ్ణీ పూజించడం కొనసాగించింది. ఒకనాడు ఆ దేవాలయంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ధ్యానం చేసుకుంటున్న వెంగమాంబను కొందరు ఛాందసవాదులు ''ఏ క్షేత్రానికో వెళ్ళి తపస్సు చేసుకోకుండా, ఈ గుళ్ళో ఎందుకు దాపురించావు?'' అని దూషిస్తూ, ఆమెను జుట్టు పట్టుకుని ఆలయం నుండి బరబరా బయటికి ఈడ్చివేశారు. వారి మాటలను భగవత్సంకల్పంగా భావించిన వెంగమాంబ వేరే ఆలోచన లేకుండా, అరణ్యమార్గం పట్టి హుటాహుటిన తిరుమల క్షేత్రం చేరుకుంది.

### క్షేత్ర సందర్శన

తిరుమల క్షేత్రాన్ని తొలిసారిగా సందర్శించుకొన్నప్పుడు, ఆనందపారవశ్యంలో అలవోకగా ఆమె నోటినుండి జాలువారిన ముత్యాల మూటలు "శ్రీవేంకటాచల మాహాత్మ్యం"లో ఈ విధంగా పొందుపరచబడి ఉన్నాయి.

**ఘన గోపురములు ప్రాకార మంటపములు**
**తేరులు, సత్పుణ్యతీర్థములును**
**ముద్దుగా బల్కు శుక, పికములును నీలి**
**కంఠములును తులసికాదళ సుమములు**
**క్రిక్కిరిసి యుండు వేంకటగిరి పురమున**

కొద్ది మార్పులు, చేర్పులతో తిరుమల క్షేత్రం నేటికీ అదేవిధమైన ముగ్ధమనోహర ప్రాకృతిక సౌందర్యంతో భక్తజనులను అలరిస్తోంది.

### వెంగమాంబకు విలువనీడ

వెంగమాంబ ప్రతిరోజూ శ్రీనివాసుణ్ణి దర్శించి, సేవించి, ఆశువుగా వచ్చే పద్యాలతో, శతకాలతో భక్తి పరవశురాలై వేంకటేశుణ్ణి స్తుతించేది. ఆమె భక్తికి ఎందరో తన్మయులయ్యేవారు. ఆమెను ఎంతగానో కొనియాడేవారే తప్ప, నిలువనీడ లేక గుడిలోనే తల దాచుకుంటున్న ఆమె దీనావస్థను మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. తనకో నీడ కల్పించమని ఆనందనిలయుణ్ణీ, ఆయనకు సిఫారసు చేయమని అమ్మవారినీ ఆమె పరిపరి విధాలా వేడ్కొనగా ఎట్టకేలకు శ్రీనివాసుడు కరుణించాడు. స్వామివారి ప్రేరణతో, వారి ఆంతరంగిక భక్తుడైన హాథీరాం బావాజీ వారి శిష్యులు, మహంతు మఠానికి ఆనాటి అధిపతి అయిన ఆత్మారాందాసు సుమారు 1750వ సంవత్సరంలో వెంగమాంబకు తగిన నివాసాన్ని ఏర్పరచడానికి సంకల్పించారు (హాథీరాం బావాజీ గురించి, దేవాలయ పరిపాలనా కార్యకలాపాలను సుదీర్ఘకాలం నిర్వహించిన మహంతు మఠం గూర్చి మరో ప్రకరణంలో వివరించబడింది).

భగవత్ప్రేరణతో ఆత్మారాందాసు గారు శ్రీవారి మందిరానికి తూర్పు మాడవీధి చివరన, ఈశాన్యమూలలో శ్రీవారి రాతిరథానికి ప్రక్కగా ఓ పూరి గుడిసెను నిర్మించి, వెంగమాంబ వద్దకు వెళ్ళి ఆ గుడిసెను ఆమె నివాస నిమిత్తం స్వీకరించాల్సిందిగా అర్థించాడు. అంతేకాకుండా "వకుళమాత" పేరుతో ఒక పడి బియ్యాన్నీ, ఇతర వంట వస్తువులనూ వెంగమాంబ నివాసానికి నిత్యం పంపేటట్లుగా తీర్మానించాడు. మహంతు ఏర్పాటు చేసిన కట్టడి ననుసరించి ఆలయాధికారులు వెంగమాంబకు కావలసిన సంభారాల్ని ఆలయ ఉగ్రాణం (సరుకుల గిడ్డంగి) నుంచి వెంగమాంబ ఇంటికి పంపేవారు.

### స్వామివారికి తులసి కైంకర్యం

ఇలా ఆవాసం మరియు ఆహారం విషయంలో నిశ్చింత అయిన వెంగమాంబకు, కళ్ళు తెరిచినా, మూసినా ఆ సప్తగిరీశుడే సాక్షాత్కరించేవాడు. శ్రీనివాసుడు ఆమె పాటకు పాదం కలుపుతూ, ఆమె ముచ్చట్లను మైమరచి వినేవాడు. భక్తి పారవశ్యంలో ఆసాంతం మునిగిన వెంగమాంబ అలంకారప్రియుడైన శ్రీనివాసునికి ప్రతిరోజూ పూమాలలు సమర్పించాలనీ, ప్రతి సాయంత్రం చివరగా కర్పూరహారతితో నీరాజనం సమర్పించాలని కలలు కనేది. అంతేకాకుండా తులసిప్రియుడైన తిరుమలేశుని కోసం తన కుటీరం వెనుక తులసివనాన్ని ఏర్పాటు చేయదలచి, ఒక దిగుడుబావిని త్రవ్వించింది. బావి అడుగున ఒక పెద్ద బండరాయి తగలగా వెంగమాంబ గంగమ్మను ప్రార్థించడంతో, బండ చిట్లి జలధార వెల్లువలా ఉబికి వచ్చింది. ఆ వనం నుండి ప్రతిరోజూ తులసిదళాలు తెచ్చి మాలలు కట్టి శ్రీవారికి కైంకర్యం చేసేది.

ఆనాడు వెంగమాంబ త్రవ్వించిన దిగుడుబావిని పాపవినాశనానికి వెళ్ళే దారిలో, ఏనుగుశాల వద్ద "అమ్మోరిబావి" అనే పేరుతో నేడూ చూడవచ్చు. అందులోని నీళ్ళను ఈనాడు కూడా తి.తి.దే వారు తోటను పెంచడానికి ఉపయోగిస్తున్నారు.

ఇలా వెంగమాంబ సమర్పించిన తులసిమాలలతోనూ, కర్పూరనీరాజనంతోనూ స్వామివారు మరింత అందంగా, వింత వింత కాంతులు విరాజిల్లుతూ ఉండేవారు.

వెంగమాంబ మరో ధ్యాస లేకుండా స్వామివారి మీద కవితలల్లుతూ, పాటలు పాడుతూ, శ్రీవారి సేవ చేసుకుంటూ కాలం గడిపేది. శ్రీవారికి అంకితభావంతో ఆమె చేసే సపర్యల వల్ల యాత్రికులకూ, తిరుమలవాసులకూ, శ్రీవారి కైంకర్యపరులకూ వెంగమాంబ పట్ల అపరిమితమైన గౌరవాభిమానాలు కలిగాయి. ఆమెను సాక్షాత్తూ భగవదంశగా తలచి, ఆమె ఆశీస్సుల కోసం తహ తహ లాడుతుండేవారు.

### తాళ్ళపాక వారి ప్రాపకం

ఆ సమయంలో స్వామివారి మరొక పరమ భక్తుడైన తాళ్ళపాక అన్నమయ్య (ఈ భక్తుని గురించి వేరే ప్రకరణంలో వివరించబడింది) వంశీయులు వెంగమాంబ భక్తి తత్పరత గురించి, ఆమె మహిమల గూర్చి విన్నారు. ఆమె కూడా తమ బ్రాహ్మణ శాఖకి చెందినదేనని తెలుసుకుని ఉత్తర మాడ వీధిలో, శ్రీవరాహస్వామి ఆలయానికి ఎదురుగా తాము నివాసముంటున్న ఇంటిలో కొంత భాగాన్ని ఆమె నివాసార్థం ఉచితంగా ఇచ్చారు. వెంగమాంబ శ్రీనివాసునికి మరొక్కసారి కృతజ్ఞతలు ప్రకటించుకుని తాను ఉంటున్న పూరింటిని వదలి తాళ్ళపాక వారింటికి చేరింది. ఆ ఇంటి వెనుక కూడా తులసి వనాన్ని పెంచుతూ శ్రీవారికి కైంకర్యం నిర్వహిస్తూ ఉండేది.

### అక్కరాము దీక్షితుల అక్కసు

ఆ రోజుల్లో వంశపారంపర్యంగా ఉండే అర్చకులు

మాత్ర మే కాకుండా, ప్రభుత్వం తరఫున కూడా అర్చకులు నియమింపబడేవారు. అక్కరామ దీక్షితులు అనే శ్రీవారి సర్కారు అర్చకుడు వెంగమాంబ ఇంటి ప్రక్కనే మందీ మార్బలంతో నివసించేవాడు. హోదా, సంపద, పరివార జనం కారణంగా, ఆయనకు గర్వమూ, అహంకారమూ తలకెక్కాయి. పైగా శ్రీవారిని స్పృశించి, వారికి సేవలు చేయగలిగే భాగ్యం కలిగిన తాను సాక్షాత్తూ భగవత్సంభూతుడే అనే అహంభావం ఆయన మదిలో మెదిలేది. అందరూ ఆయనకు వంగి వంగి నమస్కరిస్తూ ఉంటే, శ్రీవారినే సమస్తంగా భావించే వెంగమాంబ మాత్రం తన పనిలో తాను నిమగ్నమై ఉండేది. అది అక్కరామ దీక్షితులకు కంటగింపుగా తయారైంది. సౌభాగ్యం కోల్పోయిన స్త్రీ రోజూ వచ్చి హారతి ఇవ్వడం ఏమిటని ఆయనకు అక్కసుగా కూడా ఉండేది. వేద వేదాంగ పారాయణుడు తానుండగా, తన ఎదుటే ఒక వితంతువు సత్కారాలు పొందటం ఏమిటి? అని ఈర్ష్యతో రగిలిపోయేవాడు. పుండు మీద కారం అద్దినట్లు తాళ్ళపాక వారామెను చేరదీసి, వారి ఇంట్లో ఆశ్రయం ఇవ్వడం వల్ల అతని అంతరంగం ఇంకా క్రోధపూరితమైంది. ఉద్యోగరీత్యా నిత్యం శ్రీవారి సమక్షంలో ఉన్నప్పటికీ, అరిషడ్వర్గాలపై ఆధిపత్యం సాధించనట్టి ఆ అర్చకుడు స్వామి తోడిదే లోకంగా జీవిస్తున్న వెంగమాంబను నోటికి వచ్చినట్లు దూషించేవాడు. అయినప్పటికీ అలౌకికమైన ఆధ్యాత్మిక జగత్తులో తాదాత్మ్యమై ఉన్న వెంగమాంబ పన్నెత్తు మాట కూడా అనకపోవడంతో, ఆమె సహనాన్ని అలుసుగా తీసుకున్న అర్చకుని ఆగడాలు అంతకంతకూ మితిమీరి పోయాయి. ఆయన బుద్ధి మరింత వక్రించి, ఆమె పెంచుతున్న తులసివనంలో ఎంగిలి విస్తళ్ళు వేయించేవాడు. అసూయా ద్వేషాలు మనుషుల్ని ఎంతకైనా దిగజారుస్తాయి కదా.

### శ్రీవారి క్రోధాగ్ని

ఎంగిలి విస్తళ్ళ వల్ల శ్రీవారికి చెందవలసిన తులసిదళాలు అపవిత్రం కాకుండా నొచ్చుకున్న వెంగమాంబ, ఒకటి రెండుసార్లు అర్చకుణ్ణి మృదువుగా వారించింది. అయినా ఆయన వంకరబుద్ధి మారలేదు.

ఒకనాడామె పెరటిలో కూర్చుని ఆనందనిలయ శిఖరాన్ని తదేకంగా చూస్తూ, ధ్యానమగ్నురాలై ఉండగా, అపరాహ్ణ సమయంలో, పక్కింటిలోని అర్చకుడూ అతని పరివార గణం మధ్యాహ్న భోజనాలు ముగించుకుని యథాప్రకారం ఎంగిలి విస్తళ్ళు విసిరారు. అవి తులసివనంలోనూ వెంగమాంబ మీదా పడ్డాయి. ఇన్నాళ్ళూ తనకు అర్పితమైన తులసిదళాలు పెరుగుతూ ఉన్న వనంలో ఎంగిలి విస్తళ్ళు పడేస్తున్నా పట్టించుకోని శ్రీనివాసుడు ఆరోజు ఎంగిలాకులు తన భక్తురాలైన వెంగమాంబ మీద పడడంతో, అది ఆమెకు – తద్వారా తనకు – తీరని అవమానంగా భావించి అగ్రహోదగ్రుడయ్యాడు. ఆశ్రిత పక్షపాతి అయిన శ్రీనివాసుడు తనకెన్ని అవమానాలనైనా భరిస్తాడు కానీ, తనను నమ్మినవారినెవరినైనా దూషిస్తే అణుమాత్రం సహించడు. దోషులను శిక్షించి గానీ వదలడు. అందుకే శ్రీవారిని శరణాగత రక్షకుడూ, ఆర్తత్రాణ పరాయణుడూ అని కీర్తిస్తారు. కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఉన్న స్వామివారు వెంగమాంబను అవహించి, ఆమె నోటి ద్వారా "ఓరి పాపీ! నేటితో నీ వంశం సరి. అందరూ నెత్తురు కక్కుకుని మరణిస్తారు" అని పరుష వాక్కులు పలికింపచేశాడు. ఆమె వాణిని సాకారం చేస్తూ, ప్రధానార్చకునితో సహా వారి కుటుంబ సభ్యులందరూ తక్షణమే నెత్తురు కక్కుకుని మరణించారు. అర్చకుని ఒక్క కొడుకు మాత్రం పాక్కుంటూ వచ్చి వెంగమాంబ పాదాల మీద పడి శరణు వేడాడు. అప్పుడు కొంచెం శాంతించిన వెంగమాంబ – మీ వంశంలో ఒక్కడు మాత్రం బతుకుతాడని అభయమిచ్చింది. వెంగమాంబ ఇచ్చిన శాపమూ, అభయమూ నేటికీ తిరుమల యందు చెల్లుబాటులో ఉన్నాయని స్థానికులంటారు. ఆ దైవిక ఘటన జరిగిన రోజు సాయంకాలం వికలమనస్కురాలై ఉన్న వెంగమాంబతో శ్రీవారు జరిగిన దానికి చింతించవలదనీ, అంతా తన ప్రమేయంతోనే జరిగిందనీ, వెంగమాంబ నిమిత్త మాత్రురాలనీ, తన భక్తురాలిని నిష్కారణంగా దూషించినవారికి తగిన శాస్తి జరిగిందని చెప్పి సమాధాన పరుస్తాడు. శ్రీవారి ఓదార్పుతో కుదుటపడ్డ వెంగమాంబ ఆ దినం నుండీ క్రమం తప్పకుండా, ఆలయంలో ఆనంద నిలయునికి మరింత భక్తి శ్రద్ధలతో హారతినిస్తూ ఉండేది. అధికారులు ఆమెకే విధమైన ఆటంకాలూ కలిగించేవారు కాదు. భక్తులు కూడా, ఆమె శ్రీవారి సమక్షంలో ఉండటమే మంగళదాయకంగా భావించేవారు.

### శ్రీవారికి తాత్కాలికంగా దూరమైన వెంగమాంబ

వెంగమాంబ కైంకర్యాలు కొనసాగుతుండటం, ఆమె భక్తుల మన్ననలందుకోవడం మరో వర్గానికి చెందిన అర్చకులకు కంటగింపైంది. ఆమెను సూటిపోటి మాటలతో, పరుష పదజాలంతో బాధించేవారు. విసిగి వేసారిన వెంగమాంబ పరి పరి విధాలుగా ఆలోచించి, మనసు రాయి చేసుకుని, శ్రీవారి సేవకు దూరమవుతున్నానన్న బాధను అతికష్టం మీద దిగమ్రింగుకుంటూ ఆలయానికి వెళ్ళటం విరమించుకుంది. స్వామివారి దర్శనభాగ్యం లేకుండా జీవించడం దుర్భరమైనప్పటికీ అర్చకుల మనస్సు నొప్పించటం ఇష్టంలేని వెంగమాంబ నిత్యహారతికి స్వస్తి చెప్పి కొంతకాలం ఇంటికే పరిమితమైంది. శ్రీవారి ఆగ్రహం అతిశయించి ప్రధానార్చకుల ఉదంతం పునరావృతం కాకూడదని ఆమె ఉద్దేశ్యం. అటు, తమ పథకం పారి వెంగమాంబ ఆలయానికి దూరమవడంతో అర్చకులు మురిసిపోయారు. అది మూణ్ణాళ్ళ ముచ్చటే అని

వారికి తెలియదు.

వెంగమాంబ ఆలయానికి రాకపోవడం ఆనందనిలయునికి ఆందోళన కలిగించింది. ఆమె సమర్పణ భావంతో ఇచ్చే హారతి కోసం రోజుల తరబడి ఆర్తిగా నిరీక్షించేవాడు. ఆ భక్తవత్సలుడు ఆమె గొప్పదనాన్ని లోకానికి చాటి చెప్పి, ఆమె మనసు నొప్పించిన వారికి మరోసారి బుద్ధి చెప్పాలనుకున్నాడు. అంతే! శ్రీవారు మరో అద్భుతమైన పథకాన్ని రచించారు.

**ఆగిన తేరు**

మరునాడు బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు. శ్రీవారి తేరు దేదీప్యమానంగా వెలుగుతూ తిరుమల మాడ వీధుల్లో విహరిస్తోంది. పురజనుల్నీ, భక్తసందోహాన్ని అనుగ్రహిస్తూ, తూర్పు, దక్షిణ, పశ్చిమ మాడ వీధుల్లో నిరంతరాయంగా సాగిపోయింది. ఉత్తర మాడ వీధిలో తేరు ముందుకు సాగుతూ, తరిగొండ వెంగమాంబ ఇంటిముందు ఉన్నపళంగా ఆగిపోయింది. అర్చకులు, ఆలయాధికారులు, యాత్రికులు, తిరుమలవాసులు రథాన్ని కదల్చటానికి శతవిధాలుగా ప్రయత్నించారు. వృథా శ్రమ తప్ప రథం ఆవగింజంతైనా కదల్లేదు. గంటల కొద్దీ కాలయాపన జరిగింది. ఈ ఆటంకాన్ని గమనించిన పెద్దలు "ఏ భక్తునికో కష్టం కలిగి, స్వామివారి మనసు నొచ్చుకోవడం వల్ల ఇలా జరిగి ఉండవచ్చు" అని ఊహించుకున్నారు. వెంటనే అర్చకులకు వెంగమాంబ విషయం స్ఫురణకు వచ్చింది. ఆమెను దుర్భాషలాడడం, ఆమె ఆలయానికి దూరమవడం, ఆమె నిత్యం ఇచ్చే హారతి కొన్ని రోజుల నుండి శ్రీవారికి అందకుండా పోవడం, ఇవన్నీ ఒక్కొక్కటిగా గుర్తుకు రావడంతో వారి అనుమానం దృఢమైంది. దానితో అర్చకులందరూ హుటాహుటిన వెంగమాంబ ఇంటికి వెళ్ళి, తమ వల్ల జరిగిన అపరాధానికి క్షమార్పణ కోరి, స్వామివారికి తక్షణమే హారతినిచ్చి రథం కదిలేందుకు సహకరించవలసిందిగా ప్రాధేయపడ్డారు. అర్చకుల ప్రార్థనలు విన్న వెంగమాంబ వెంటనే హారతి పళ్ళెంతో బయటికి వచ్చి, తిరుమలేశునికి నీరాజనం ఇచ్చి నిరాటంకంగా ముందుకు సాగమని ప్రార్థించింది. తక్షణమే భక్తులందరూ ఆశ్చర్యానందాలతో మైమరచి వీక్షిస్తుండగా, రథం సునాయాసంగా ముందుకు కదిలింది.



**ముత్యాల హారతి**

ఆనాటి నుండి ఆలయ నిర్వాహకులు మరింత భక్తి ప్రపత్తులతో, ఆమె చేత స్వామివారికి కర్పూరహారతిని ఇప్పించేవారు. ప్రతిరోజూ చిట్టచివరగా వెంగమాంబ కర్పూర హారతి లేనిదే ఆలయం మూయకూడదనీ, ఆమె హారతి తరువాత మరే హారతీ ఇవ్వరాదని స్వామివారు అర్చకులకూ, అధికారులకూ స్వప్నంలో కనబడి ఆదేశించారు. ఆనాటి నుండి ప్రతిరోజూ ఏకాంతసేవ సమయంలో చిట్టచివరగా వెంగమాంబ గారి ముత్యాల హారతి అయిన తరువాతనే శ్రీవారి ఆలయం మూయబడుతున్నది. ఈ ముత్యాల హారతి గురించి మనం "ఏకాంతసేవ"లో ఇంతకుముందే తెలుసుకున్నాం. తన తదనంతరం కూడా ముత్యాలహారతి నిరాఘాటంగా కొనసాగే నిమిత్తం, నిస్సంతు అయిన వెంగమాంబ తన చెల్లెలి కూతురైన మంగమ్మను దత్తత తీసుకుంది. నేటికీ ఈమె సంతతి వారే పవళింపు సేవలో ముత్యాల హారతినిచ్చే సంప్రదాయాన్ని, రంగవల్లులు తీర్చిదిద్దటాన్ని కొనసాగిస్తున్నారు. **(ఇంకా ఉంది)**

**"వందేమాతరం" ఆనాటి ప్రేరక మంత్రమైతే – వందే గోమాతరం ఈనాటి తారకమంత్రం**



# గీతామృతము

– చిల్లర సీతారామారావు

**"సారథ్య మర్జున స్యాచౌ కుర్వన్ గీతామృతం దదౌ**
**లోక త్రయోపకారాయ తస్మై కృష్ణాత్మనే నమః"**

ఏ మహనీయుడు పూర్వము అర్జునునకు సారథియై వర్తించుచు, ముల్లోకములందలి జనుల యొక్క ఉపకారార్థము గీతామృతము నొసంగెనో, అట్టి శ్రీకృష్ణ పరమాత్మకు నమస్కారము.



మార్గశిర మాసము మహోన్నతమైన మాసము. 'మాసానాం మార్గశీర్షోహం' మాసములలో మార్గశిరమాసమును నేను అని శ్రీకృష్ణపరమాత్మ నుడివిన మాసము మార్గశీర్షము. పవిత్ర మార్గశీర్ష శుక్లపక్షమున 'గీతా జయంతి' పర్వమును జరుపుకుంటారు. జయంతి అనగా పుట్టిన రోజు అని అర్థము. కాని ఒక గ్రంథమునకు జయంతిని జరపడం ఆ గ్రంథము యొక్క విశిష్టతలను తెలియజేస్తున్నది. విశిష్టత కలిగిన ఆ గ్రంథమే భగవద్గీత. భగవద్గీతను గీత యని కూడా అంటారు. 'గీత' భగవంతుడు మానవ లోకమునకు ఇచ్చిన అమృతభాండము.

శ్లో ॥ **"భారత దధి నిర్మిధ్య గీతా నిర్మధి తస్య చ**
**సారముద్ధృత్య కృష్ణేన అర్జునస్య ముఖేధృతమ్"**

మహాభారతమును మధించి, సారమగు గీతను తీసి అద్దానిని శ్రీకృష్ణపరమాత్మ అర్జునుని ముఖమున ప్రవేశపెట్టాడు. ఆధ్యాత్మ జ్ఞానమునకు, సమస్త ధర్మములకు నిఘంటువు భగవద్గీత. భగవద్గీత విశ్వమానవ కళ్యాణ సాధకమగు యుద్ధంథము. భగవద్గీతకు భాష్యం రచిస్తూ శంకరాచార్యులు ఇలా ప్రస్తుతించారు. ''తదిదం గీతా శాస్త్రం సమస్త వేదార్థ సార సంగ్రహమ్'' అనగా గీతాశాస్త్రం వేద వేదాంతాల సార సంగ్రహము అని అర్థము.

భగవద్గీతలో 18 అధ్యాయములు, 700 శ్లోకములు ఉన్నాయి. ఆ శ్లోకములలో ఒక్క శ్లోకమైనా, ప్రతిపద అర్థమును, తాత్పర్యమును మననము గావించుకొని దానిని ఆచరించితే అతడు ఉద్ధరింపబడతాడు.

శ్లో ॥ **"ఉద్ధరే దాత్మనాఽఽత్మానం నాత్మా నవసాదయేత్**
**ఆత్మైవ హ్యాత్మనో బన్ధురాత్మైవ రిపురాత్మనః"**

మానవుడు తనను తాను ఉద్ధరించుకోవాలి. తనను తాను నాశనము గావించుకొనకూడదు. ఎందువలనంటే తనకు బంధువు తానే. తనకు శత్రువు తానే. గురువు, శాస్త్రము, దైవము దారిని చూపిస్తాయి. కాని ఆ దారిన నడవవలసినది తానే. తన కాళ్ళతోనే నడవాలి. తన కన్నులతోనే చూడాలి. తన ఆకలిని తానే తీర్చుకోవాలి.

గీత అనంతభావాల జలనిధి. అగాధమైన జలనిధి లోనికి ప్రవేశించినప్పుడే అమూల్య రత్నాలు ప్రాప్తిస్తాయి. గీతా

సాగరమున లోతుల లోనికి వెళ్ళినప్పుడే జిజ్ఞాసువులకు నిత్య నూతన విలక్షణ భావరత్న రాశులు లభిస్తాయి. ఆ రత్నములే మోక్షప్రాప్తికి సోపానములు. మహిమాన్వితమైన భగవద్గీతను ప్రశంసిస్తూ వ్యాసులవారు ఇలా అన్నారు.

శ్లో ॥ "గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్ర విస్తరైః
యా స్వయం పద్మనాభస్య ముఖ పద్మాత్ వినిః సృతా"

గీత సాక్షాత్తు పద్మనాభుడైన విష్ణుభగవానుని ముఖారవిందము నుండి వెలువడింది. కనుక దీనిని తప్పనిసరిగా చదవాలి. దీనిని విడిచి ఇతర శాస్త్రములను పఠించిన ఏమి ప్రయోజనము?

ద్వాపర యుగాంతమున రణరంగమున భగవంతుని ద్వారా అర్జునునకు ఉపదేశింపబడిన భగవద్గీత, అయిదు వేల సంవత్సరములు గడిచినా, యుగము, కాలముల మార్పులతో నిమిత్తము లేకుండా, నిత్య నూతనత్వముతో, నవ నవోన్మేషణముగా ప్రజ్వలిస్తూ యావత్ప్రపంచానికి నిరంతరం వెలుగుబాట చూపిస్తూ, చెక్కుచెదరకుండా, నదీప్రవాహము వలె నిత్య నూతనముగా భాసిల్లుతున్నది. భగవద్గీతలో చెప్పిన బోధ ప్రజాహిత జీవితానికి చాలా దగ్గరగా ఉండటం చేత అద్వితీయమై గౌరవ ప్రతిష్ఠలతో వెలుగొందుతున్నది. శ్రద్ధాళువులకు, అసూయా రహితులకు, జిజ్ఞాసువులకు మాత్రమే భగవద్గీత ఉపయోగపడుతుందని శ్రీకృష్ణపరమాత్మ చెప్పాడు.

నిత్య జీవన సమరములో ఏ పని చేయాలో, ఏ పని చేయకూడదో నిర్ణయించుకోలేని పరిస్థితులు ఎదురైనప్పుడు, విషాదమునకు లోనయి, కర్తవ్యమును గుర్తించలేని పరిస్థితులలో భగవంతుడిని విశ్వసించి, ఆశ్రయిస్తే, కర్తవ్యమును ఉపదేశించి, దిశా నిర్దేశము గావించి, విజయపథము వైపు నడపగలిగే మహోన్నతమైన ఉపదేశ గ్రంథము భగవద్గీత. అనగా సమస్త సమస్యలకు పరిష్కారం చూపే దివ్య గ్రంథము గీత. గీత యను రెండక్షరములు విశిష్టమైన అర్థము కలిగినవి.

శ్లో ॥ "గీ కారం త్యాగరూపం స్యాత్తకారం తత్త్వబోధనమ్
గీతావాక్య మిదం తత్త్వం జ్ఞేయమ్ సర్వముముక్షుభిః"

గీ అను అక్షరమునకు త్యాగము అని అర్థము. త అను అక్షరమునకు తత్త్వ జ్ఞానము అని అర్థము. త్యాగమును, జ్ఞానమును బోధించునది గీత యని ముముక్షువులు గ్రహించాలి.

గీత యందు జ్ఞానము, జ్ఞేయము అను రెండు విషయములు ప్రధానముగా పేర్కొనబడ్డాయి. అందు జ్ఞానము, సాధన, జ్ఞేయము సాధ్యము. సాధ్యమును గురించి కొద్దిగా నుడివి, సాధనను గురించి గీత విశేషముగా పేర్కొన్నది. ఎందువలన అంటే సాధన యందు ఆరితేరితే సాధ్యము కరతలామలకము అవుతుంది. భగవద్గీత శీల నిర్మాణమునకు విశేష ప్రాధాన్యత నొసంగినది. గీతలోని రెండవ అధ్యాయము నందు స్థితప్రజ్ఞ లక్షణములు, పన్నెండవ అధ్యాయము లోని అద్వేష్టృత్వాది గుణములు, పదమూడవ అధ్యాయము నందలి అమానిత్వాది గుణములు, పదునాలుగవ అధ్యాయము లోని అభయం, సత్త్వ సంశుద్ధ్యాది గుణములను ప్రయత్నపూర్వకముగా నలవరచుకొని తద్వారా క్షేత్రశుద్ధిని కలుగజేసుకొనినచో జ్ఞేయ (ఆత్మ) ప్రాప్తి సులభతరమవుతుంది.

శ్లో ॥ "సంసారం సాగరం ఘోరం తర్తుమిచ్ఛతి యోనరః
గీతా నావం సమాసాద్య పారం యాతి సుఖేన సః"

ఘోరమైన సంసార సాగరము నుండి బయట పడాలన్న కాంక్ష గల మానవుడు గీత యను నావను ఆశ్రయించి సులభముగా అవతలి ఒడ్డుకు చేరుకోగలడు. 'ఆపదం నరకం ఘోరం గీతాధ్యాయీ న పశ్యతి' అనగా గీతను పారాయణము చేయువాడు ఆపత్తులను, భయంకరమగు నరకమును ఎన్నటికీ పొందడు. భుక్తి ముక్తి దాయకములగు ఉపదేశములతో కూడిన గీత మానవాళికి మనశ్శాంతి కలుగజేయు శక్తి గలది. గీత ఒక అమృత భాండము. అమృతమును కొద్దిగా ఆస్వాదించినా అమృత తత్త్వమును పొందగలరు.

శ్లో॥ "గేయం గీతానామ సహస్రం, ధ్యేయం శ్రీపతిరూప మజస్రం
నేయం సజ్జన సంగే చిత్తం, దేయం దీన జనాయచ విత్తమ్"

భగవద్గీతను, విష్ణు సహస్ర నామములను భక్తితో శ్రద్ధగా చదువుకోవాలి. విష్ణుమూర్తి రూపమును నిత్యము ధ్యానించాలి. సత్పురుషుల సాంగత్యమునందు చిత్తమును ప్రవేశింపచేయాలి. దీనులకు ధనమును దానము చేయాలి.

మానవులకు ముక్తిని ప్రసాదించుటయే గీతాశాస్త్రమునకు పరమ ప్రయోజనము అని చెప్పబడింది. సచ్చిదానంద రూపమగు, పరిపూర్ణ పరమపద ప్రాప్తి కొరకు, వేదములు కాండ త్రయాత్మికమును ఆరంభించినాయి. కర్మ, ఉపాసన, జ్ఞాన కాండములని వాటికి పేర్లు. వేదరూపమై అష్టాధ్యాయములతో కూడిన భగవద్గీతయు క్రమముగా కర్మ, ఉపాసన (భక్తి), జ్ఞాన కాండ త్రయాత్మకమై ఉన్నది. అందువలన భగవద్గీత సర్వశాస్త్రమయీ అని చెప్పబడింది. నిష్కామకర్మ, యోగానుష్ఠానముచే భగవద్భక్తి, భక్తి యోగము వలన జ్ఞానోత్పత్తి, జ్ఞానయోగము వలన ముక్తి లభించునని సర్వశాస్త్రములు తెలియజేయుచున్నాయి. ఉపాసన యందు ధ్యానయోగము అంతర్భూతమై ఉంది. కావున భగవద్గీత కాండ త్రయాత్మకమైనదిగా వర్ణించుకుంది. భగవద్గీత శ్రద్ధాళువులకు, అసూయా రహితులకు, జిజ్ఞాసువులకు ఉపయోగపడుతుందని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పాడు. శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడితో ఇలా అన్నాడు.

శ్లో ॥ "గీతామే హృదయం పార్థ గీతామే సారముత్తమమ్
గీతామే జ్ఞానమత్యుగ్రం గీతామే జ్ఞాన మవ్యయమ్"

అర్జునా! గీతయే నా హృదయము. గీతయే నా యొక్క ఉత్తమ తత్త్వము. గీతయే నా యొక్క తేజోవంతమైన, నాశరహితమైన జ్ఞానము. గీతయే నా యొక్క పరమ రహస్యము. గీతయే నా యొక్క శ్రేష్ఠమగు పదము. గీతయే నా యొక్క పరమ గురువు. గీత నా యొక్క ఉత్తమ గృహము. గీతను ఆశ్రయించియే నేను ముల్లోకములను పాలించుచున్నాను. నేను గీతను ఆశ్రయించుకొనియే ఉన్నాను. గీతకు పదునెనిమిది నామములు ఉన్నాయి. ఆ నామోచ్చరణమే సమస్త పాపములను నాశనము గావిస్తుంది. ఆ నామములు ఇవి.


శ్లో ॥ "గంగా గీతాచ గాయత్రీ సీతా సత్యా సరస్వతీ
బ్రహ్మవల్లీ బ్రహ్మవిద్యా త్రిసంధ్యా ముక్తిగేహినీ
అర్ధమాత్రా చిదానన్దా భవఘ్నీ భ్రాన్తినాశినీ
వేదత్రయీ పరాఽనన్తా తత్త్వార్థ జ్ఞానమంజరీ
ఇత్యాతాని జపే న్నిత్యం నరో నిశ్చల మానసః
జ్ఞాన సిద్ధిం లభే న్నిత్యం తథాంతే పరమం పదం"

గంగ, గీత, గాయత్రీ, సీత, సత్య, సరస్వతి, బ్రహ్మవల్లీ, బ్రహ్మవిద్య, త్రిసంధ్య, ముక్తిగేహినీ, అర్ధమాత్ర, చిదానంద, భవఘ్ని, భ్రాంతినాశినీ, వేదత్రయీ, పర, అనంత, తత్త్వార్థ జ్ఞానమంజరి. మానవుడు ఈ నామములను భక్తి శ్రద్ధలతో నిరంతరం జపించితే, జ్ఞానసిద్ధిని పొంది తుదకు పరమాత్మ పదమును చేరుతాడు.

గీతామాత కామధేనువు. ఈమె క్షీరము ఉపనిషత్త్వము. ఈ క్షీరమును ఎవరు పితుకుటకు ప్రయత్నించిననూ గీతా ధేనువునకు అభ్యంతరముండదు. ఎవరి శక్త్యానుసారం వారు పితుకుకోవచ్చు. వారి వారి శ్రద్ధా భక్తులను బట్టి, వారి వారి ఆధ్యాత్మిక శక్త్యుత్సాహములను బట్టి వారలకు లభించగలదు. భగవద్గీత లోని శ్లోకములు శ్లోకములు కావు. అవి మంత్రములు. భగవంతుని ముఖము నుండి వెలువడినవి కనుక మంత్రముల కంటె కూడా పరమ పవిత్రమైనవి.

గీతను ఎవరికి పడితే వారికి ఉపదేశించకూడదు. భగవద్గీతను తెలుసుకోవాలని కోరుకొనేవారికి, భగవంతుని భక్తులకు, పెద్దలను గౌరవించే గుణము కలవారికి, అసూయ లేనివారికి మాత్రమే ఉపదేశించాలి. జప తపముల యందు విముఖత కలిగినవారికి, భక్తిభావన లేనివారికి, వినుటకు ఇష్టపడనివారికి, భగవంతుడిని నిందించువారికి భగవద్గీతను ఉపదేశించకూడదు. శ్రీకృష్ణుడు భగవద్గీత యందు బోధించిన ఉపదేశము సర్వకాల సర్వావస్థల యందు సమస్త మానవాళికి జ్ఞానబోధగా భాసిల్లుతూ ఉంది.

భగవద్గీతను నిరంతరం చదువుతూ ఉండాలి. నిత్యమూ చదవడం వలన స్థిరబుద్ధి, వివేకము కలుగుతాయి. భగవద్గీతలోని ఒక అధ్యాయము నైనా నిశ్చల భక్తితో చదివితే రుద్రలోకములో ఆనందముగా చాలాకాలం ఉండవచ్చు. పదునెనిమిది అధ్యాయములను చదివితే జ్ఞానసిద్ధి, మోక్షము ప్రాప్తిస్తాయి. తొమ్మిది అధ్యాయములను చదివితే గోదానమంత పుణ్యం ప్రాప్తిస్తుంది. ఆరు అధ్యాయములు చదివితే గంగా స్నాన ఫలం ప్రాప్తిస్తుంది. మూడు అధ్యాయములను చదివితే సోమయాగ ఫలము ప్రాప్తిస్తుంది. కనీసం రోజుకొక శ్లోకమునైనా కంఠస్థము చేయాలి. త్రికరణ శుద్ధిగా భగవద్గీతను పఠిస్తే ఇహ పర లోకములందు సుఖములను, మోక్షమును పొందవచ్చును.



# అభీష్టప్రదం హనుమద్వ్రతం

: చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో ॥ "దుష్టానాం శిక్షణార్థాయ శిష్టానాం రక్షణాయ చ**
**రామ కార్యార్థ సిద్ధ్యర్థం జాతః శ్రీ హనుమాన్ శివః"**

దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసేందుకు పరమశివుడే రామకార్యాన్ని సిద్ధింపచేసే సంకల్పంతో హనుమంతునిగా అవతరించాడని శ్లోకార్థం. దీనిని బట్టి హనుమ పరిపూర్ణ రుద్రావతార సంభూతుడని తెలుస్తోంది.

హనుమంతుడు వైశాఖ కృష్ణ దశమి, పూర్వాభాద్ర నక్షత్రంలో అంజన, కేసరి పుణ్యదంపతులకు జన్మించాడు. హనుమంతునికి సంబంధించిన ముఖ్య పర్వాలు మూడు ఉన్నాయి. మొదటిది హనుమజ్జయంతి. రెండవది జ్యేష్ఠ దశమినాడు హనుమత్కళ్యాణం, మూడవది మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు హనుమద్వ్రతం.


**శ్లో ॥ "హనుమత్సదృశం దైవం – నాస్తి నాస్త్యేన భూతతే**
**అనైనేవ ప్రమాణేన – జయసిద్ధి కరం పరమే"**

హనుమంతునితో సమానమైన దైవం ఈ భూలోకంలో లేదు. ఈ ప్రమాణం వల్లనే హనుమద్వ్రతం చేసినవారికి జయసిద్ధి నిశ్చయంగా కలుగుతుందని తెలుస్తోంది. ఆయన దాసభక్తికి ప్రతీక. రామభక్తునిగా దాసత్వం నిర్వహిస్తూనే, స్వయంగా అనిర్వచనీయ శక్తికి, మహిమకు ఆరాధ్యునిగా నిలిచినవాడు హనుమంతుడు. అమిత వేగవంతుడు, బలసంపన్నుడైన వాయుదేవుని అంశతో పుట్టినవాడు హనుమంతుడు కాబట్టి అజేయ పరాక్రమవంతుడయ్యాడు.

**"బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వ మరో గతా**
**అజాడ్యం వాక్పటుత్వంచ హనుమాన్ స్మరణాత్ భవేత్"**

కేవలం స్మరించినంత మాత్రముననే బుద్ధి, బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగ్యం, చైతన్యం, వాక్పటిమలను ప్రసాదించే దేవుడు శ్రీ ఆంజనేయస్వామి. అంతేకాకుండా పూజిస్తేనే భూత, ప్రేత, పిశాచ, శాకినీ, ఢాకినీ వంటి పిశాచాలు దరి చేరకుండా చేసే ఆంజనేయుడు సమతకు నిదర్శనం. శివకేశవులిద్దరికీ సమస్థానీయుడు. ఒకవైపు బాహుశక్తి, మరోవైపు బుద్ధి కుశలతను, భోగాన్నీ, మోక్షాన్నీ కూడా ప్రసాదించగలడు. నర–పశు–నర–దైవత్వాలకు, తత్వాలకు ప్రతీక ఆంజనేయుడు.

హనుమ పుట్టుకతోనే వేద వేదాంగాల తత్త్వము తెలిసినవాడు. సర్వ విద్యా విశారదుడు అయినను గురూపదేశం ఉండాలని సూర్యుని వద్ద వేదాలు, ఇంద్ర వ్యాకరణం నేర్చుకున్నాడు. బుద్ధిమంతులలో శ్రేష్ఠుడయ్యాడు. హనుమ వాగ్వైభవం కిష్కింధ



చివర, సుందరకాండ మొత్తంలో ఆలోచనాత్మకంగా సాగుతుంది. తొలిసారి రామలక్ష్మణులను కలిసినప్పుడు అత్యంత జాగరూకతతో వారితో చేసిన సంభాషణ పరిపూర్ణత్వాన్ని సిద్ధింప చేస్తుంది.

మునుముందుగా ఆ సోదరుల స్వరూప తేజస్సుకు నమో వాక్కులు అందిస్తూ నిదానంగా తానెవరో, తన రాజెవరో విశ్లేషణ, విశేషణ పూర్వకంగా చెప్పుకొస్తాడు. హనుమ సంభాషణాతీరును, ఉచ్చారణా రీతిని ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ ముగ్ధుడవుతూ శ్రీరాముడు సోదరునితో మాట్లాడుతూ సోదరా! ఈతని వాక్పటుత్వంలో ఎక్కడా, ఏ దోషం లేదు. ఎట్టి అసందిగ్ధతా లేదు. హృదయ గతంగా మంద్రస్థాయిలో మాట్లాడుతున్నాడు. భాష, శైలి సంస్కారవంతంగా ఉన్నాయి. నాలుగు వేదాలు, వ్యాకరణం చదివిన పాండిత్యం, దోష రహితమైన శాస్త్ర పాండిత్యం చక్కగా ఉన్నాయని ప్రశంసించాడు. రామలక్ష్మణులతో చేసిన సంభాషణ ఆత్మస్థైర్యానికి పలుకుల పొందికకూ చక్కని నిదర్శనం. ఆయన ప్రతిభ మేరుపర్వత సమానం. భక్తితో సమున్నత

భావావేశాన్ని కల్పించినవాడు హనుమ. హనుమంతునికంటే గొప్ప దైవం లేదని మహర్షులందరూ నిర్ణయించారంటుంది వానర గీత. కలియుగంలో హనుమను సేవిస్తే సకల దేవతలను ఉపాసించినట్లే అని ఈశ్వరుడే స్వయంగా చెప్పాడు.

భగవంతుని ప్రసన్నం చేసుకోవడానికి నిరంతరం భక్తి ప్రపత్తులతో ఆరాధించడాన్ని వ్రతమని అంటారు. వ్రతాలను అందరూ చేయవచ్చు. ఫలితాలను పొందవచ్చు. అయితే దైవాన్ని నమ్మినవారు మాత్రమే వ్రతాలను ఆచరించాలి. వ్రతాలను ఆచరించడానికి భక్తి, శ్రద్ధ, నమ్మకం చాలా అవసరం. చిత్తశుద్ధితో, అచంచల భక్తి విశ్వాసాలతో, ప్రపత్తులతో ఆచరించే వ్రతాలలో హనుమద్వ్రతం ఒకటి. సకల కామ్యాలనూ తీర్చే వ్రతమిది. ఈ వ్రతాన్ని చేయడం వల్ల విద్య, విజ్ఞానం, ఆయురారోగ్యాలు, వాక్సిద్ధులు అభివృద్ధి చెందడంతో పాటు అన్నింటా విజయం లభిస్తుంది. శ్రీకృష్ణుడు ద్రౌపదితో ఈ వ్రతాన్ని చేయించాడు. హనుమదారాధకులైన నీలుడు, దత్తుడు, అంగదుడు, విజయుడు, భరతుడు, సుశేషుణుడు, కశ్యప మైత్రేయ మహర్షులు వంటివారే కాక, మరెందరో హనుమద్వ్రతం ఆచరించి విజయాలను పొందారు. ఇటువంటి అమోఘమైన వ్రతాన్ని ఆచరిస్తే అసాధ్యాలు సుసాధ్యాలై సకల శుభాలు కలుగుతాయి. ఈ వ్రతాన్ని మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు చేయాలి. త్రయోదశి నాడు మృగశిరా నక్షత్రం వస్తే అది అత్యుత్తమం.

హనుమద్వ్రతం చేయదల్చుకున్నవారు త్రయోదశి నాడు తెల్లవారు జాముననే అనగా బ్రాహ్మీముహూర్తం లోనే లేచి స్నానాది కార్యక్రమాలను నిర్వర్తించుకుని, శుభముహూర్తంలో సకల సంభారాలు సమకూర్చుకోవాలి. ముందు రోజు ఉపవాసం ఉండి (రాత్రి) బ్రహ్మచర్యం పాటించాలి. మరునాడు సంధ్యాది విధులు ముగించుకుని, గురు సమక్షంలో విధి విధానంగా వ్రతానికి పూనుకోవాలి. ఇంటిని గోమయంతో శుభ్రం చేసుకుని ముగ్గులను వేయాలి. ఇంటి గడపలను శుభ్రపరచి, పసుపు రాసి, కుంకుమబొట్టు పెట్టాలి. ఇంటిలోని పూజాగృహంలో కానీ, వ్రతం చేయదల్చుకున్న ప్రాంతంలో కానీ ఒక మంటపాన్ని ఏర్పాటు చేసుకుని, మంటపం పైన మధ్యభాగంలో తెల్లని వస్త్రాన్ని పరచి, దానిపై బియ్యాన్ని పోయాలి. బియ్యం పైన కలశాన్ని ఏర్పాటు చేసుకోవాలి. కలశం లోపల తమలపాకులు వేసి, వాటిపై కొబ్బరికాయను ఉంచి రవికె గుడ్డను మడిచిపెట్టాలి. కలశం వెనుకవైపు హనుమంతుని చిత్రపటాన్ని, ముందుభాగంలో విగ్రహాన్ని ఉంచి మంత్రపూర్వకంగా ప్రతిష్ఠించుకోవాలి. ఈ క్రింది శ్లోకాన్ని చదువుతూ —

"కలశస్య ముఖేవిష్ణుః కంఠే రుద్ర సమాశ్రితాః
మూలే తత్ర స్థితో బ్రహ్మ మధ్యే మాతృగణా స్మృతాః"

అంటూ నమస్కరించాలి. కలశ జలాన్ని పువ్వుతో కలయత్రిప్పి, నీటిని పూజా సామగ్రిపై, హనుమ ఫోటోపై చల్లి, మనపై చల్లుకుని శుద్ధి చేసుకుని నమస్కరించాలి.

పసుపుతో వినాయక ప్రతిమను చేసి షోడశోపచారాలతో పూజించాలి. అనంతరం గణపత్యాది పంచలోకపాలకులకు పూజ, ఆదిత్యాది నవగ్రహపతి పూజ, ఇంద్రాద్యష్టదిక్పాలక పూజ చేయాలి. మండపారాధన తర్వాత హనుమద్వ్రత ప్రతిమా ప్రతిష్ఠ, సువర్చలా హనుమంతులకు ప్రీతిపూర్వకంగా తమలపాకులుంచి, వాటిపై యంత్రం కానీ, ప్రతిమను గానీ ఉంచాలి. ముందు తమలపాకులపై శ్రీగంధంతో త్రయోదశ దళ పద్మాన్ని అనగా పదమూడు రేకుల పద్మాన్ని గీసి, మధ్యలో ప్రణవాన్ని పదమూడు రేకులతో "ఓం నమో భగవతే వాయు నందనాయ" అనే అక్షరాలను రాసి పూజించాలి. కలశ పూజ తర్వాత గణపతిని పూజించాలి. అనంతరం స్వామివారి ముందు అరటిపండును నైవేద్యంగా ఉంచి, కలశానికి ముందు తమలపాకులపై తోరములను ఉంచాలి. తోరాలకు ఎన్ని ముడులు వేస్తామో అన్ని సంవత్సరాలు ఈ వ్రతాన్ని చేయాలి.

హనుమంతునకు, ప్రతిమా రూపునకు షోడశోపచార పూజ, అష్టోత్తర శతనామపూజ, సహస్రనామ సువర్చలాష్టోత్తర పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలి. హారతి, మంత్రపుష్పం తర్వాత కథాశ్రవణం చేయాలి. అనంతరం ధూపమివ్వాలి. కొబ్బరికాయలను కొట్టాలి. గోధుమరవ్వ, పంచదారతో చేసిన ప్రసాదాన్ని, అప్పాలను నివేదించాలి. వాయనమివ్వాలి. హనుమంతునకు మామిడిపండ్లంటే ఎంతో ఇష్టం. కాబట్టి అవకాశముంటే, లభ్యమయితే నివేదించాలి. అనంతరం బంధుమిత్రులతో కలిసి భోజనం చేయాలి. ఈ విధంగా సమంత్రకంగా గురూపదేశం ప్రకారం హనుమద్వ్రతాన్ని ఆచరించడం వల్ల సకల కార్యసిద్ధి కలుగుతుంది.

సీతాన్వేషణలో భాగంగా సముద్ర లంఘనం చేసింది, లంకను చేరుకుని అశోకవనంలో ఉన్న సీతమ్మను హనుమ మొదటగా దర్శించిందీ ఈరోజే. అందుకే ఈ రోజున హనుమద్వ్రతం చేసుకుంటే సకల దుఃఖాలు తొలగి సుఖశాంతులు కలుగుతాయి. పవనసుతునికి పరమ ప్రీతికరమైన సింధూరంతో పూజించడంవల్ల సకల గ్రహదోషాలు తొలగుతాయి. ఆంజనేయ స్వామి ఉపాసన వల్ల జాతకంలోని దోషాలు తొలగిపోతాయి. మంగళ, శని వారాలు మారుతికి పరమ ప్రీతికరమైన రోజులు. విశేషించి కుజదోషం గల ఆడపిల్లలు, వివాహం కానివారు తమలపాకులతో హనుమను పూజించి అప్పాలు నివేదన చేసి, సింధూరాన్ని నొసట ధరిస్తే, ఎంతో మేలు కలుగుతుంది.

త్రేతాయుగంలో శ్రీరామదూతగా, ద్వాపరయుగంలో అర్జునునికి రథరక్షకుడిగా, కలియుగ దైవంగా ప్రాతఃస్మరణీయ చిరంజీవులలో ఒకడిగా, భవిష్యత్ బ్రహ్మగా కీర్తించబడ్డ మారుతిని కొలిచి మనమంతా తరిద్దాము.

# నవ విధ భక్తి మార్గాలు

– డా|| కూర్మాచలం శంకరస్వామి

## కీర్తన భక్తి

నవవిధ భక్తి మార్గాలలో కీర్తన భక్తి ఒకటి. భగవంతుని నామాన్ని కీర్తించడం ద్వారా ముక్తిని పొందవచ్చునని భాగవతం బోధిస్తున్నది. దీనికి ప్రతీకలుగా పూర్వం శుకమహర్షి, నారద మహర్షి, ఆధునిక యుగంలో త్యాగయ్య, క్షేత్రయ్య, పురందరదాసు, తులసీదాసు, సంకీర్తనాచార్యులు అన్నమయ్య, రామదాసు మొదలగువారు ఈ మార్గం ద్వారా మోక్షం పొందిన భక్తాగ్రేసరులు.

**"బ్రహ్మహత్యానేక పాపాటవుల**
**కగ్నికీలల హరినామ కీర్తనములు**
**గురు తల్ప కల్మష క్రూర సర్పములకు**
**గేకులు హరినామ కీర్తనములు**
**తపనీయ చౌర్య సంతమసంబునకు**
**సూర్యకిరణముల్ హరినామ కీర్తనములు**
**మధుపాన కిల్బి మదనాగ సమితికి**
**గేసరుల్ హరినామ కీర్తనములు**
**మహిత యోగోగ్ర నిత్య సమాధి నిధుల**
**నలరు బ్రహ్మాది సురలకు నందరాని**
**భూరి నిర్వాణ సామ్రాజ్య భోగభాగ్య**
**ఖేలనములు హరినామ కీర్తనములు**

అనేకమైన బ్రహ్మహత్యా పాపపు అడవులను భస్మము చేసే అగ్నికీలలు ఈ హరినామ కీర్తనలు. భయంకరమైన క్రూర విషసర్పములకైనా భయము పుట్టించు నెమళ్ళ అరుపులు ఈ హరినామ కీర్తనములు. సువర్ణ చౌర్యమనెడి గాఢాంధకారమునకు సూర్యకిరణముల వంటివి హరినామ కీర్తనములు.

మద్యపానమనెడి మదపుటేనుగుకు సింహస్వప్నము వంటివి ఈ హరినామ కీర్తనములు. గొప్ప యోగాభ్యాసము, ఉగ్రతపస్సులు నిత్య సమాధి విధులతో బ్రహ్మాది దేవతలకును అంతుచిక్కని అసమాన మోక్ష సామ్రాజ్య భోగభాగ్యాల క్రీడలు ఈ హరినామ కీర్తనములు అని హరినామ కీర్తనల వైభవాన్ని విష్ణుదూతలు యమదూతలతో పలికిన ఈ మాటలను పరిశీలిస్తే హరినామ కీర్తనలు ఎంత గొప్పవో అర్థమవుతుంది.

**"ముక్తి కాంతైె కాంత మోహన కృత్యముల్**
**కేలివై హరినామ కీర్తనములు**



**సత్యలోకానంద సౌభాగ్య యుక్తములు**
**కేలిమై హరినామ కీర్తనములు**
**మహిత నిర్వాణ సామ్రాజ్యాభిషిక్తముల్**
**కేలిమై హరినామ కీర్తనములు**
**బహుకాల జనిత తపః సారముల్**
**కేలిమై హరినామ కీర్తనములు**
**పుణ్యమూలంబు లనపాయ పోషకంబు**
**లభిమతార్థంబు లజ్ఞానహరణ కరము**
**లాగమాంతోపలబ్ధంబు లమృత సేవ**
**లార్త శుభములు హరినామ కీర్తనములు"**

ఓ యమ దూతలారా! శ్రీహరి నామ కీర్తనల ద్వారా ముక్తి కాంతలతో సౌభాగ్యము కలుగును. సత్యలోకానందము

కలుగు ను. అసమానమైన మోక్ష సామ్రాజ్యము సిద్ధిస్తుంది. జన్మ జన్మల తపస్సు చేసిన ఫలితం లభిస్తుంది. పుణ్యఫలము నిరపాయస్థితి జేకూరుతుంది. అజ్ఞానము తొలగిపోయి అభీష్టసిద్ధి కలుగుతుంది. వేదాధ్యయన ఫలము, అమృత తత్త్వము లభిస్తుంది. క్లేశ నాశనములు, అన్నింటా శుభాలు, విజయాలు ఈ హరినామ కీర్తనల ద్వారా సిద్ధిస్తాయి అని విష్ణుదూతలు తెలిపారు.

అంతేకాదు, శ్రీహరి యొక్క నిర్మల నామము కన్నా లోకంలో కోరదగినది ఏమున్నది? అది పుణ్యమార్గములలో ఒక స్థిరమైన తావు. అది మునీంద్రుల గాఢమైన ధ్యానము కూడిన మనస్సనే కోనేరునే నివాసంగా కలది. అటువంటి స్థితిని పొందిన వానిని మించినవాడు లేడు. అట్టి నామకీర్తనకు మించిన కీర్తన లేదు. పుత్రుడు పుట్టిన ఆనందము కంటె హరినామ కీర్తన గొప్పది. బిడ్డల పేరుపెట్టి పిలిచే పిలుపులో, తీరిక సమయాల్లో పలికే పలుకుల్లో, వినోదములోనైనను, హాస్యమునకైనను, పద్యరూపమైనా, గద్యరూపమైనా హరిని స్తుతించుట, స్మరించుట వలన పాపము నశించి పుణ్యఫలము సిద్ధిస్తుంది. నేలకూలినప్పుడు కాని, కొట్టబడి కృంగినప్పుడు కాని, పెద్ద పెద్ద జ్వరాదులచే శరీరం వేడెక్కిన సమయంలో కాని, సర్పాది కీటకాల విషపు కాటులకు బాధపడుతున్న వేళలో కాని, వివిధ ప్రమాదాలలో చిక్కుకుని పడియున్నప్పుడు కాని, సంసార దుఃఖ జలధిని దాటించే విష్ణువు నామ కీర్తన చేసినా సమస్త రోగబాధలు తొలగి నరకబాధలు నశిస్తాయి.

**"హరి యెఱుగని యా బాలుడు**
**హరి భక్తులతోడ గూడి హరి యను వాడున్**
**సరియైన దోషము లడచును**
**గరువలితో నగ్ని తృణము గాల్చిన భంగిన్"**

ఆ శ్రీమన్నారాయణుని గురించి ఏమీ తెలియని పిన్నవాడు, అశిక్షితుడు, మూర్ఖుడు, హరిభక్తులతో కూర్చుని హరినామము నోరార పలికినచో వారితో సమానుడైన వాని దోషములన్నియు తొలగిపోవును. అగ్నితో గాలి చేరినచో కట్టెలతో పాటు ప్రక్కనున్న గడ్డి కూడా భస్మమైనట్లు హరిభక్తులతో కలిసియున్న పాపములు నశించును.

**"హరి భక్తులతో మాటలు**
**ధర నెన్నడు జెడని పుణ్యధనముల మూటల్**
**వరముక్తి కాంత తేటలు**
**నరిషడ్వర్గంబు సొరని యురుగు కోటల్"**

ఈ భూమండలముపై హరిభక్తులతో సంభాషణలు చెడిపోనివని, అవి పుణ్యధనముల మూటలని, శ్రేష్ఠమైన ముక్తికాంత యొక్క ప్రసాదములని, షడ్రిపులైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు ప్రవేశింపలేని ఎత్తైన కోటలు శ్రీహరియందు శ్రద్ధా భక్తులతో కోరిన వారికెల్లను కైవల్య పదమతి చేరువయగును. కాని శ్రీహరిని మదిలో దలపని వానికి ఎంత ప్రయత్నించినను మోక్షము లభించదు అన్న విష్ణుదూతల మాటలు అక్షర సత్యములని స్వయముగా యమధర్మరాజు ఇట్లు చెప్పెను. "లెక్కలేనంత మంది విష్ణుదూతలు కళంకము లేని మహాద్భుత తేజస్సును వెదజల్లుచు అంతటా చరించుచుందురు. వారు అతి భయంకరమైన బలశాలురు. ఆ సుందరులైన ధర్మమూర్తులు శాంతస్వరూపులు. అతి సాహసవంతులు. దేవపూజితులైన ఆ విష్ణు దూతలు విష్ణు భక్తులను ఎల్లప్పుడు రక్షించుటకై సిద్ధముగా ఈ జగమంతయు నిండియున్నారు. విష్ణుభక్తులను అకారణంగా శిక్షించే అధికారము నాకు గాని, మీకు గాని, దేవతలకు కాని లేదు. మహాద్భుతమైన వైష్ణవ జ్ఞానము తెలిసినవారు కొందరే. వారిలో బ్రహ్మదేవుడు, శివుడు, కార్తికేయుడు, కపిలుడు, నారదుడు, భీష్ముడు, మనువు, శుకమహర్షి, వ్యాసమహర్షి, బలిచక్రవర్తి, ప్రహ్లాదుడు, జనకుడు మొదలగు పన్నెండుమంది పుణ్యాత్ములకు మాత్రమే ఆ విష్ణువు గురించిన జ్ఞానము కొంతవరకు తెలుసు. అన్యులెవరికీ చిన్మయమూర్తి చిదంబర రహస్యము తెలియదు.

**"పరమ మహాద్భుతమైన వైష్ణవ జ్ఞానంబు**
**తిరముగా నెవ్వడు తెలియగలడు**
**దేవాది దేవుండు త్రిపుర సంహారుడొండె**
**గమల సంభవుడొండె గార్తికేయ**
**కపిల నారదులొండె గంగాత్మజుడొండె**
**మనువొండె బలియొండె జనకుడొండె**
**బ్రహ్మదుడొండె నేర్పాటుగా శుకుడొండె**
**భాసుర తరమతి వ్యాసుడొండె**
**గాక యన్యుల తరమే? యీ లోకమందు**
**నీ సుబోధంబు సద్బోధు మీ పదార్థ**
**మీ సదానంద చిన్మయ మీయ గమ్య**
**మీ విశుద్ధ గుహ్యంబు నీ శుభంబు"**

నాయనలారా! శుభంకరుడైన శ్రీహరి యొక్క నామకీర్తన ఫలమును నేడు మీరే స్వయముగా చూచితిరి గదా! మృత్యువు యొక్క పాశబంధములను ఈ అజామిళుడు ఏ విధముగా వివేకముతో తప్పించుకోగల్గెనో అని యముడు తన భటులతో చెప్పెను. మరియు ఓ దూతలారా! విష్ణుదూతలైన భాగవతుల జోలికి మీరు పోరాదు. వారు ఎట్టివారనిన సనకాది ముని, యోగిజనులకు సదానందమును, భాగ్యోదయమును కలుగజేయువారు భాగవతులు. శ్రీకృష్ణ పదములపై ధ్యానమును, అమృతపానమును చేసి సద్భక్తులుగా పరిగణించువారు భాగవతులు. పాతక సమూహములను దృఢముగా తిరస్కరించి పాఱద్రోలు ప్రక్రియలను ప్రయోగించు నుగ్రమూర్తులు శ్రీభాగవతులు. భక్తిభావము, తత్త్వభావము బాగుగా

తెలిసియున్నవారు భాగవతులు. బ్రహ్మమును గురించి తరచుగా చర్చించుకొనువారు భాగవతులు. సిరులతో నతిశయించుచు ఎన్నడును కీడులేని శుభపదముతో నలరారు వారు భాగవతులు. అందుచేత మీరు విష్ణుభక్తుల జోలికి వెళ్ళరాదు. ఆ శ్రీహరి పవిత్ర పాదపద్మములను పూజించుటకు ఇష్టపడని దౌర్భాగ్యులను అంతము చేయుటకు మీరు వారిని బంధించి తెండు అని యముడు భటులతో పలికెను. మరొక్కమాట వినుడు. అపహాస్యమునకైనను హరిభక్తులను పీడించరాదు. ముఖ్యంగా ఇందిరా రమణుడైన ఆ శ్రీహరి నామము ఉచ్చరింపలేని దుర్భాషితులను, కలలో నైనను శ్రీపతి యొక్క పాదములు చూడని కర్మరతులను, నవ్వుచూనైనా శ్రీకృష్ణభగవానుని సచ్చరిత్ర ప్రశంసలను వినదలచుకొనని దుష్కథా శ్రవణాసక్తులను, తీర్థయాత్రలు, దైవోత్సవాల యందైనను దైవమందిరమునకు పోవుటకు ఇష్టపడని దుష్టవర్తనులను, పరమ భాగవతుల పాదధూళియే సమస్త తీర్థముల సారమని తెలుసుకొనలేని వారిని, వారికి సంబంధించిన వారిని, వారితో కూడిన వారిని (స్నేహం చేసిన వారిని) మొదట బంధించుకొని రండు.




"పద్మనయను మీది భక్తియోగంబెల్ల
ముక్తియోగమనుచు మొదలెఱుంగు
వారి వారి వారి వారి జేరిన వారి
త్రోవ బోవ వలదు దూతలారా!"

శ్రీమహావిష్ణువు యందు భక్తియోగమే ముక్తియోగమని మొదటినుండి నమ్మినవారిని, వారి వారి, వారి యొక్క వారి వారితో చేరిన వారి యొక్క వారి జోలికి పోవలదు అని యముడు పలికిన మాటలను బట్టి చూసినచో హరినామ కీర్తనలకు ఉన్న విశిష్టత తెలుస్తోంది.

తెలిసో తెలియకో మానవులు ఎన్నో తప్పులు చేస్తారు. ఆ పాపాల మూలంగా పుడుతూ చస్తూ ఉంటారు. ఇలా నానా యోనుల్లో జన్మలెత్తుతారు. వీరికి నిష్కృతి లేదా మునీంద్రా అని పరీక్షిత్తు శుకయోగిని అడిగాడు. అప్పుడు శుకమహర్షి మహారాజా! కర్మలు పలుమారు గావిస్తుంటే పూర్వకర్మలు నశించవు. వాటిని అంత తొందరగా త్యజించలేము కూడా. సత్కర్మల మూలంగా సదాచార సంపత్తితో బ్రహ్మచర్యాశ్రమాది నియమాలతో మంచి ఆరోగ్యాన్నిచే ఆహారాన్ని తింటూ హృదయాన్ని వినిర్మలంగా ఉంచుకున్నప్పుడు పాపాలు వాటంతట అవే నశిస్తాయి. తపస్సుతో సత్య ధర్మాది క్రియలో ఇంద్రియాలను అదుపులో పెట్టుకొన్నవాడు సత్కర్మ నిరతుడౌతాడు. ఇంకా కొందరు శ్రీహరిని ఉపాసించి అతనిని సర్వకాల సర్వావస్థల్లో ధ్యానిస్తూ ఉన్నవారు కొందరు. ఇంకా కొందరు అనునిత్యం భగవదారాధనతో శ్రీహరి కథలను వింటూ ఉండి ఆనందం పొందెవారు మరికొందరు. హరినామకీర్తనతో ముక్తి పొందినవాడు అజామిళుడు ఉన్నాడు. అతని వృత్తాంతము వినుము.

అజామిళుడు భారతదేశంలోని కన్యాకుబ్జం అనే నగరంలోని ఒక బ్రాహ్మణ కుటుంబానికి చెందిన సద్బ్రాహ్మణుడు. తాతలు తండ్రులు సంపాదించిన ఆస్తులతో పాటు సకల వేదశాస్త్ర సంపద మెండుగానే సంపాదించాడు. యుక్తవయస్సు రాగానే అతనికి పెద్దలు వివాహం కూడా జరిపించారు. సంసారం – సంస్కారంతో ఆ కాపురం సవ్యంగా సాగుతూ పదిమంది పిల్లలతో ఆ సంసారం సాఫీగా సాగుతున్న సమయంలో ఒకనాడు తండ్రి కోరిక మేరకు పూజకోసం దర్భలు తేవడానికి ఆ నగర సమీపంలో ఉన్న వనానికి వెళ్ళాడు. అక్కడ పూపొదల మాటున మద్యం మత్తులో పడి వున్న అందమైన సుందరాంగిని చూసి కామం మత్తులో కళ్ళు మూసుకొనిపోయి ఆ సుందరాంగియే సర్వస్వమని భావించి ఆమెతోనే కాపురం కొనసాగించాడు. అన్ని దుర్వ్యసనాలకు దాసుడై తల్లితండ్రులను, ఆలు పిల్లలను వదిలి, పంచ సంస్కారాలను త్యజించి ఆ వేశ్యాకాంతయే సర్వంగా భావించి తాతలనాటి ఆస్తుల్ని ఖర్చు చేసేశాడు. కాలంతో వయసు కరిగిపోసాగింది. అజామిళుడి యౌవనం కరిగిపోయి వృద్ధాప్యం ఆవరించి శరీరం ముడతలు పడ్డాయి. పండ్లు ఊడిపోయి రోగగ్రస్తుడై మరణం సంభవించే సమయంలో పిల్లలు, బంధువులు అందరూ వచ్చారు. కాని అజామిళుడి చిన్న కుమారుడు కనబడలేదు. చిన్న కుమారుడు నారాయణుడు అంటే అతనికి మక్కువ ఎక్కువ. అందుకే చివరి క్షణాల్లో కుమారుని పేరు నారాయణా! అంటూ మరణించాడు అజామిళుడు. అంతకుముందే అచటికి వచ్చిన యమదూతలు అతని ప్రాణాలను పాశముతో బంధించి నరకలోకానికి గొనిపోవ నిశ్చయింప విష్ణుదూతలు వచ్చి అజామిళుని ప్రాణాలను వైకుంఠానికి తీసుకొనిపోవ నిశ్చయించారు. ఇతడు మహాపాపి కావున నరకలోకానికి తీసుకునిపోవాలని యమదూతలు విష్ణుదూతలతో వాగ్వాదానికి దిగారు. అప్పుడు విష్ణుదూతలు ఇట్లనిరి.

"బిడ్డ పేరు బెట్టి పిలుచుట విశ్రామ
కేళినైన మిగుల గేలికైన
పద్య గద్య గీత భావార్థములనైన
గమల గర్భు దలుప గలుష హరము"

కాబట్టి ఇతనికి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని విష్ణుదూతలు అజామిళుని వైకుంఠానికి గొనిపోయారు. దీనిని బట్టి నామకీర్తనకు ఎంతటి పవిత్రత ఉందో అర్థమవుతుంది.

# ముక్కోటి ఏకాదశి

– ఎస్. ధర్మారావు

**ముక్కోటి దేవతలు శ్రీ వైకుంఠంలో చేరి శ్రీమన్నారాయణుని సేవించుకునే పర్వదినమే ముక్కోటి ఏకాదశి. సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన తర్వాత వచ్చే శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశిగా పిలుస్తారు. వైకుంఠ ఏకాదశి నాడు భక్తి శ్రద్ధలతో ఎవరైతే ఉపవాసముండి భగవన్నామ సంకీర్తనం, జాగరణతో గడుపుతారో వారికి తప్పక మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం.**

ఈ ఏకాదశిని మోక్షదాగా వేదవ్యాస మహర్షి కీర్తించారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు శేషశయ్యపై జగద్రక్షణ చింతనా పరమైన యోగనిద్రలో నున్న శ్రీమహావిష్ణువు నాలుగు నెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేల్కొని బ్రహ్మాది దేవతలకు దర్శన భాగ్యం ప్రసాదించే పర్వదినం ఇదని సృష్ట్యాదిలో విశ్వసృష్టికి సంకల్పం చేసిన రోజని శాస్త్రాలు చెబుతున్నాయి.

భగవద్దర్శనం కోసం పరితపించే దేవతలందరూ ఈ నాలుగు నెలలు దీక్షతో చాతుర్మాస్య వ్రతంగా ఆచరిస్తారని ''యత ధర్మ సముచ్చయం'' అనే ధర్మశాస్త్రం చెబుతోంది. సకల జీవరాశులలో విష్ణురూపంగా, అంతర్యామిగా ఉన్న పరమాత్మకు విశ్రాంతి (యోగ కాలమైనా ఈ నాలుగు మాసాలలో అందరూ దైవ చింతనతో ఉండాలని ''ఆర్షవాణి'' బోధిస్తుంది). అందుకే యతీశ్వరులు, సన్యాసులు తమ నిత్య సంచారం మానివేసి ఏదో ఒక పవిత్రమైన చోట జప తపాదులతో ఈ వ్రతాన్ని ఆచరిస్తారు.

చాతుర్మాస్య వ్రతానికి ఫలంగా వచ్చే మార్గశిర శుద్ధ ఏకాదశియే ఈ ముక్కోటి ఏకాదశి. సంక్రమణాన్ని అనుసరించి ఒక్కొక్కసారి పుష్యశుద్ధ ఏకాదశి నాడు కూడా ఈ ఉత్సవాన్ని ఆచరిస్తారు. పరమ పవిత్రమైన ఈ రోజున ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై వేంచేసి యున్న శ్రీమహావిష్ణువును ఎవరైతే సేవిస్తారో వారికి భగవదనుగ్రహం, మోక్షం తప్పక కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. ఉత్తర ద్వార దర్శనం వల్ల జన్మరాహిత్యం, మోక్షం తప్పక కలుగుతాయని ''పరమ పురుష సంహిత'' అనే ఆగమ శాస్త్రం తెలుపుతోంది. అల వైకుంఠపురములో, నగరిలో ఆమూల సౌధంబులో అని మహాభాగవతంలో పోతన అన్నట్లు ధ్రువ మండలానికి ఈశాన్యముగా బ్రహ్మాండానికి ఆవలన త్రిపాద్విభూతిగా వేదం కీర్తించిన శ్రీ వైకుంఠంలో శ్రీమహావిష్ణువు ఉత్తర ద్వార ముఖంగానే పరివేష్ఠించి ఉంటాడని ''అర్చిరాది'' గ్రంథంలో ఉంది. ''స్వస్తిక'' గృహం వలే నాలుగు ద్వారాలతో విరాజిల్లే శ్రీ వైకుంఠ భవనానికి ఉత్తర ద్వారం నుంచే శ్రీమన్నారాయణుని సేవించాలని నిర్ణయించడం జరిగింది. ఉత్ + తర = ఉత్తర అనగా బ్రహ్మాండమును తరింపచేసే



విష్ణు పదములను పొందించునది అని అర్థము. సాధకుడగు పురుషుడు స్నాన సంధ్యా వందనాది నిత్య కర్మానుష్ఠానంబు సలిపి కల్పోక్త ప్రకారంగా నానా విధ వేద మంత్రములు చేతగాని, పురుషసూక్తము చేతగాని శ్రద్ధా భక్తి యుక్తుండై పూజ చేయవలెను. ఎలాగంటే ప్రథమ మందు పంచామృత స్నానం గావించి ఆ పిమ్మట శుద్ధోదకముచే అభిషేకమొనర్చి మహావిష్ణువును సర్వ వస్త్రములచే అలంకరించి నానా విధములగు పుష్పముల చేతను, ధూప దీపాదులచే పూజించి భక్తి పురస్సరముగా నైవేద్యము నిచ్చి దక్షిణ తాంబూలములను సమర్పించి ఆ పిదప కర్పూర నీరాజనములు సమర్పించవలయును.

లోకమునందు ఎవ్వరేనియు ఈ ప్రకారము పూజ గావించుచుందురో వారలు సకల పాపాలచే విడువబడి సమస్త సంపత్సమృద్ధి గలిగి మిగుల జయశాలురై యుందురు. పూజ చేసిన తర్వాత సంతుష్టుడు గానున్నూ స్వచ్ఛమైన మనస్సు గలవాడున్నూ కాగలడు.

పూజ కాలము నందు ధూప, దీపములు చేసినవాడు గంగా స్నాన ఫలము పొందును. పాపము గల వారెవ్వరైననూ నీరాజనమును చూచినట్లైతే వాని పాపమంతయు నిప్పులో పడిన పత్తిపోగు వలె మండిపోవును. ఎవరు నీరాజనమును నేత్రములయందు, శిరస్సునందును అద్దుకొనునో వారికి విష్ణు లోకము కలుగును.

**సర్వేజనాః సుఖినో భవంతు**

# నాచ్చియార్ కోవిల్

**– శ్రీమతి వెలమకన్ని పద్మావతి**



ఈ ఆలయంలో అమ్మవారిదే పైచేయి. అమ్మవారే ప్రాధాన్యత. తొలిపూజ ఆమెకే. తొలి నైవేద్యం కూడా ఆమెకే. ఆ తరువాతే అయ్యవారికి. ఉత్సవాలు, ఊరేగింపులలో కూడా అమ్మవారు ముందు గాను, ఆ వెనుక అయ్యవారు ఊరేగుతారు. గర్భగుడిలో కూడా అమ్మవారి విగ్రహం కొంచెం ముందుకు ఉంటుంది. ఈ గుడిలో అమ్మవారి విగ్రహంలో నడుముకు వేలాడుతూ, ప్రస్ఫుటంగా కనిపిస్తుండే తాళాలగుత్తి – ఈ గుడిలో పెత్తనం నాదే – గుడి పేరు కూడా నాదే అని చెప్పకనే చెప్తున్నట్లుగా ఉంటుంది. నిజమే! ఈ ఆలయం నాచ్చియార్ కోవిల్ గా ప్రసిద్ధి చెందింది. ఇదే ''తిరు నరయూర్ నంబి'' ఆలయం. ఈ ఆలయంలో అన్నీ అద్భుతాలే. అన్నీ అసాధారణ విషయాలే. ఈ విశేషాల గురించి ఇప్పుడు తెల్సుకుందాం.

తమిళనాడు రాష్ట్రంలో కుంభకోణం అనే పట్టణానికి 9 కిలోమీటర్ల దూరంలో ''తిరునరయూర్'' అనే గ్రామం ఉంది. ఈ గ్రామంలో విష్ణుమూర్తి ''నారాయణ నంబి'' అనే పేరుతో కొలువై ఉన్నాడు. 108 దివ్యదేశాలలో ఇది 14వ దివ్యదేశం. ఇక్కడి తీర్థం మణిముక్తానది. వైష్ణవులు ముక్తిక్షేత్రాలుగా భావించే 12 క్షేత్రాలలో ఇది ఒకటి. ఈ ఆలయాన్ని ''తిరునరయూర్ నంబి ఆలయం'', ''నారాయణ నంబి ఆలయం'', ''కాల గరుడ ఆలయం'', ''నాచ్చియార్ కోవిల్'' అని పిలుస్తారు. అమ్మవారి పేరు మీదే నాచ్చియార్ కోవిల్ గా ఈ ఆలయం ప్రాచుర్యం పొందింది.

అమ్మవారికి ఈ ఆలయంలో ప్రథమ ప్రాధాన్యత లభించడానికి, అయ్యవారి కంటె పై చేయిగా ఉండడానికి ఒక పురాణ గాథ ప్రచారంలో ఉంది. పూర్వం మేధావి మహర్షి, విష్ణుమూర్తి తనకు అల్లుడు కావాలని ఆకాంక్షించాడు. తన కోరిక నెరవేరాలంటే లక్ష్మీదేవి తన కూతురుగా జన్మించాలి. కాబట్టి లక్ష్మీదేవి అనుగ్రహం కోసం, ఈ ఆలయం వున్న ప్రాంతంలో వంజుల వృక్షం కింద తీవ్రమైన తపస్సు చేశాడు. తపస్సుకి మెచ్చి లక్ష్మీదేవి చిన్న పాప రూపంలో వంజుల వృక్షం కింద ఋషికి దర్శనమిచ్చింది. ఆనందంగా ఆ పాపను స్వీకరించిన ఋషి ఆమెకు వంజులాదేవి అని పేరు పెట్టి తన ఆశ్రమంలో అల్లారుముద్దుగా పెంచసాగాడు. వైకుంఠంలో లక్ష్మీదేవి కనిపించక పోవడంతో విష్ణుమూర్తి ప్రద్యుమ్న, సంకర్షణ, అనిరుద్ధ, పురుషోత్తమ, వాసుదేవ – అనే అయిదు రూపాలలో భూలోకానికి వచ్చి అన్ని దిక్కులలోను లక్ష్మీదేవి గురించి వెతికారు. కానీ ఫలితం దక్కలేదు. అప్పుడు లక్ష్మీదేవిని అన్వేషించే బాధ్యతను తన వాహనమైన గరుడునికి అప్పగించాడు. గరుడుడు భూలోకానికి వచ్చి, మేధావి మహర్షి ఆశ్రమంలో పెరుగుతూ ఉన్న లక్ష్మీదేవిని గుర్తించి, ఆ వార్తను విష్ణుమూర్తికి చేరవేశాడు. అప్పుడు విష్ణుమూర్తి మేధావి మహర్షి ఆశ్రమానికి వచ్చి, నీవు పెంచుతున్న కన్యను నేను పెళ్ళి చేసుకొంటాను అని అడిగాడు. ఋషి కోరిక కూడా అదే కనుక వెంటనే సమ్మతించాడు. కానీ, పెళ్ళయ్యాక వారిద్దరూ ఇక్కడే ఉండాలనీ, వివాహం అయిన తర్వాత తన కూతురిదే పైచేయిగా ఉండాలనీ, ఆమెకే పెత్తనం ఉండాలనీ, ఆమెకే ప్రాధాన్యత ఇవ్వాలనీ షరతు విధించాడు. ఆ షరతుకి అంగీకరించి, విష్ణుమూర్తి ఆమెను వివాహం చేసుకొన్నాడు. ఈ ఘట్టానికి నిదర్శనంగా లక్ష్మీదేవి – విష్ణుమూర్తి ఇక్కడ వెలశారు. అందుకే ఈ ఆలయంలో అమ్మవారికే ప్రాధాన్యత వుంటుంది. అన్నింటా అమ్మవారిదే పైచేయిగా ఉంటుంది. ఈ విషయం భక్తకోటికి అర్థమయ్యేలా చెప్పడానికి అన్నట్లుగా అమ్మవారి నడుముకు వేలాడుతూ తాళంగుత్తి ప్రస్ఫుటంగా దర్శనమిస్తుంది. అసలు ఈ ఆలయమే ''నాచ్చియార్ కోవిల్''గా పిలువబడుతోంది.

వీరి వివాహం చేసిన బ్రహ్మగారి విగగ్రహంతో పాటు ప్రద్యుమ్న–అనిరుద్ధ–సంకర్షణ–పురుషోత్తమ–వాసుదేవ విగ్రహాలు కూడా గర్భగుడిలో కొలువై ఉంటాయి.

ఈ ఆలయానికి సంబంధించిన మరొక విశేషం ఏమిటంటే బయటినుంచి చూస్తున్నప్పుడు ఈ వైష్ణవ ఆలయం శివాలయంలా గోచరిస్తుంది. చోళరాజు కుజంగనన్ మహా శివభక్తుడు. ఇతడు 70 శివాలయములు నిర్మించాడు. విష్ణుమూర్తిని దర్శించాలనే కోరికతో విష్ణువును ప్రార్థించాడు. విష్ణుమూర్తి ఈ రాజుకి దర్శనమిచ్చి, తనకు ఆలయం నిర్మించమని ఆదేశించాడట. 70 శివాలయాలు నిర్మింపచేసిన ఆ రాజు అలవాటుగా అదే బాణీలో ఈ ఆలయాన్ని కూడా నిర్మించాడట. అందుకే ఈ ఆలయాన్ని బయటి నుంచి చూస్తే శివాలయమా అనే భావన కల్గుతుంది.

తరువాతి కాలంలో తంజావూర్ కు చెందిన రఘునాథ నాయకన్ అమ్మవారికి మండపం నిర్మించారు.

ఈ ఆలయంలో కొలువై ఉన్న నారాయణ నంబి ఎంతటి భక్తపరాయణుడో అర్థం చేసుకోవాలంటే తిరుమంగై ఆళ్వార్ కథ మనం తెల్సుకోవాలి. తిరుమంగై ఆళ్వార్ కుముదవల్లిని పెళ్ళి చేసుకోవాలని ఆకాంక్షించాడు. కుముదవల్లి పరమ వైష్ణవ భక్తురాలు. 1008 వైష్ణవులకు భోజనం పెట్టాలనీ, పంచసంస్కారాలు గురువుగారితో చేయించుకోవాలనీ, ఆ తరువాతే తాను అతనిని వివాహ మాడుతాననీ కుముదవల్లి ప్రకటించింది. 1008 మంది వైష్ణవులకు భోజనం పెట్టిన తిరుమంగై ఆళ్వార్ గురువు లభించక పంచసంస్కారాల కోసం ఈ ఆలయంలోని నారాయణ నంబినే ఆశ్రయించి దీనంగా ప్రార్థించాడు. నువ్వే నాకు గురువుగా వ్యవహరించు అంటూ మరల – మరలా అర్థించాడు. అప్పుడు నారాయణ నంబి స్వయంగా శంఖు చక్ర ముద్రలను తిరుమంగై ఆళ్వారుకు అనుగ్రహించాడు.

ఈ ఆలయంలో గరుడునికి సంబంధించిన ఎన్నో అద్భుతాలు ఉన్నాయి. గరుడునికి ఈ గుడిలో విశేష ప్రాధాన్యత ఉంది. గరుత్మంతుడు అదృశ్య రూపంలో ఈ ఆలయంలో సంచరిస్తాడనే విశ్వాసం భక్తులలో నెలకొని ఉంది. భూలోకంలో లక్ష్మీదేవి ఉనికిని తెల్సుకొని విష్ణుమూర్తికి ఎరుక పర్చినందుకు ఆనందభరితుడైన స్వామి – "నా బదులుగా భక్తులను నువ్వే ఆశీర్వదించు" అని గరుడునికి ఆనతి ఇచ్చారట. ఇందుకు నిదర్శనంగా గరుడుని భారీ విగ్రహం గర్భగుడి ముందు మనకు దర్శనమిస్తుంది. ఇది సాలగ్రామ శిలా విగ్రహం. "కాలగరుడన్"గా ఈ విగ్రహాన్ని పిలుస్తారు. వివాహం ఆలస్యమవుతున్నవారు, గ్రహపీడితులు, నాగ – సర్ప – రాహు – కేతు – కుజ గ్రహ దోష నివారణకు, నవగ్రహ దోష పరిహారానికి ప్రతి గురువారం విశేషంగా ఈ కాలగరుడునికి పూజలు చేయించుకుంటారు.

ఈ గరుడ విగ్రహానికి సంబంధించి మరొక వింత విషయం మనం తెలిసికొందాం. ఈ విగ్రహాన్ని శిల్పి చెక్కుతున్నప్పుడు మొదట లోహంతో విగ్రహాన్ని తయారు చేశారట. శిల్పం పూర్తయ్యాక, రెక్కలు అతికించగానే ఆ విగ్రహం పక్షిలా మారి పైకి ఎగిరిపోయేదట. మళ్ళీ మళ్ళీ అలాగే జరగడంతో విసిగిపోయిన శిల్పి, నల్లరాతిపై గరుడ విగ్రహాన్ని చెక్కి "రాయిగా పడి వుండు" అన్నాడట. "నాకు కావల్సింది కూడా ఇదే" అని బదులు పలికేడట గరుడుడు.

గరుడునికి సంబంధించిన మరో వింత ఏమిటంటే, విగ్రహానికి పట్టే చెమటలు. ఉత్సవ సమయాలలో ఊరేగింపుకి గరుడుడు బయటకు వెళ్ళినప్పుడు చెమటలతో తడిసిపోతాడు. శుభ్రమైన పొడి వస్త్రాలతో అలంకరింపబడే గరుడుడు ఊరేగింపు పూర్తయి గుడిలో యథాస్థానానికి చేరేటప్పటికి, బట్టలన్నీ కూడా స్వేదంతో తడిసి ముద్ద అయిపోతాయట. దీనికి శాస్త్రీయమైన కారణాలు ఏమిటో ఇప్పటికీ తెలియరావడం లేదు.

గరుడ విగ్రహానికి సంబంధించి మరో అద్భుతమైన విషయం, ఊరేగింపుకు బయటకు వెళ్ళేటప్పుడు విగ్రహం బరువు అనూహ్యంగా అంచెలంచెలుగా పెరిగిపోవడం. అలాగే తిరిగి గుడిలోనికి యథాస్థానానికి వచ్చేటప్పటికి అంచెలంచెలుగా బరువు యథా స్థితికి వస్తుండటం. ఉత్సవాల సమయంలో ఊరేగింపుకు గుడినుండి బయల్దేరేటప్పుడు నలుగురు వాహకులు విగ్రహాన్ని తీసుకొని రాగలుగుతారు. మొదటి ప్రాకారం చేరేటప్పటికి ఎనిమిది మంది, తర్వాత 16 మంది, తర్వాత 32 మంది, అలా పెరుగుతూ 64 మంది, 128 మంది, పురవీధుల్లో ఊరేగినప్పుడు 200 మంది వాహకులు అంచెలంచెలుగా పాలు పంచుకుంటారు. తిరిగి గుడిలోనికి వచ్చేటప్పుడు గరుడుని భారం అంచెలంచెలుగా తగ్గుతూ వాహకుల సంఖ్య కూడా తగ్గుతుంది. గుడిలో యథాస్థానానికి చేరేటప్పటికి విగ్రహం బరువు కూడా యథాస్థితికి వస్తుంది.

ఇలా గరుడ విగ్రహానికి చెమటలు పట్టి బట్టలు తడిసి ముద్ద అయిపోవడానికీ, ఊరేగింపుకి బయటకు వెళ్ళేటప్పుడు అంచెలంచెలుగా బరువు పెరగడానికి, తిరిగి ఆలయానికి వచ్చేటప్పుడు అంచెలంచెలుగా బరువు తగ్గడానికీ, కారణాలు ఏమిటో ఎవరి ఊహకు కూడా అందడం లేదు. ఉత్సవాల సమయంలో అమ్మవారు హంస వాహనంపై ఊరేగుతారు. హంస మందగమనంతో నెమ్మదిగా వెళ్తుంది. గరుడునికి వేగం ఎక్కువ. కానీ అమ్మవారిని దాటి ముందుకు వెళ్ళకూడదనే షరతు అమలు చేయడానికి, గరుడుడు ఇలా బరువు పెంచుకొని తన వేగాన్ని నియంత్రించుకొంటాడని కొందరి అభిప్రాయం.

గరుడుడికి సంబంధించిన మరో మహా అద్భుతాన్ని మనం ఈ ఆలయంలో గమనించవచ్చు. సాధారణంగా గరుడునికీ, సర్పాలకూ జాతి వైరం ఉంటుంది. కానీ ఈ గుడిలో గరుడుడు నవ సర్పరాజాలను తన ఆభరణాలుగా ధరించి దర్శనమిస్తాడు. శంఖపాలనాగు కిరీటంగాను, కర్కోటకుడు పూలదండగాను, ఆదిశేషుడు కంకణంగాను, కాళియనాగు కుడిచేతి గాజుగాను, మహాపద్మనాగు ఎడమచేయి గాజుగాను, వాసుకి జంధ్యం గాను, పద్మనాభ సర్పం కుడిచెవి ఆభరణంగాను, అనంతుడు కంఠాభరణంగాను, తక్షకుడు వడ్డాణం గాను అమరి గరుడుడికి అలంకార శోభను సమకూరుస్తున్నాయి.

మార్చి ఏప్రిల్ నెలల మధ్య ఈ ఆలయంలో గరుడసేవ అతి వైభవంగా జరుగుతుంది. డిసెంబర్ జనవరి నెలల మధ్యలో పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు ఈ ఆలయంలో విశేషంగా జరుగుతాయి.

# మాండవ్య మహర్షి తెలిపిన న్యాయం

– కౌతా నిర్మల

**బాల్యం లోని పిల్లలకు మంచేమిటో, చెడేమిటో తెలియదు. కొంత వయస్సు పెరిగే వరకూ మంచి చెడుల విచక్షణా జ్ఞానం వారికి ఉండదు. నిజానికి చిన్నారులు చేసే పొరపాట్లను సరిదిద్దవలసిన బాధ్యత పెద్దలదే. వారు చేసే తప్పులు, పిల్లలు తెలుసుకునేటట్లుగా బోధిస్తూ, మరోసారి వారు ఆ తప్పు చేయకుండా శిక్షణ నివ్వడం తల్లి తండ్రుల కర్తవ్యం. యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం ఉన్న పెద్దలు, పిల్లల తప్పులకు విధించే శిక్ష అన్యాయం కాదనీ, తాము చేసేది తప్పనే ఆలోచన బాల్యంలోని పిల్లలకు ఉండదనీ, మహాభారతంలోని ఒక కథ స్పష్టం చేసింది.**



పూర్వం మాండవ్య మహర్షి అనే వేద వేదాంగములను అభ్యసించిన మహా పండితుడు ఉండేవా డు. అతడు గొప్ప తపోధనుడు. పుణ్యక్షేత్రాలన్నింటినీ దర్శించాడా ముని. ఆ మహర్షి ఒక ప్రశాంతమయిన ప్రదేశంలో పచ్చని చెట్లతో ప్రకృతి రమణీయంగా ఉన్న చోట తన ఆశ్రమాన్ని నిర్మించుకున్నాడు. ఆ ఆశ్రమ ప్రాంగణంలోని ఒక పెద్ద వృక్షం క్రింద తపస్సును ప్రారంభించాడు మాండవ్యుడు. ఆ ముని పరిసరాలను విస్మరించి, ఏకదీక్షతో, ఏకాగ్రతతో, బాహ్యస్మృతి లేకుండా తపస్సు చేయసాగాడు. ఆ సమయంలో ఆ దేశపు రాజుగారి కోటలోకి ప్రవేశించిన దొంగల ముఠా ఖజానాలోకి ప్రవేశించి కోశాగారాన్ని ఖాళీ చేశారు. రాజభటుల కన్ను కప్పి పారిపోయి, మాండవ్యముని ఆశ్రమానికి చేరుకున్నారు.

దొంగలను వెతుకుతూ రాజభటులు మాండవ్య మహర్షి ఆశ్రమం వైపు వచ్చారు. అక్కడ తపమాచరిస్తూ ఉన్న మాండవ్యమునిని చూసి రాజుగారి ధనాగారాన్ని దోచుకున్న దొంగలు ఇటువైపుగా వచ్చారని, వారు ఎటు వెళ్ళారని ఆ మునిని అడిగారు. తపోదీక్షలో ఉన్న మాండవ్యుడు ఆ దొంగలను గురించి రాజభటులకు సమాచారాన్ని ఇవ్వలేకపోయాడు. ఆ ఆశ్రమంలో చాటున నక్కిన దొంగలు రాజభటుల రాకను గమనించారు.



తాము దొంగిలించిన సంపదను ఆశ్రమంలోనే వదలి అక్కడనుంచి పారిపోయారు. ఖజానాలో కొల్లగొట్టబడిన సంపదంతా ఆశ్రమంలో కనిపించడంతో రాజభటులకి ఆ దొంగతనంలో ఆ మహర్షికి కూడా భాగం ఉందేమోనన్న అనుమానం ఏర్పడింది. ఆ సంపదనూ, మాండవ్య మహర్షినీ కూడా రాజుగారి ముందు హాజరు పరిచారు.

మరికొంత కాలానికే రాజుగారి ఖజానా సంపదను దోచుకున్న దొంగలు పట్టుబడ్డారు. ఆ దొంగలకు రాజుగారు మరణశిక్ష విధించారు. ఆ దొంగలకు ముని సహకరించి ఉంటాడన్న అనుమానంతో రాజుగారు మాండవ్యుని వీపులో శూలాన్ని గుచ్చి ఉంచమన్న శిక్షను విధించాడు. ఆ మాండవ్య మహర్షి తాను చేయని తప్పుకు మౌనంగా శిక్షను అనుభవించసాగాడు. ఆ శిక్షను అనుభవిస్తూ కూడా మాండవ్య మహర్షి తన తపోదీక్షను విడిచిపెట్టలేదు. నిరపరాధి అయిన ఆ మహర్షికి రాజుగారు బాధాకరమయిన శిక్షను విధించారన్న విషయాన్ని తెలుసుకున్న ఆ వనంలో తపస్సు చేస్తున్న ఎందరో మునులు పక్షుల రూపంలో వచ్చి ఆయనను దర్శించుకోసాగారు. ఆయన చుట్టూ ప్రదక్షిణలు చేశాయా పక్షులు.

ఆ విషయం గురించి తెలుసుకున్న రాజుగారికి ఆ మహర్షి అపరాధం చేసి ఉండడన్న ఆలోచన కలిగింది. శూలం గుచ్చుకుని కూడా ఆయన తన తపస్సును కొనసాగించడం చూసిన రాజుగారికి ఆయన మహాత్ముడు అయి ఉంటాడన్న నమ్మకం కలిగింది. మాండవ్య మహర్షిని వెంటనే విడుదల చేయమని ఆదేశించాడు. తాను ఆయనను అపార్థం చేసుకుని అనుమానంతో శిక్ష విధించానని, ఆయనలోని గొప్పతనాన్ని తెలుసుకోలేకపోయాననీ, అందుకు తనను క్షమించమని ఆ మహర్షిని వేడుకున్నాడా రాజు. మాండవ్య మహర్షి శరీరంలోంచి శూలాన్ని బయటకు తీసే సమయంలో ఆ శూలం యొక్క అణి (శూలం మొన) ఆ మహర్షి దేహంలోనే ఉండిపోయింది. ఆ కారణంగా ఆ మహర్షికి అణి మాండవ్యుడు అన్న పేరు ఏర్పడింది.

స్వేచ్ఛ పొందిన మాండవ్య మహర్షి ''ఇదంతా జరగడం నా పాపకర్మ ఘోరం అయి ఉంటుంద''ని తలుస్తూ, అక్కడనుండి వెళ్ళిపోయి తిరిగి తన తపస్సును ఆరంభించాడు. కొంతకాలం గడిచిన తర్వాత మాండవ్య మహర్షి నరక లోకాధిపతి అయిన యమధర్మరాజును కలుసుకున్నాడు. అప్పుడాయన యముడిని ఇలా ప్రశ్నించాడు. ''యమధర్మరాజా! అంత భయంకరమైన శిక్షకు గురవటానికి నేను చేసిన పాపమేమిటో వివరించగలరా'' అన్నాడు.

యముడు ఆ మహర్షితో ఇలా అన్నాడు. ''మహర్షీ! మీరు మీ చిన్నతనంలో తూనీగలను పట్టుకుని వాటి రెక్కలకు ముళ్ళు గుచ్చి, అవి బాధపడుతుంటే ఆనందించేవారు. మీరు మీ బాల్యంలో చేసిన ఆ తప్పుకి, ఆ పాపానికి ఫలితమే మీరు శూలదండన అనుభవించవలసి వచ్చింది''.

ఆ మాటలు విన్న మాండవ్యమునికి ఆగ్రహం కలిగింది. ''నరకాధిపతీ! చిన్న వయసు లోని పిల్లలకు మంచేమిటో చెడేమిటో తెలుసుకునే విచక్షణా జ్ఞానం కానీ, తాము చేస్తున్నది తప్పనికానీ తెలియదు. ధర్మమేమిటో తెలిసిన యమధర్మరాజు మీరు. అలాంటి చిన్నపిల్లల తప్పులను పాపంగా భావించి, కఠిన శిక్షను విధించడం అన్నది న్యాయమేనా? ఇకనుండి 10 సంవత్సరాల లోపు పిల్లలు తప్పు చేస్తే వారిని క్షమించాలి. అలా కాదని పిల్లలకు పెద్దవారికి విధించే శిక్షలకు గురి చేయడం చేయరాదు. అలా శిక్షించే వారికే పాపాలు చుట్టుకుంటాయి. ''యమధర్మరాజా, మంచీ చెడూ తెలుసుకోలేని వయస్సులో నేను చేసిన తప్పుకు ఇంతటి కఠిన శిక్ష నేను అనుభవించేలా చేసిన నువ్వు భూలోకంలో మానవ జన్మను పొందెదవు గాక'' అని మాండవ్యముని యముడిని శపించాడు.

ఆ మహర్షి శాప ఫలితంగా యమధర్మరాజు భూలోకంలో విదురునిగా జన్మించాడు. భారతీయ సంప్రదాయం ప్రకారం 10 సంవత్సరాల లోపు పిల్లలు చేసే తప్పులను, వారు తమ తప్పులను, పొరపాట్లను తెలుసుకునే విధంగా తల్లితండ్రులు వారికి బోధించాలి. మరెన్నడూ వారా తప్పును చేయకుండా పిల్లల ప్రవర్తనను సరిదిద్దాలి. పిల్లల తప్పులకు కఠినంగా శిక్షించకూడదు. వారికి స్వల్ప మందలింపు, దండనతో వారిని మార్చాలి పెద్దలు.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథ యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము.**
(హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)


**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

**అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు స్త్రీల వలన పురుషులకు, పురుషుల వలన స్త్రీలకు కొన్ని కుటుంబంలో అవరోధములు కలిగి ఉన్నారు. ఎవరితోనైనా చాలా జాగ్రత్తగా ఉండాలి. చనువుగా ఉన్నారా సమస్యలలో పడగలరు. వృథాగా ఎవరితో కలవరాదు. అధికారుల అనుకూలత. దైవప్రార్థన చేయండి.

## వృషభరాశి

**కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు నూతన వ్యక్తుల పరిచయంలో కొన్ని సమస్యలు. ఎవరినీ నమ్మరాదు. శుభకార్య ప్రయత్నములు ఫలించుట. గృహ అవసరమునకు డబ్బు ఖర్చు చేయుట. ఇతరులను నమ్మరాదు. గ్రహారాధన చేయండి.

## మిథునరాశి

**మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు ఆదాయ వనరులు కలిగి ఉన్నారు. ఏకాగ్రత కలిగి ఇతరుల గురించి ఆలోచన చేయక నమ్మకంతో, పట్టుదలతో మీరు చేయు జీవన విధానంలో అద్భుతమైన మార్పు. పదిమందికి మంచి చేస్తూ ధన సంపాదన కలిగి ఉంటారు. అమ్మవారి పూజలు సంతృప్తి నివ్వగలవు.

## కర్కాటకరాశి

**పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు చాలా జాగ్రత్తలు తీసుకొనవలసిన సమయం. ఆదాయ వనరులు ఉన్నవి. శత్రుత్వం ఉన్నది. నాలికను అదుపులో పెట్టుకొనవలసిన రోజులు. గౌరవానికి భంగం కలుగు విధంగా మీకు బాధ కలిగే విధంగా మాట్లాడగలరు. ఓం నమో నారాయణాయ జపం చేయండి.

## సింహరాశి

**మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము**

ఈ రాశి స్త్రీ పురుషులకు అవసరములకు తగిన ఆదాయవనరులు ఉంటాయి. నిలిచిపోయిన పనులు పూర్తిచేయగలరు. స్త్రీల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నను చులకనగా మాట్లాడిన ఏదో వాదోపవాద ప్రతివాదనలు ఉంటాయి. దైవారాధన చేసిన సమస్యలు తొలగును.

## కన్యారాశి

**ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆర్థికంగా కొంత ఇబ్బంది పడవలసిన రోజులు. విందులు, వినోదములు, వివాహ ప్రయత్నములు ఫలించును. ప్రతి విషయంలో అర్థం కాని విధంగా ఉంటుంది. చిక్కులు చికాకులకు తావు ఇవ్వకండి. బంధువులలో అనారోగ్య సూచనలు. నవగ్రహ ప్రదక్షిణలు, దానాలు ఇవ్వండి.

## తులారాశి

**చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులు శుభకార్యములు వాయిదా వేయరాదు. కొన్ని విషయములలో చాలా మెలకువగా ఉండగలరు. కార్యము పట్ల తలదించి నడుచుకొనగలరు. పెద్దవారి మాటలు సంతృప్తిని ఇవ్వగలవు. ప్రేమ అభిమానములకు పెద్ద పీట వేయండి. గర్వమును బయటకు రానీయకండి. ఇష్టదేవతా ఆరాధనలు చేయండి.

## వృశ్చికరాశి

**విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. బయట ప్రశాంతంగా ఉంటూ చాలా తక్కువగా మాట్లాడవలెను. భార్యాభర్తల మధ్య అగాధం ఉంటుంది. వివాహ ప్రయత్నములు కలిసి వస్తాయి. ప్రయాణంలో అలసటగా ఉంటుంది. నవగ్రహారాధన అవసరం.

## ధనూరాశి

**మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. కొన్ని బాకీలు తీర్చగలరు. మీలో ప్రయత్న లోపం ఉన్నది. మీరు మారండి. మాటలతో కాలయాపన చేయరాదు. ధనాదాయం ఉన్నది. ధనం లోటులేదు. మీ నిర్లక్ష్యం తొలగించుకొని ముందుకు సాగండి. చండి హోమము చేయండి. విజయవాడ కనకదుర్గాదేవి దర్శనం. చండి హోమం చేయించండి.

## మకరరాశి

**ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు**

ఈ రాశి స్త్రీ పురుషులకు పరీక్ష కాలం. కత్తి మీద సాములాగ ఉంటుంది. ధనం చేతి నుంచి జారిపోవును. నిర్లక్ష్యం, ఏమాత్రం ఆదమరచినా ఇబ్బందులు తప్పవు. జ్ఞాపకశక్తిపైన కొన్ని ఇబ్బందులు ఉన్నవి. పిల్లలపైన కోపతాపములు ఉండగలవు. భార్య మాట వినండి. ఇష్ట దైవ ప్రార్థనలు కొంతవరకు కాపాడగలవు. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## కుంభరాశి

**ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలంగా ఉంటుంది. ప్రగతిపథంలో ఉండగలరు. ఉద్యోగస్తులపైన ఏసీబీ దాడులు వివాహ ప్రయత్నములు ఫలించగలవు. అన్ని రంగముల వారికి సాఫీగా జరిగిపోతుంది. తీర్థయాత్రలు చేయుటకు ప్రయత్నం ఉన్నది. నవగ్రహ ఆరాధన.

## మీనరాశి

**పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.**

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి పనిలో అభివృద్ధి ఉంటుంది. మంచి ముహూర్తంలో ప్రారంభించిన సమయం మీ అదృష్టం ఉంటుంది. చాలా సంతోషంగా హుషారుగా ఉంటారు. మనసులో ఏ విధమైన ఆందోళన లేకుండా నూతన ఒరవడితో ముందుకు సాగండి.

శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. కలలో పాము కనిపించినందుకు గోవిందదాసు ఏమనుకున్నారు?
2. కార్తీకంలో శ్రీహరి పేరేమిటి?
3. స్వామివారికి వెంగమాంబ ముత్యాల హారతి ఎప్పుడు ఇస్తారు?
4. గోవిందదాసు ఎవరిని గురువుగా భావించారు?
5. కార్తీక శుద్ధ ఏకాదశిని ఏమంటారు?
6. కుమార షష్ఠి ఎప్పుడు?
7. తెలుగుదేశంలో కుమారస్వామి క్షేత్రమేది?
8. సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రం ఎవరి రచన?
9. ఆంజనేయుని నీడను పట్టి లాగింది ఎవరు?
10. శ్రీవారిని వాయుదేవుడు కోరిన వరమేమిటి?
11. బ్రహ్మరాక్షసుని మార్చిన భక్తుడెవరు?
12. బ్రహ్మోత్సవాలలో భద్రతా పర్యవేక్షణ ఎవరు చేస్తారు?
13. కృత్తిక నక్షత్రం దేనికి సంకేతం?
14. బ్రహ్మోత్సవాలలో అమ్మవారు 3వ రోజున ఏ రూపం ధరిస్తుంది?
15. కబీరుదాసు భార్య ఎవరు?

1. ..............................
2. ..............................
3. ..............................
4. ..............................
5. ..............................
6. ..............................
7. ..............................
8. ..............................
9. ..............................
10. ..............................
11. ..............................
12. ..............................
13. ..............................
14. ..............................
15. ..............................

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. వాసుకి, 2. కార్తీక ద్వాదశి, 3. ఆండాళ్, 4. విశ్వజిత్తు 5. శృంగి, 6. పరీక్షిత్తు, 7. అరుణాసురుని, 8. వెంగమాంబ, 9. కాళరాత్రి, 10. వరుణ దేవుని, 11. వెంగమాంబ, 12. అనంతాళ్వార్, 13. తరిగొండ లోని శ్రీలక్ష్మీ నరసింహుని ఆలయంలో, 14. వారాహీదేవిని, 15. కంకుభట్టు

## సరైన సమాధానాలు రాసినవారు

1. చింతలపాటి శివశంకర శాస్త్రి, 2. బులుసు బాబురావు, 3. చిల్లర సీతారామారావు, 4. రమాదేవి

పేరు: ______________________

చిరునామా: ______________________

______________________

______________________

______________________

పిన్‌కోడ్: ______________________

ఫోన్: ______________________

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

చిల్లర సీతారామారావు



RNI No.: APTEL/2008/23122 | Postal Registration No: HSE/879/2025-2027 | Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month | Posting at BPC-IV Patrika channel, Nampally, Hyderabad-01.



**If Un Delivered Please Return to:**

**SRI VENKATESHAM,**

**(Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda,
Hyderabad-500007.Ph: 040-27175050.

**డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు**
**https://www.srivenkatesham.org లో చదవండి.**

**Srivenkatesham Magazine in Google Drive**
https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq